fb/prajasakti, www.prajasakti.com

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajamahendravaram, Srikakulam, ongole and Ananthapuramu

సంపుటి : 38 సంచిక : 9 | విజయవాడ, మంగళవారం 9 జనవరి 2018 | 12 + 12 పేజీలు వెల : 4.00

ఏప్రిల్ 22 నుంచి ఎంసెట్

ఎపి సెట్ల షెడ్యూల్ విడుదల

2016-18 బిఎడ్, డిఎడ్ విద్యార్థులకు టెట్ అవకాశం

పరీక్షలన్నీ ఆన్‌లైన్‌లోనే

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వివిధ కోర్సుల్లో ప్రవేశానికి ఈఏడాది నిర్వహించే ఎపి సెట్ల షెడ్యూల్‌ను విజయవాడలోని ఎపి ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో విద్యా శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు సోమవారం విడుదల చేశారు. ఏప్రిల్ 19న ఎడ్‌సెట్, లా సెట్, ఏప్రిల్ 22 నుంచి 25 వరకూ ఎంసెట్ (ఇంజనీరింగ్), 26న ఎంసెట్ (బైపిసి), మే 2న ఐసెట్, 3న ఇసెట్, మే 10 నుంచి 12 వరకూ పిజిఇ సెట్, మే 4 నుంచి పిఇసెట్లను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. 2016-18 బిఎడ్, డిఎడ్ విద్యార్థుల విజ్ఞప్తి మేరకు వారికి టెట్‌కు అవకాశం కల్పిస్తున్నామని మంత్రి వెల్లడించారు. గతేడాదితో పోలిస్తే కాస్త ముందుగా ఈ పరీక్షలను నిర్వహిస్తున్నామని, అన్ని పరీక్షలు ఆన్‌లైన్‌లోనే ఉంటాయని తెలిపారు. వారం రోజుల్లో ఫలితాలు వెల్లడించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ ఏడాది ఎంసెట్ కోసం 115 నుంచి 150 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయనున్నామన్నారు. గతేడాది ఇంజనీరింగ్‌లో 1.36 లక్షల మిగతా 9లో



ఆకట్టుకుంటున్న పక్షుల పండుగ

ప్రజాశక్తి - సూళ్లూరుపేట

నెల్లూరు జిల్లా సూళ్లూరుపేటలో సోమవారం రెండోరోజు పక్షుల పండుగ కొనసాగింది. ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో వివిధ శాఖలు ఏర్పాటు చేసిన స్టాల్స్ సందర్శకులను ఆకట్టుకున్నాయి. పులికాట్ సరస్సు, నేలపట్టు పక్షుల కేంద్రంలో విదేశీ పక్షుల విన్యాసాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. విన్యాసాలను చూసేందుకు సందర్శకులు కిటకిటలాడారు. మైదానంలో ఉద్యానవన శాఖ ఏర్పాటు చేసిన పుష్పాలు, పండ్లు, కూరగాయల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. శ్రీహరి కోట సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్) భారత అంతరిక్ష పరిశోధన సంస్థకు చెందిన ప్రదర్శన వీక్షకులకు కనువిందు చేసింది.



త్రిపురలో ప్రచారం కోసం సిద్ధం చేసిన బిజెపి వాహనాలు

ఉగ్రవాదులతో బిజెపి దోస్తీ

త్రిపురలో అధికారం కోసం కుయుక్తులు

ఇండియా న్యూస్ నెట్‌వర్క్ - అగర్తల

త్రిపురలో సంకుచిత రాజకీయ ప్రయోజనాల కోసం బిజెపి బరితెగిస్తోంది. అధికారదాహంతో ఉగ్రవాదులతో సైతం చేతులు కలిపేందుకు కాషాయ పార్టీ వెనుకాడటం లేదు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తన ఉనికిని చాటుకునేందుకు తీవ్రవాద సంస్థతో బిజెపి చేతులు కలిపింది. నిషేధిత నేషనల్ లిబరేషన్ ఫ్రంట్ ఆఫ్ త్రిపుర (ఎన్ఎల్ఎఫ్‌టి)కి రాజకీయంగా అనుబంధ సంస్థగా చలామణి అవుతున్న ఇండిజీనియస్ పీపుల్స్ ఫ్రంట్ ఆఫ్ త్రిపుర (ఐపిఎఫ్‌టి - ఎన్‌సి) నేతలతో బిజెపి నేతలు బేరసారాలు కుదుర్చుకున్నారు. ఇందులో భాగంగా ఈ నెల 2న ఐపిఎఫ్‌టికి చెందిన ఐదుగురు కీలక సభ్యులు బిజెపిలో చేరారు. స్థానిక మీడియా కథనాల ప్రకారం..వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి, ఐపిఎఫ్‌టి ఎన్నికల పొత్తు పెట్టుకోనున్నాయి. త్రిపుర ఇప్పటికే చాలా చిన్న రాష్ట్రమైన సంగతి విస్మరించి 'ప్రత్యేక తిప్రా ల్యాండ్' రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలనే ఐపిఎఫ్‌టి డిమాండ్‌ను కూడా బిజెపి అంగీకరించింది. బిజెపి, ఐపిఎఫ్‌టి కూటమి కట్టనున్నాయన్న వార్తలపై సిపిఎం రాష్ట్ర కార్యదర్శి బిజన్ ధర్ స్పందిస్తూ మతోన్మాద, ఉగ్రవాద శక్తుల కలయిక అనైతిక పొత్తుగా అభివర్ణిస్తూ తీవ్రంగా ఖండించారు. శాంతికాముకులైన, ప్రజాతంత్ర సహృదయులైన త్రిపుర ప్రజానీకం ఇలాంటి నీతిమాలిన కూటమిని తిప్పికొడతారని చెప్పారు. గత కొన్ని నెలలుగా రాష్ట్రంలో జరుగుతున్న ఘటనలను చూస్తే బిజెపి-ఐపిఎఫ్‌టి (ఎన్‌సి) మతతత్వ, వేర్పాటువాద కూటమి ఇప్పటికే కొనసాగుతోందన్న విషయం స్పష్టమవుతోందని తెలిపారు. త్రిపురలో ఆదివాసీల మధ్య ఉద్రికత్తతలు సృష్టించి, హింసాత్మక చర్యలను ప్రేరేపించేందుకు ఐపిఎఫ్‌టి మిగతా 9లో

65 శాతం ఎస్‌బిఐ ఏటిఎంల్లో డబ్బుల్లేవు

రూ.లక్షల్లో అద్దె చెల్లింపు

2

సాగులో నూతన విధానాలు

ముఖ్యమంత్రి చంద్రబాబు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

'రాష్ట్రంలో వ్యవసాయంపై 60, 70 శాతం ప్రజలు జీవిస్తున్నారు. వ్యవసాయాభివృద్ధికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తూ నూతన విధానాలతో ముందుకు సాగుతోంది' అని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా తాళ్లపూడి మండలం వేగేశ్వరపురంలో మిగతా 9లో




తాళ్లపూడి మండలం వేగేశ్వరపురంలో ఏర్పాటు చేసిన ప్రదర్శనలో ఉంచిన చేపను తిలకిస్తున్న చంద్రబాబు



సిపిఎం ప్రకాశం జిల్లా 12వ మహాసభల సందర్భంగా సోమవారం కనిగిరిలో నిర్వహించిన భారీ ర్యాలీ వార్త 7లో

నేడు ప్రజాశక్తి రాష్ట్ర భవనానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్ ప్రతినిధి



ప్రజాశక్తి దినపత్రిక రాష్ట్ర భవన నిర్మాణానికి నేటి ఉదయం శంకుస్థాపన జరగనుంది. గుంటూరు జిల్లా తాడేపల్లి లోని అరవింద హైస్కూల్ సమీపంలో గల అమరారెడ్డి కాలనీలో మంగళవారం ఉదయం 11 గంటలకు ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బి.వి రాఘవులు శిలా ఫలకాన్ని ఆవిష్కరించిన అనంతరం ప్రజా శక్తి సంపాదకులు పాటూరు రామయ్య అధ్యక్షతన బహిరంగ సభ జరగనుంది. సభకు ముఖ్యఅతిథిగా రాష్ట్ర సమాచార, ప్రసారశాఖ మంత్రి కాల్వ శ్రీనివాసులు, విశిష్ట అతిథులుగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.కృష్ణయ్య, తాడేపల్లి మున్సిపల్ కమిషనర్ బి.శివారెడ్డి, స్ట్రక్చర్ ఇంజనీర్ వంగర శ్రీనివాసరావు, ప్రజాశక్తి సాహితీ సంస్థ ప్రధాన కార్యదర్శి ఎంవిఎస్ శర్మ, ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ ఎస్.వెంకట్రావు హాజరవుతారు. ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులే.

రాగూర్ గీతాంజలికి 'నృత్యాంజలి'

ప్రజాశక్తి - హైదరాబాద్

విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ రచించిన గీతాంజలి కావ్యాన్ని డాక్టర్ రాళ్లబండి కవితా ప్రసాద్ తెలుగు భాషలో నృత్య శైలిలో రూపకల్పన చేయగా ప్రముఖ నాట్యాచారిని మద్దాలి ఉషాగాయత్రి నేతృత్వంలో ఆమె శిష్యబృందం నయన మనోహరంగా కూచిపూడి నాట్య ప్రక్రియలో నర్తించారు. ప్రతి నర్తకి హావభావ ప్రదర్శనలో గురువుకు పోటీ పడుతూ నృత్యమాలికను ఆద్యంతం రక్తికట్టించారు. సౌందర్య, రమ్యవేణి, నీరజ, అర్చన తదితరులు నృత్య మాలికలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ కె.రోశయ్య మాట్లాడుతూ ఇతర భాషల్లో ఉన్న కావ్యాలను తెలుగులోకి అనువదించి ఇటువంటి ప్రదర్శనలు ఇచ్చినప్పుడు దేశ సమైఖ్యత పటిష్టంమైవుతుందన్నారు.



సామ్‌సంగ్ వితరణ

బొల్లారం ఆర్మీ పబ్లిక్ స్కూల్‌లో ఆధునికీకరించిన తరగతి గదులను పాఠశాల చైర్మన్ బ్రిగేడియన్ అజేయ్‌మాలిక్ సతీమణి అమితా మాలిక్ సోమవారం ఆవిష్కరించారు. కమ్యూనిటీ, సోషల్ రెస్పాన్సిబులిటీలో భాగంగా సామ్‌సంగ్ కంపెనీ పాఠశాలకు 40 స్మార్ట్ టేబుల్స్, ఎల్ఇడి స్క్రీన్‌లను అందజేశారు.



అవార్డులు ప్రదానం

దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ వినోద్‌కుమార్ యాదవ్ సోమవారం రైల్ నిలయంలో ఉన్నతాధికారులతో భద్రత, రైళ్ల సమయ పాలనపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఉత్తమ పనితీరు కనబరిచిన ఏడుగురు రైల్వే కార్మికులను మ్యాన్ ఆఫ్ ది మంత్ అవార్డుతో సత్కరించారు. ప్రయాణికుల భద్రతే ప్రధాన లక్ష్యమని జీఎం చెప్పారు.

రోడ్డు ప్రమాదాల్లో ఎనిమిది మంది మృతి

- బొలేరో బోల్తా పడి ఐదుగురు కూలీలు
- ట్రాక్టర్‌ను ఢీకొని మరో ఇద్దరు..కారు పల్టీకొట్టి ఇంకొకరు
- 30 మందికిపైగా గాయాలు
- ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఘటనలు
- కూలీల కుటుంబాలకు రూ.6 లక్షల చొప్పున ఇచ్చేందుకు సీడ్ ఆర్గనైజర్ల అంగీకారం



రోధిస్తున్న మృతుల కుటుంబ సభ్యులు

ప్రజాశక్తి - హైదరాబాద్

బొలేరోలో 40 మంది కూలీలను ఎక్కించిన యాజమాన్య నిర్లక్ష్యం...డ్రైవర్ నిద్రమత్తు వెరసి జోగులాంబ గద్వాల జిల్లాలో సోమవారం తెల్లవారు జామున జరిగిన ఘోర రోడ్డుప్రమాదంలో ఐదుగురు కూలీలు అక్కడికక్కడే చనిపోయారు. 29 మందికి గాయాలయ్యాయి. అందులో తొమ్మిది మంది కూలీల పరిస్థితి విషమంగా ఉంది. అలాగే, మహబూబ్‌నగర్ జిల్లాలో జరిగిన రోడ్డుప్రమాదంలో ఇద్దరు, నాగర్‌కర్నూల్ జిల్లాలో కారు పల్టీ కొట్టిన ఘటనలో ఒకరు మృతిచెందారు. నలుగురికి తీవ్రగాయాలు అయ్యాయి. ఈ ప్రమాదాల్లో మొత్తం ఎనిమిది మంది చనిపోయారు. పోలీసులు, కూలీల వివరాల ప్రకారం...ధరూర్ మండలం చిన్నపాడు, యమునోనిపల్లి గ్రామాలకు చెందిన కూలీలు ప్రతి రోజూ గద్వాలలో కొండపల్లి రోడ్డులో గల జేసీ రంగారెడ్డికి చెందిన పత్తిమిల్లులోకి పనికెళ్తున్నారు. రోజుమాదిరిగానే ఆదివారం సాయంత్రం పనికెళ్లారు. తిరిగి సోమవారం తెల్లవారుజామున పని అయిపోగానే బొలేరో వాహనంలో స్వగ్రామాలకు బయలు దేరారు. డ్రైవర్ నిద్రమత్తులో ఉండటంతో గద్వాల మండలపరిధిలోని గోనుపాడు దాటిన తర్వాత పార్చర్లమిట్ల వద్ద బొలేరో వాహనం అదుపు తప్పి పల్టీకొట్టింది. దీంతో చిన్నపాడుకు చెందిన కమ్మరి లోహిత్(35), కమ్మరి గీతమ్మ(35), కోట్ల వెంకటన్న(40), కొత్త బాయి వెంకటన్న (35) యమినోనిపల్లికి చెందిన అరుణ(18) అక్కడికక్కడే చనిపోయారు. మరో 29 మంది కూలీలకు గాయాలయ్యాయి. అందులో తొమ్మిది మంది పరిస్థితి విషమంగా ఉంది. వారిని డీఎస్పీ సురేందర్‌రావు పర్యవేక్షణలో గద్వాల ఏరియాస్పత్రికి తరలించి చికిత్స అందించారు. తీవ్రంగా గాయపడిన కర్నూల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చిన్నపాడుకు చెందిన నలుగురు కూలీలు చనిపోవటంతో ఆ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. జిల్లా కలెక్టర్ రజత్‌కుమార్ సైనీ, ఎస్పీ విజయ్‌కుమార్ ఘటన స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరు గురించి తెలుసుకున్నారు. మాజీ ఎమ్మెల్యే భరతసింహారెడ్డి, టీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, జెడ్పీ చైర్మెన్ బండారి భాస్కర్, మార్కెట్‌యార్డు చైర్మెన్ బండ్ల లక్ష్మీదేవమ్మ గద్వాల ఏరియాస్పత్రికి చేరుకుని మృతుల బంధువులను ఓదార్చారు.

మృతుల కుటుంబాలకు రూ.6లక్షల ఎక్స్‌గ్రేషియా

మృతుల కుటుంబాలకు సీడ్ పత్తి ఆర్గనైజర్లు రూ. 6లక్షల ఎక్స్‌గ్రేషియా ఇచ్చేందుకు ఒప్పుకున్నారు. సీడ్‌పత్తి ఆర్గనైజర్లతో రాజకీయ నాయకులు, వివిధ ప్రజా సంఘాల నాయకులు ఆర్డీఓ కార్యాలయంలో చర్చించారు. మృతుల కుటుంబాలకు రూ. 6 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇస్తామని, గాయపడిన వారి వైద్య ఖర్చులు భరిస్తామని సీడ్‌పత్తి ఆర్గనైజర్లు హామీ ఇచ్చారు.

వేరే ప్రమాదాల్లో...

మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలం గోటూరు గ్రామానికి చెందిన గడ్డమోని వేణు (14), గడ్డమోని రాజు (17) డీజిల్ తేవడానికి ద్విచక్ర వాహనంపై వెళ్లి ప్రమాదానికి గురయ్యారు. వారు నాగారం గేటు సమీపంలో ఆగి ఉన్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొట్టారు. ఇద్దరూ అక్కడికక్కడే చనిపోయారు. హైదరాబాద్ బోయిన్‌పల్లికి చెందిన ప్రసాద్(40) మరి కొందరితో కలిసి కారులో శ్రీశైలం వెళ్లి తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో కారు నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి గేటు సమీపానికి రాగానే బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో ప్రసాద్(40) అక్కడిక్కడే దుర్మరణం చెందగా, మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం హైదరాబాద్ తరలించారు.

బ్రాహ్మణీయ హిందూ ఫాసిజాన్ని ఓడిద్దాం



విరసం మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వరవరరావు, తదితరులు

- విరసం నేత వరవరరావు
- ఆదివాసీలపై పెరుగుతున్న దాడులు ఆందోళనకరం

ప్రజాశక్తి - హైదరాబాద్

బ్రాహ్మణీయ హిందూ ఫాసిజాన్ని ఓడిద్దామని విరసం నేత వరవరరావు, కాశీం అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో విప్లవ రచయితల సంఘం ఆధ్వర్యంలో 26వ మహాసభల పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశంలో బ్రాహ్మణీయ హిందూ ఫాసిజం వేగంగా విస్తరిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. నాలుగు గోడల మధ్య ప్రజల వ్యక్తిగతానికి పరిమితం కావాల్సిన మతం పాలకవర్గ రాజకీయ ఆర్థిక పునాది మీద ఫాసిజంగా మారుతుందన్నారు. తెలంగాణలో ఆదివాసీలపై దాడులు పెరిగాయని, బ్రిటీష్ పాలనలో కూడా ఇలాంటి దుర్మార్గమైన దాడులు లేవని అన్నారు. దేశంలో బీజేపీ పాలనలో హిందూ రాజ్యం కోసం ఆరాటపడుతున్నారని, ఇందుకు ఉదాహరణ ఉత్తరప్రదేశ్‌లోని ప్రభుత్వ కార్యాలయాలకు కాషాయపు రంగులు వేయడమేనని అన్నారు. ఈ క్రమంలో విప్లవ రచయితల సంఘం 26వ మహాసభలను 13, 14 తేదీల్లో మహబూబ్‌నగర్‌లో నిర్వహిస్తున్నామని, ఈ మహాసభల్లో బ్రాహ్మణీయ హిందూ ఫాసిజాన్ని ఓడించడమే లక్ష్యంగా విధానాలు రూపొందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో విరసం నేతలు గీతాంజలి, అరవింద్ పాల్గొన్నారు.

గణతంత్రదినోత్సవ వేడుకలకు ఏర్పాటు

- అధికారులకు సిఎస్ ఆదేశం

ప్రజాశక్తి - హైదరాబాద్

గణతంత్రదినోత్సవ వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్ ఆదేశించారు. సోమవారం సచివాలయంలో ఘణతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణపై ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సాధారణ పరిపాలన శాఖ ముఖ్యకార్యదర్శి అధర్ సిన్హా, గవర్నర్ ముఖ్యకార్యదర్శి హరిప్రీత్ సింగ్, రోడ్లు, భవనాల శాఖ ముఖ్య కార్యదర్శి సునీల్ శర్మ, జలమండలి యండీ దానకిషోర్, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ రావు తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే గణతంత్రదినోత్సవ వేడుకకు గవర్నర్ నరసింహన్ ముఖ్యఅతిథిగా హాజరవు తారని తెలిపారు. అక్కడ అవసరమైన పోలీస్ బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ ఏర్పాట్లను చేపట్టాలని పోలీస్ శాఖను ఆదేశించారు. వేడుకల సందర్భంగా గన్‌పార్క్, క్లాక్ టవర్, ఫతే మైదాన్‌లను విద్యుత్ దీపాలతో అలంకరించాని, నిరంతర విద్యుత్ సరఫరా, పబ్లిక్ అడ్రస్ సిస్టం, ఎల్ ఈడీ టీవీలు, కామెంటేటర్ నియామకం లాంటి పనులను చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గణతంత్ర వేడుకలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయాలన్నారు.

డాక్టర్ గోపాలకిషన్‌కు జీవితకాల పురస్కారం

- ఐఎంఎలో ఘనంగా సన్మానించిన డాక్టర్లు

ప్రజాశక్తి - హైదరాబాద్

ప్రముఖ వైద్యులు, నెఫ్రాలజిస్టు డాక్టర్ గోపాలకిషన్‌కు జీవతకాల పురస్కార అవార్డు లభించినందున డాక్టర్లు ఘనంగా సన్మానించారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) హైదరాబాద్ సిటీ బ్రాంఛ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, డాక్టర్లు ఆయనను ప్రశంసలతో ముంచెత్తారు. తెలుగు రాష్ట్రాలకు ఇలాంటి అవార్డు రావడం ఇదే ప్రథమని తెలిపారు. ఇండియన్ నెఫ్రాలజీ సొసైటీ అవార్డును ప్రకటించడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో వైద్యవిద్య డైరెక్టర్ డాక్టర్ రమేష్ రెడ్డి, ఎంసీఐ చైర్మెన్ డాక్టర్ రవీందర్‌రెడ్డి, నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ మనోహర్, ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ నర్సింగరెడ్డి, ఐఎంఏ హైదరాబాద్ సిటీ బ్రాంచ్ కార్యదర్శి డాక్టర్ రవిశంకర్, తెలంగాణ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ పుట్ల శ్రీనివాస్ తదితరులు భారీగా పాల్గొన్నారు. కాగా, డాక్టర్ గోపాల కిషన్ ఉస్మానియా ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా పనిచేశారు. నెఫ్రాలజిస్టుగా రోగులకు సేవలు అందించారు.

త్వరలో బస్సు యాత్ర

- పనిమంతులకు సముచిత స్థానం
- సమష్టి కృషితో అధికారం : పిసిసి చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



మీడియాతో మాట్లాడుతున్న పిసిసి అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

రాష్ట్ర వ్యాప్తంగా త్వరలో బస్సుయాత్ర నిర్వహిస్తామని టిపిసిసి అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార రెడ్డి ప్రకటించారు. ప్రతిరోజు మూడు నియోజక వర్గాల పర్యటన ఉంటుందన్నారు. గాంధీభవన్‌లో సోమవారం ఆయన మీడియాతో పిచ్చాపాటిగా మాట్లాడారు. వచ్చే ఎన్నికలను సమష్టిగా ఎదుర్కుంటామని తెలిపారు. ఎన్నికల నాటికి రాష్ట్రంలో ఏ పార్టీ ఉండదని, టిఆర్ఎస్, కాంగ్రెస్ మధ్యనే పోటీ ఉంటుందని చెప్పారు. టిఆర్ఎస్‌ను ఓడించి అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేశారు. రాహుల్‌గాంధీ నాయకత్వంలో తెలంగాణతో పాటు కేంద్రంలోనూ అధికారంలోకి వస్తామని ఆయన తెలిపారు. పార్టీ కోసం కష్టపడే వారికి సముచిత స్థానం కల్పిస్తామని ఆయన ప్రకటించారు. 'ప్రతి కాంగ్రెస్ కార్యకర్త నా కుటుంబసభ్యుడే. వారికే కష్టం మొచ్చినా.. నా నెంబర్ 9848051082కు ఫోన్ చేయండి. సత్వరమే ఆదుకుంటా.' అని ఆయన ప్రకటించారు. మేడారం జాతర సందర్భంగా రాహుల్ పర్యటన ఉండే అవకాశం ఉందని తెలిపారు. సంక్రాంతి తరువాత టిపిసిసి కమిటీ వేస్తామని, ప్రచార కమిటీతో పాటు మెనిఫెస్టో కమిటీ కూడా వేస్తామన్నారు. సర్పంచ్ ఎన్నికలు ప్రత్యక్షంగానే జరగాలని ఆయన అభిప్రాయపడ్డారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాల్లో 14 అసెంబ్లీ, రెండు లోక్‌సభ స్థానాలను మనమే గెలుచుకుంటామని తను కలిసిన ఆ జిల్లా నేతలతో ఉత్తమ్ తెలిపారు.

మహిళలకు అవకాశాలు

రాబోయే రోజుల్లో మహిళలకు రాజకీయంగా మంచి అవకాశాలు వస్తాయని ఉత్తమ్ చెప్పారు. మహిళా కాంగ్రెస్ సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ చరిత్రలోనే మహిళ మంత్రి లేని క్యాబినెట్ తెలంగాణలోనే ఉందన్నారు. అధికారంలో లేకున్నా.. కాంగ్రెస్ పార్టీ మహిళలకు సముచిత స్థానం కల్పిస్తున్నదన్నారు. ఒక మహిళలకు ఎమ్మెల్సీగా అవకాశమివ్వడమే అందుకు సాక్షమని చెప్పారు.

గాంధీభవన్‌లో సంబరాలు

టిపిసిసి అధ్యక్షుడిగా రెండోసారి ఉత్తమ్ కుమారరెడ్డికే అవకాశమిచ్చిన సంగతి తెలిసిందే. రాహుల్‌గాంధీ నుంచి ఉత్తర్వులు వెలువడిన తరువాత తొలిసారి గాంధీభవన్‌కు ఉత్తమ్ రావడంతో ఆ పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి అభినందనలు తెలిపారు.

మాట్లాడితే జైల్లో పెడుతున్నారు : జగ్గారెడ్డి

రాష్ట్రంలో ప్రజాస్వామ్యం లేకుండా పోయిందని టిపిసిసి అధికార ప్రతినిధి జగ్గారెడ్డి వ్యాఖ్యానించారు. ప్రజా సమస్యలపై మాట్లాడితే చాలు జైల్లో పెడుతున్నారన్నారు. గాంధీభవన్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎస్సి వర్గీకరణ కోసం ఉద్యమిస్తున్న మంద కృష్ణను రెండుసార్లు జైల్లో పెట్టడాన్ని ఆయన ప్రశ్నించారు. ఆయనను అరెస్ట్ చేస్తే.. టిఆర్ఎస్‌లో ఉన్న ఒక్క మాదిగ ఎమ్మెల్యే మాట్లాడరా.? అని అన్నారు. గవర్నర్ నరసింహన్ టిఆర్ఎస్ కార్యకర్తలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

ఘనంగా గాడియం స్కూల్ క్రీడోత్సవాలు

ప్రజాశక్తి - హైదరాబాద్



గాడియం స్కూల్ వేడుకల్లో విద్యార్థులతో జిహెచ్ఎంసి కమీషనర్ జనార్ధన్ రెడ్డి

గాడియం స్కూల్ మూడవ క్రీడోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నట్లు ఆ సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. విజయవంతంగా మూడు సంవత్సరాలను పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రతిభ, సృజనాత్మకత, ఆకర్షణల మేలు కలయికతో గచ్చిబౌలి జిహెచ్ఎంసి బాలయోగి అథ్లెటిక్ స్టేడియంలో ఈ ఉత్సావాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొంది. వేల మంది హాజరైన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిహెచ్ఎంసి కమీషనర్ జనార్ధన్ రెడ్డి హాజరుకాగా, స్కూల్ చైర్మెన్ నిత్యానంద్ రెడ్డి, డైరెక్టర్ కీర్తిరెడ్డి కోశాధికారి సుధాకర్ రెడ్డి పాల్గొన్నారని పేర్కొంది. వార్షికోత్సవ కార్యక్రమానికి హాజరైన అతిథులు గాలిలోకి బెలూన్లను విడిచిపెట్టి కార్యక్రమం ప్రారంభమైనట్లుగా ప్రకటించగా, ఆ తరువాత క్రీడాజ్యోతిని వెలిగించగా దానిని విద్యార్థులు పరుగుతో ఒకరికొకరు అందించుకోవడం జరిగిందని తెలిపింది.

మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి రాజీనామా

- త్వరలో టిఆర్ఎస్‌లో చేరిక

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాపరెడ్డి బిజెపికి రాజీనామా చేశారు. ఆయనతో పాటు జనగామ, సిద్దిపేట జిల్లాలకు చెందిన పలువురు నేతలు, తన అనుచరులతో కలసి మరికొద్ది రోజుల్లో ఆయన టిఆర్ఎస్‌లో చేరబోతున్నారు. రెండేళ్లుగా టిఆర్ఎస్, కాంగ్రెస్ నుంచి అనేక మంది తమతో టచ్‌లో ఉన్నారని, తగిన సమయంలో చేరుతారంటూ బిజెపి నేతలు పెద్ద ఎత్తున ప్రచారం చేసుకుంటున్నారు. ఏడాది గడుస్తున్నా.. ఆ పార్టీలో చెప్పుకోదగ్గ నేతలు ఎవరూ చేరలేదు. పైగా ముఖ్యమైన నేతలైన ముగ్గురు మాజీ ఎమ్మెల్యేలు పార్టీని వీడారు.

క్రమ శిక్షణ లోపించినందునే : కొమ్మూరి

క్రమశిక్షణ లోపించినందునే.. బిజెపికి రాజీనామా చేశానని మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాపరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన హైదరాబాద్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత ఎన్నికల ముందు నుంచి బిజెపిలో కొనసాగుతున్నానని తెలిపారు. పార్టీని బలోపేతం చేయడానికి ప్రయత్నించానని చెప్పారు. ప్రజల అభీష్టం మేరకే నిర్ణయం తీసుకుంటానని, హరీశ్‌రావును కలవడానికి, రాజీనామాకు సంబంధం లేదన్నారు.

ప్రయివేటు ఉద్యోగాలే ప్రత్యామ్నాయం

- వృద్ధిరేటులో రాష్ట్రం నం.1
- ఎన్నికల నాటికి ఇంటింటికీ తాగునీరు : మంత్రి కెటిఆర్

ప్రజాశక్తి - కల్చరల్

రాష్ట్రంలో ప్రభుత్వరంగ సంస్థల్లో 4లక్షల ఉద్యోగాలు మాత్రమే ఉన్నాయని, ఉద్యోగ విరమణ, ఖాళీలతో కలిపి లక్షకు మించి కొత్త ఉద్యోగాలు ఇవ్వలేమని, అందువల్ల ప్రయివేటు ఉద్యోగాలే ప్రత్యామ్నాయమని ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. వృద్ధిరేటులో రాష్ట్రం నెం.1గా నిలిచిందని, దేశంతో పోల్చితే రెట్టింపుగా ఉందని చెప్పారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలో రూ.25 కోట్లతో నిర్మించనున్న ఐటీ టవర్‌కు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం బహిరంగ సభలో మంత్రి మాట్లాడుతూ.. ఎన్నికల నాటికి ఇంటింటికీ తాగునీరుతోపాటు ప్రతి ఎకరాకూ సాగు నీరు కూడా అందిస్తామని చెప్పారు. నీళ్లు, నిధులు, నియామకాలు అన్న మాటలు నిలబెట్టుకుంటున్నామని అన్నారు. రాష్ట్రంలో పొద్దుపోని బీజేపీ నాయకులు మాత్రమే విమర్శలకు దిగుతున్నారని, కేంద్ర మంత్రులు మాత్రం తమను కీర్తిస్తున్నారని గుర్తు చేశారు. ప్రయివేటు ఉద్యోగాల్లోనూ ఐటీ ఉద్యోగాలే ప్రథమ స్థానంలో ఉన్నాయని చెప్పారు. రాష్ట్రం వచ్చే నాటికి ఐటీ ఎగుమతులు రూ.56వేల కోట్లు ఉండగా, మూడేండ్లలో అవి రూ.87వేల కోట్లకు చేరుకున్నాయని తెలిపారు. ఐటీలో లక్ష ఉద్యోగాలు వస్తే అంతకు మూడు రెట్లు వాటి అనుబంధ, ఆధారిత రూపాల్లో ఉంటున్నాయని చెప్పారు. ద్వితీయశ్రేణి నగరాల్లో ఐటీ అభివృద్ధిలో భాగంగానే కరీంనగర్‌కు వచ్చామన్నారు. శంకుస్థాపన నాటికే 8 ఐటీ కంపెనీలు రావడంతోపాటు వెయ్యి ఉద్యోగాలకు అవకాశం దొరికిందని చెప్పారు. పెట్టుబడులను ఆహ్వానించేందుకు స్థానిక ఎంపీ, ఎమ్మెల్యే విదేశాలకు వెళ్లనున్నారని తెలిపారు. కరీంనగర్‌లో ఉన్న డిమాండ్‌ను బట్టి మరో రూ.25 కోట్లతో రెండో టవర్ నిర్మాణం చేపడుతామని హామీ ఇచ్చారు. ప్రపంచంలోని ఐటీ రంగంలో వంద కంపెనీల్లో మన మేధావులే ఉన్నారని తెలిపారు.

టిఆర్‌టికి 2,77,574 దరఖాస్తులు

- ఎస్ఎకు 1,45,158, ఎన్‌జిటికి 89,149
- నేటి నుంచి వివరాలు సవరణలకు అవకాశం
- టిఎస్‌పిఎస్‌సి వెల్లడి

ప్రజాశక్తి - కల్చరల్

ఉపాధ్యాయ నియామక పరీక్ష (టీఆర్టీ) రాతపరీక్షలకు రాష్ట్రవ్యాప్తంగా 2,77,574 దరఖాస్తులొచ్చాయి. ఇందులో స్కూల్ అసిస్టెంట్ (ఎస్ఏ)కు 1,45,158 మంది, సెకండరీ గ్రేడ్ టీచర్స్ (ఎస్జీటీ)కి 89,149 మంది, భాషా పండితులు (ఎల్పీ)కి 24,219 మంది, స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ ఎడ్యుకేషన్)కు 2,177 మంది, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ (పీఈటీ)కి 16,871 మంది చొప్పున మొత్తం 2,77,574 మంది దరఖాస్తు చేశారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) కార్యదర్శి ఎ వాణీప్రసాద్ సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆదివారం అర్ధరాత్రితో టీఆర్టీకి దరఖాస్తు చేసే గడువు ముగిసిన విషయం తెలిసిందే. పాత పది జిల్లాల ప్రాతిపదికన 8,792 ఉపాధ్యాయ నియామకాలకు 2017, అక్టోబర్ 21న టీఆర్టీ నోటిఫికేషన్ విడుదలైంది. ఆన్‌లైన్ దరఖాస్తుల దాఖలులో అభ్యర్థులు వారి వివరాలను భర్తీ చేయడంలో కొన్ని తప్పులు చేశారని తెలిపారు. బయోడేటా, ఇతర వివరాలు సవరణ కోసం మంగళవారం ఈనెల 11వ తేదీ వరకు టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్ ద్వారా అవకాశముందని పేర్కొన్నారు. సరైన వివరాలతో దరఖాస్తు చేయడం అభ్యర్థుల బాధ్యత అని తెలిపారు. వివరాలు సరిచేసుకునేందుకు, తప్పులను సరిదిద్దుకునేందుకు అవకాశం కల్పించామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని అభ్యర్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

ఫిబ్రవరి 24 నుంచి 28 వరకు రాతపరీక్షలు

టీఆర్టీ రాతపరీక్షలు ఫిబ్రవరి 24 నుంచి 28వ తేదీ వరకు నిర్వహించాలని టీఎస్‌పీఎస్సీ నిర్ణయించింది. మార్చి 1 నుంచి 5 వరకు టీఆర్టీ రాతపరీక్షల ప్రాథమిక కీ విడుదల కానుంది. వాటిపై అభ్యంతరాలను మార్చి 2 నుంచి 10వ తేదీ వరకు స్వీకరిస్తారు. మార్చి 25న తుది కీ విడుదలవుతుంది. ఏప్రిల్ 16 నుంచి 20వ తేదీ వరకు టీఆర్టీకి ఎంపికైన అభ్యర్థులకు ధ్రువపత్రాల పరిశీలన జరుగుతుంది. మే 10న టీఆర్టీ నియామకాల జాబితా విడుదలవుతుంది. వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభం నాటికి ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందించే దిశగా టీఎస్‌పీఎస్సీ చర్యలు చేపట్టింది.

సంక్షిప్తం

'నేతి'కి మాతృవియోగం

ప్రజాశక్తి - హైదరాబాద్

శాసనమండలి డిప్యూటీ చైర్మెన్ నేతి విద్యాసాగర్ తల్లి నేతి రాధమ్మ (94) అనారోగ్యంతో సోమవారం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో మృతిచెందింది. ఆమె అంత్యక్రియలు నేతి సొంత గ్రామమైన నల్లగొండ జిల్లా కేతెపల్లి మండలం చెరుకుపల్లిలో నిర్వహించారు. ఆమె మృతదేహాన్ని శాసనమండలి చైర్మెన్ వంగాల స్వామిగౌడ్, విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు కె.కేశవరావు, ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డి, నల్లగొండ, సూర్యాపేట జిల్లాల కలెక్టర్‌లు గౌరవ ఉప్పల్, సురేందర్ మోహన్ సందర్శించి నివాళులర్పించారు.

గానసభలకు వంశీ వితరణ

ప్రజాశక్తి - కల్చరల్

గానసభ అభివృద్ధికి వంశీ ఇంటర్‌నేషనల్ అధినేత వంశీరామరాజు 60 వేల రూపాయల నగధును వితరణగా ప్రకటించారు. సోమవారం జరిగిన పత్రికా విలేకరుల సమావేశంలో చెక్కును గానసభ అధ్యక్షుడు కళాజనార్ధనమూర్తికి అందజేశారు. 3 ఆడిటోరియంలు ఉచితంగా కార్యక్రమాలకు ఇస్తున్న గానసభ పాలకవర్గాన్ని అభినందిస్తూ రామరాజు గానసభను మరింత తీర్చిదిద్దేందుకు విరాళం ఇస్తున్నారని తెలిపారు. మూర్తి ఇతరులు కూడా రామరాజును స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు.

10న బాలుకు ఏసుదాసు పురస్కారం

ప్రజాశక్తి - కల్చరల్

ప్రఖ్యాత గాయకుడు ఎస్.పి బాల సుబ్రహ్మణ్యంకు మరో విఖ్యాత గాయకుడు ఏసుదాసు పేరిట పురస్కారాన్ని బహుకరింస్తున్నట్టు శ్రీకృష్ణ స్వరరాగ ప్రవంతి వ్యవస్థాపకుడు వై.ఎస్ రామకృష్ణ తెలిపారు. రవీంద్ర భారతిలో ఈనెల 10 జరిగే మెగా కార్యక్రమం మధ్యాహ్నం 2 గంటలకే 40 మంది గాయనీ గాయకుల పాటలతో ప్రారంభం ఉంటుందని ఆయన వివరించారు. ముఖ్య అతిథిగా రాజ్య సభ సభ్యుడు డాక్టర్ టి.సుబ్బిరామిరెడ్డి, మంత్రి పి.మహేందర్‌రెడ్డి వంశీరామరాజు పాల్గొంటారు.

సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌లో బల్దియా మరో విజయం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



కంపోస్ట్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న నగర మేయర్ బొంతు రామ్మోహన్

వ్యర్థ పదార్థాల నిర్వహణలో జీహెచ్ఎంసీ మరో ఘనతను సాధించింది. పెద్ద పరిమాణంలో చెత్తను ఉత్పత్తి చేసే సంస్థలు విధిగా కంపోస్ట్ యూనిట్లను ఏర్పాటు చేసుకోవాలని గత కొద్ది కాలంగా చేస్తున్న కృషిలో భాగంగా ఇండియాలోనే అతిపెద్ద వ్యాపార సంస్థ అయిన రాజేంద్రనగర్‌లోని వాల్‌మార్ట్ ఇండియా స్టోర్స్ అత్యాధునిక కంపోస్ట్ యూనిట్‌ను సోమవారం ప్రారంభించింది. దాదాపు పది లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన ఈ కంపోస్ట్ యూనిట్‌ను నగర మేయర్ బొంతు రామ్మోహన్ ప్రారంభించారు. కేవలం 24గంటల్లోనే ఈ కంపోస్ట్ యూనిట్ ద్వారా ఎరువుల తయారీ అవుతుంది. ప్రతిరోజు దాదాపు 50కిలోల పరిమాణం కలిగిన తడి చెత్తను ఈ యూనిట్‌లో వేసే అవకాశం ఉంటుంది. ఈ సందర్భంగా నగర మేయర్ బొంతు రామ్మోహన్ మాట్లాడుతూ స్వచ్ఛ హైదరాబాద్ సాధనలో భాగంగా బల్క్ గార్బేజ్ ఉత్పత్తిచేసే ప్రతి సంస్థ కంపోస్ట్ యూనిట్‌ను విధిగా ఏర్పాటు చేసుకోవాలని స్పష్టం చేశారు. ఎవరి ఇంట్లో, హోటళ్లలో ఉత్పత్తి అయ్యే చెత్తను అక్కడే వేరుచేసి కంపోస్ట్ యూనిట్లను ఏర్పాటు చేసుకుంటే అధికంగా లాభం కలగడంతో పాటు జీహెచ్ఎంసీపై భారం తగ్గుతుందని అన్నారు. స్వచ్ఛ భారత్ నిబంధనలను అనుసరించి ప్రతి హోటల్, రెస్టారెంట్‌లతో పాటు 50కిలోల కన్నా అధికంగా గార్బేజ్ ఉత్పత్తి చేసే ప్రతి సంస్థ విధిగా కంపోస్ట్ యూనిట్‌ను ఏర్పాటు చేయాల్సి ఉంటుందని అన్నారు. ఇప్పటికే హైదరాబాద్ నగరాన్ని బహిరంగ మలమూత్ర విసర్జన రహిత నగరంగా స్వచ్ఛ భారత్ మిషన్ ప్రకటించిందని ఇదే స్ఫూర్తితో స్వచ్ఛ సర్వేక్షణ్-2018లో హైదరాబాద్ నగరాన్ని అగ్రస్థానంలో నిలిపేందుకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి అడిషనల్ కమిషనర్ రవికిరణ్, వాల్‌మార్ట్ ఇండియా జనరల్ మేనేజర్ తదితరులు పాల్గొన్నారు.

కోర్టు ధిక్కారణ కేసులో కర్నూలు కలెక్టర్ కారు జప్తు

ప్రజాశక్తి - కర్నూలు లీగల్

బాధితులకు నష్టపరిహారం చెల్లించాలనే కోర్టు ఆదేశాలను ధిక్కరించిన కర్నూలు జిల్లా కలెక్టర్ కారు జప్తునకు మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి వెంకటశేషుబాబు ఆదేశాలు జారీ చేశారు. శ్రీశైలం ప్రాజెక్టులో 1993లో లారీ ప్రమాదం కేసులో ముగ్గురు వ్యక్తులు మరణించగా నష్టపరిహారం చెల్లించాలని ఫస్ట్ అడిషనల్ జిల్లా కోర్టులో కేసు నమోదు చేసుకున్నారు. ఇందులో మరణించిన ముగ్గురికి నష్టపరిహారం చెల్లించాలని కోర్టు తీర్పునిచ్చింది. తీర్పును అమలు చేయనందున అర్జీదారులు పుష్పలత, గురువమ్మ, ఆశీర్వాదమ్మలు తమ న్యాయవాది ద్వారా మరోసారి నష్టపరిహారం చెల్లించాలని అర్జీ పెట్టుకున్నారు. ఈ మేరకు కలెక్టర్ కారు జప్తునకు ఆదేశాలు జారీ చేశారు.



విజయవాడ బుక్ ఫెస్టివల్ సందర్భంగా నిర్వహించిన సాహిత్యం-సమాజం కార్యక్రమంలో మాట్లాడుతున్న సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు

మాతృభాషతో పుస్తక విజ్ఞానం

సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్

మాతృభాష చదివిన వారికి పుస్తక విజ్ఞానం వస్తుందని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు అన్నారు. విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యంలో స్వరాజ్యమైదాన్‌లో జరుగుతున్న 29వ పుస్తక మహోత్సవ్‌లో భాగంగా సోమవారం సాయంత్రం సాహిత్యం-సమాజం కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ప్రధాన వక్తగా రాఘవులు పాల్గొని మాట్లాడారు. విద్యార్థులతోపాటు, ప్రతి ఒక్కరికీ సామాజిక దృష్టి అవసరమని తెలిపారు. ఇటీవల ఎక్కువగా ఆధ్యాత్మిక పుస్తకాలు వస్తున్నాయని, ఎక్కువ మంది వీటిపట్ల ఆసక్తి చూపుతున్నారని తెలిపారు. ప్రభుత్వాలు కూడా విద్యా విధానంలో మార్పులు చేయాల్సిన అవసరముందని పేర్కొన్నారు. విద్యార్థులకు సబ్జెక్టు విద్యనందించడంతోపాటు సామాజిక ధృక్కోణాన్ని పెంపొందించే విద్యా విధానం ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్థానిక భాషను అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మాతృభాషగా తెలుగుభాషను అభివృద్ధి పరచడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, దీనికి కారణం ప్రపంచీకరణ అన్నారు. విద్యార్థులకు సామాజిక విద్యనందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సభకు అధ్యక్షత వహించిన విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ అధ్యక్షులు ఎస్.వెంకట నారాయణ మాట్లాడుతూ.. విద్యార్థులు సాహిత్యం పట్ల ఆసక్తి పెంచుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ సమాజం, సాహిత్యం గురించి తెలుసుకోవాలని, అందుకు పుస్తకాలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. కార్యక్రమంలో విజయవాడ పుస్తక మహోత్సవ్ సమన్వయకర్త బి.బాబ్జి, బుక్ ఫెస్టివల్ సొసైటీ కార్యదర్శి వి.లక్ష్మయ్య పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.



ప్లాట్ల రిజిస్ట్రేషన్ల మందగమనం

- మౌలిక సదుపాయాల కోసం రైతుల పట్టు
- 59 వేల ప్లాట్లకుగాను 3000 ప్లాట్లకు రిజిస్ట్రేషన్లు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాజధాని గ్రామాల్లో ప్లాట్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ మందగమనంగా సాగుతోంది. ప్లాట్ల రిజిస్ట్రేషన్ల కోసం ఎక్కువ మంది రైతులు వేచిచూసే ధోరణిలో ఉన్నారు. మొత్తం 33 వేల ఎకరాల భూమిని రైతులు సిఆర్‌డిఎకు అప్పగించారు. ఇందుకు సంబంధించి 23,600 మంది రైతులకు 59,200 ప్లాట్లు కేటాయించారు. ఈ ప్లాట్లకు సంబంధించిన భూమిని తొలుత రైతులు సిఆర్‌డిఎకు రిజిస్టర్ చేయాలి. తిరిగి సిఆర్‌డిఎ రైతులకు వ్యక్తిగతంగా ప్లాట్లు రిజిస్ట్రేషన్లు చేయాల్సి ఉంది. ఇందుకోసం తుళ్లూరులో ఒక జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం, రాజధాని ప్రాంతంలో మొత్తం నాలుగు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను ఏర్పాటు చేశారు. 29 గ్రామాల్లో రైతులకు దశలవారీగా ప్లాట్లు కేటాయించారు. ఫీజేమీ చెల్లించకుండా రైతులకు ప్లాట్ రిజిస్ట్రేషన్లు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే తమకు క్షేత్ర స్థాయిలో అభివృద్ధి చేసిన ప్లాట్ అందించే వరకూ రిజిస్ట్రేషన్లకు అంగీకరించబోమని రైతులు చెబుతున్నారు.

మొత్తం 59,200 ప్లాట్లకు సంబంధించి ఇప్పటి వరకూ కేవలం 3 వేల రిజిస్ట్రేషన్లు మాత్రమే అయినట్లు అధికారులు తెలిపారు. భూ సమీకరణలో భూము లిచ్చిన రైతులకు అభివృద్ధి చేసిన ప్లాట్ల కేటాయింపు నకు ప్రభుత్వం మూడేళ్ల కాలపరిమితిని కేటాయించి ంది. 2014 డిసెంబరులో ప్రారంభమైన సమీకరణ ప్రక్రియ 2015 ఫిబ్రవరి 28వ తేదీతో అధికారికంగా ముగిసింది. ఏడాది తర్వాత ప్లాట్ల కేటాయింపు ప్రారంభించారు. ఈ ప్రక్రియ ముగిసినా ఇప్పటి వరకూ రైతులకు కేటాయించిన ప్లాట్ల వద్ద మౌలిక సదుపాయాలకు సంబంధించి ప్రక్రియ వేగం పుంజుకోలేదు. ప్రభుత్వం నిర్దేశించిన గడువు ప్రకారం 2018 ఫిబ్రవరి నాటికి లే అవుట్లలో మౌలిక సదుపాయలు కల్పించి రిజిస్ట్రేష న్లు పూర్తి చేయాలి. అయితే మౌలిక సదుపా యాల కల్పనకు దాదాపు రూ.35 వేల కోట్ల వరకూ ఖర్చువుతాయని సిఆర్‌డిఎ అధికారులు అంచనా వేశారు. ఇంత నిధులు ప్రభుత్వం వద్ద లేకపోవడంతో మౌలిక సదుపాయాల కల్పన మందగమనంగా సాగుతోంది. "ముందుగా రిజిస్ట్రేషన్లను ముగించుకోండి. తర్వాత మేము మౌలిక సదుపాయాలు కల్పిస్తాము" అని సిఆర్‌డిఎ అధికారులు చెబుతున్నా రైతులు విశ్వసించడం లేదు. ఈ ప్రక్రియ పూర్తయితే మౌలిక సదుపాయాల గురించి ఎవ్వరూ పట్టించుకోరని, అప్పుడు తమ ప్లాట్ ఎక్కడ ఉందో కూడా తెలుసుకోవడం కష్టమని కొంత మంది రైతులు వాపోతున్నారు.

తిరుపతి కోర్టు సంచలన తీర్పు

సివిల్ కేసులో పోలీసు అధికారులకు భారీ జరిమానా

ప్రజాశక్తి-తిరుపతి సిటి

సివిల్ కేసులో తలదూర్చిన నలుగురు పోలీసు అధికారులకు రూ.14 లక్షల భారీ జరిమానా విధిస్తూ తిరుపతి కోర్టు సోమవారం సంచలన తీర్పు ఇచ్చింది. భూవివాదాంలో తలదూర్చి అక్రమంగా కేసులు పెట్టి బాధితులను వేధింపులకు గురి చేసిన పోలీసు అధికారులపై న్యాయస్థానం కన్నెర చేసింది. వివరాల్లోకెళితే.. తిరుపతి రూరల్ మండలం అవిలాల పంచాయతీ ఓటేరు గ్రామంలోని సర్వే నెంబరు 377లో పలువురు రైతులకు చెందిన భూమిపై రియల్ ఎస్టేట్ వ్యాపారులు కన్నేశారు. ఈ విషయంలో బాధిత రైతులకు అండగా నిలిచిన న్యాయవాది ఎంఎస్ఎం ప్రసాద్, ఎక్సైజ్ సిఐ చంద్రశేఖర్‌నాయుడుపై పోలీసులు అక్రమ కేసులు బనాయించి, వేధింపులకు గురి చేశారు. ఈ భూమిపై కన్నేసిన ప్రత్యర్థులు ఒత్తిడి మేరకు 2004 అక్టోబరు 2న రైతుల పక్షాన పోరాడుతున్న ఎంఎఎస్ఎం ప్రాసద్, చంద్రశేఖర్ నాయుడులపై తిరుచానూరు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ వ్యవహారంపై రిటైర్డు ఏఎస్‌పి తిమ్మప్ప, డిఎస్‌పి శ్రీకాంత్, నరసింహారెడ్డి, ఏఎస్ఐ బాలమురళీపై బాధితులు తిరుపతి కోర్టులో ప్రయివేట్ కేసు దాఖలు చేశారు. కోర్టు నలుగురు పోలీసు అధికారులపై వేర్వేరుగా సివిల్, క్రిమినల్ కేసులను నమోదు చేసింది. ఈ నలుగురు పోలీసు అధికారులు తిరుపతిలో పని చేస్తున్నందున తమకు న్యాయం జరగదన్న బాధితుల అభ్యర్థన మేరకు కేసును సత్యవేడు కోర్టుకు బదిలీ చేశారు. 2009 జూన్ 12 సత్యవేడు కోర్టు నలుగురు అధికారులకు మూడు నెలల జైలు శిక్ష, రెండు వేల రూపాయల చొప్పున జరిమానా విధించింది. ఈ కేసులో పైకోర్టుకు వెళ్లడంతో తిరుపతి సీనియర్ సివిల్ జడ్జి రామచంద్రయ్య నలుగురు అధికారులకు ఒక్కో కేసులో రూ.ఏడు లక్షల చొప్పున రెండు కేసుల్లో 14 లక్షల రూపాయల నష్టపరిహారం చెలించాలని సోమవారం తీర్పు చెప్పారు. అప్పట్లో పెనుసంచలనం సృష్టించిన ఈ కేసులో కోర్టు తీర్పుతో బాధితులు విజయం సాధించారు. రియల్‌ఎస్టేట్ వ్యాపారులకు వత్తాసు పలికే పోలీసులకు ఈ కేసు తీర్పు ఓ హెచ్చరికగా నిలవనుంది.

సమతా సేవా సమితి ఆధ్వర్యాన 14 నుంచి సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో:

సమతా సేవా సమితి ఆధ్వర్యంలో ఈనెల 14 నుంచి 16 వరకూ మూడు రోజుల పాటు గన్నవరం మండలం చిన్న అవుట్లపలిలో సంక్రాంతి సంబరాలు నిర్వహించనున్నట్లు ఆ సంఘం ప్రధాన కార్యదర్శి చింతా వెంకటేశ్వర్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 14న ఆంధ్రమహావిష్ణు చారిత్రాత్మక పద్యనాటకం, 15న భక్త చింతామణి, 16న సత్యహరిశ్చంద్ర నాటకాలు ఉంటాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గన్నవరం, బాపులపాడు, ఉంగుటూరు మండలాల్లోని నాటక, జానపద, కళాకారులను, కవులను, రచయితలను సన్మానించనున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యేలు వల్లభనేని వంశీమోహన్, ఉప్పులేటి కల్పన, ఎపి నాటక అకాడమీ ఛైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, ఆంధ్రా ఆర్ట్స్ అకాడమీ కార్యదర్శి గోళ్ల నారాయణరావు, తదితరులు పాల్గొంటారని పేర్కొన్నారు.

చెకుముకి పోటీలలో కృష్ణా, గుంటూరు విజేతలు

- ద్వితీయ స్థానంలో కర్నూలు, శ్రీకాకుళం
- ముగిసిన మూడో రోజు చెకుముకి సైన్సు సంబరాలు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

కర్నూలులో జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో జరిగిన చెకుముకి రాష్ట్రస్థాయి పోటీలలో కృష్ణా, గుంటూరు జిల్లాలకు చెందిన విద్యార్థులు ప్రథమస్థానంలో నిలిచారు. ద్వితీయ స్థానంలో కర్నూలు, శ్రీకాకుళం, తృతీయ స్థానంలో గుంటూరు, విశాఖ రూరల్‌కు చెందిన విద్యార్థుల జట్లు నిలిచాయి. కర్నూలు మాంటిస్సోరి పాఠశాలలో మూడ్రోజులపాటు జరిగిన రాష్ట్రస్థాయి చెకుముకి సైన్సు సంబరాలు సోమవారం ముగిసాయి. ముగింపు కార్యక్రమానికి జెవివి పూర్వ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ రంగన్న అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్‌శర్మ, జెవివి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్, తెలంగాణ ప్రధాన కార్యదర్శి శ్రీనాథ్, మాంటిస్సోరి పాఠశాల ప్రిన్సిపాల్ జ్యోతి పాల్గొన్నారు. విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. అంతకు ముందు కర్నూలు మెడికల్ కళాశాలలో వైద్యులతో విద్యార్థుల సమావేశం నిర్వహించారు. కర్నూలు ఎంపీ బుట్టారేణుక మాట్లాడుతూ విద్యార్థులు సైన్సు రంగంపై ఇప్పటి నుంచే అవగాహన పెంచుకోవాలన్నారు. మానవాళి అభివృద్ధికి శాస్త్రసాంకేతిక రంగాలు ఉపయోగపడాలన్నారు. ప్రస్తుతం అధునాతన వైద్యం ప్రజలందించేందుకు వైద్యులు కృషి చేయాలన్నారు. కర్నూలు ప్రభుత్వాస్పత్రిలో మెరుగైన వైద్యం అందించేందుకు అవసరమైన నిధులను కేటాయిస్తామన్నారు. ఇలాంటి కార్యక్రమాల్లో విద్యార్థులు భాగస్వామ్యం కావాలని ఆమె కోరారు.

మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జివి.రాంప్రసాద్ మాట్లాడుతూ ప్రస్తుతం సైన్సులో అనేక మార్పులు వస్తున్నాయని తెలిపారు. డాక్టర్ శంకర్‌శర్మ మాట్లాడుతూ మూడ్రోజులపాటు ఇక్కడ విద్యార్థులు తెలుసుకున్న అంశాలన్నింటిపై తోటి విద్యార్థులకు పూర్తిగా వివరించాలన్నారు. వైస్ ప్రిన్సిపల్ శ్రీహరి పాల్గొన్నారు. క్విజ్, వ్యాసరచన, చిత్రలేఖన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు కూడా బహుమతులను ప్రదానం చేశారు.



వివి చెకుముకి రాష్ట్రస్థాయి పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న డాక్టర్ శంకరశర్మ, మాంటిస్సోరి పాఠశాల ప్రిన్సిపాల్ జ్యోతి, జెవివి రాష్ట్ర నాయకులు శ్రీనివాస్ తదితరులు.

సంకర విత్తనాలు ప్రకృతి వైపరీత్యాలను తట్టుకోలేవు

ప్రకృతి వ్యవసాయం శిక్షణ ముగింపులో పాలేకర్

ప్రజాశక్తి-గుంటూరు సిటీ ప్రతినిధి

దేశంలో స్థానికంగా సాగవుతున్న మొక్కలు ప్రకృతి వైపరీత్యాలను తట్టుకుంటాయేగాని సంకరం లేదా మెరుగుపర్చిన విత్తనాలు తట్టుకోలేవని సుభాష్ పాలేకర్ అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదురుగా బైబిల్ మిషన్ ప్రాంగణంలో ఎనిమిది రోజులుగా నిర్వహిస్తున్న పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయంపై రైతు శిక్షణ సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా పాలేకర్ మాట్లాడుతూ.. విత్తనాల కోసం అత్యుత్తమమైన మొక్కలను ప్రకృతి వ్యవసాయం ద్వారానే ఎన్నుకోగలమన్నారు. దేశవాళీ విత్తనం పూర్వీకులు రైతులకు అందించిన అమూల్య సంపదని, దాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. మాగాణి, మెట్ట ప్రాంతాల్లోనూ వరిని సాగు చేసే విధానాన్ని వివరించారు. వరి పంట పండించటంలో మూడు రకాలున్నాయని, నేలపై నేరుగా గింజలు చల్లి కలియదున్నడం, వరుస క్రమంలో విత్తనాలు నాటడం, నారు మొక్కలను నాటుకోవడమని వివరించారు. రైతుల కోసం ప్రకృతి వ్యవసాయం పద్ధతిలో భీజ గ్రామాన్ని ఎంపిక చేసి, విత్తనాలను అందించాలని సిఎం చంద్రబాబు కోరారని తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్-2 ముంగ వెంకటేశ్వరరావు, రాష్ట్ర వ్యవసాయం, సహకార శాఖల ప్రత్యేక సలహాదారు తల్లం విజయ్‌కుమార్, వ్యవసాయ శాఖ ప్రత్యేక కమిషనర్ ఎం.హరిజవహర్‌లాల్ పాల్గొన్నారు.

లేబర్ కోడ్ ఏర్పాటుకు కృషి

కేంద్ర మంత్రి సంతోష్ గంగ్వార్

ప్రజాశక్తి- మద్దిలపాలెం, విశాఖ

దేశం లో అసంఘటితరంగంలో అనేకమంది పని చేస్తున్నారని, వీరి కోసం త్వరలో లేబర్‌కోడ్ (44 కార్మిక చట్టాలను ఐదు కోడ్ల కిందకు తీసుకురావడం) ఏర్పాటయ్యే విధంగా కృషి జరుగుతుందని కేంద్ర కార్మిక, ఉపాధి శాఖల మంత్రి సంతోష్ గంగ్వార్ తెలిపారు. సోమవారం ఆంధ్రా యూనివర్సిటీ (ఎయు) ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో జరిగిన క్రాఫ్ట్ ఎగ్జిబిషన్ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మేకిన్ ఇండియా, వివిధ స్టార్టప్‌ల ద్వారా యువతలో నైపుణ్యాభివృద్ధి పెంపొందిస్తామని చెప్పారు. నగరంలో నిర్మించనున్న ఇఎస్ఐ ఆసుపత్రి పనులు మార్చిలో ప్రారంభించి, డిసెంబరు నాటికి పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. విశాఖ ఎంపి కంభంపాటి హరిబాబు మాట్లాడుతూ, క్రాఫ్ట్‌మేళాతో చేతివృత్తులను నమ్ముకున్న వారిని ప్రభుత్వాలు, ప్రజలు ప్రోత్సహించాలన్నారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ పివిఎన్.మాధవ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, విశాఖ పోర్టు ట్రస్టు ఛైర్మన్ ఎంటి.కృష్ణబాబు, బిజెపి జాతీయ ప్రధానకార్యదర్శి పి.మురళీధరరావు తదితరులు పాల్గొన్నారు.



విశాఖలో క్రాఫ్ట్ బజార్ ముగింపు కార్యక్రమాన్నుద్దేశించి మాట్లాడుతున్న కేంద్ర మంత్రి సంతోష్ గంగ్వార్

సంపాదకీయం

కార్పొరేట్లకు ఊడిగం

జనబాహుళ్యానికి సేవలందించాల్సిన మన బ్యాంకులు ఆ సామాజిక లక్ష్యానికి నిలువునా పాతరేసి పెద్ద పెద్ద పారిశ్రామిక వేత్తలకు, ప్రైవేటు కార్పొరేట్లకు పాదాక్రాంతం అయ్యాయనడానికి లెక్కకు మించిన ఆధారాలున్నాయి. ప్రభుత్వరంగ జాతీయ బ్యాంకుల్లోని 1,463 మంది ఖాతాదారులు ఒకొక్కరు రూ.వంద కోట్లు, అంతకుమించిన రుణాన్ని ఎంచక్కా ఎగవేశారంటూ కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ విడుదల చేసిన నివేదిక తాజా ఉదంతం. ఎగవేసిన అప్పులను బ్యాంకులు ముద్దుగా నిరర్ధక ఆస్తులు (ఎన్‌పిఎ)గా పేర్కొంటున్నప్పటికీ అవన్నీ మొండి బకాయిలే. అలాంటి బకాయిల మొత్తం రూ.7.4 లక్షల కోట్లని ఆర్థిక శాఖ ద్వారా లోకానికి వెల్లడైంది. ప్రస్తుత నివేదిక ప్రకారం ఒక్క స్టేట్ బ్యాంక్ (ఎస్‌బిఐ)లోనే ఇలాంటి ఖాతాలు 143 ఉన్నాయి. ఆ తర్వాత పంజాబ్ నేషనల్ బ్యాంక్, కెనారా, యూనియన్, యుఎస్‌వో తదితర బ్యాంకుల్లో గణనీయమైన సంఖ్యలో రూ.శతాధిక కోట్లు ఎగవేసిన బడా కంపెనీలున్నాయి. యథా రాజ తథా ప్రజ అన్నట్లు

నయా-ఉదారవాద ఆర్థిక విధానాలను ప్రభుత్వాలు భుజానికెత్తుకున్నాకనే బ్యాంకుల్లో బడా బాబుల ఎగవేతలు పెరుగుతున్నాయనేది నిర్వివాదాంశం. 2013 నుంచి 2015 మధ్య రూ.1.14 లక్షల కోట్ల కార్పొరేట్ రుణాలను 29 బ్యాంకులు ఎంతో ఉదారంగా మాఫీ చేశాయి. ఈ కాలంలో యుపిఎ, ఎన్‌డిఎ రెండు ప్రభుత్వాలూ కేంద్రంలో అధికారంలో

ఉండటం గమనార్హం. ఇందులో రూ.40 వేల కోట్లు రద్దు చేసి ఎస్‌బిఐ టాప్‌లో ఉంది. ఒక పక్క కింగ్‌ఫిషర్ అధినేత విజయమాల్యా 17 బ్యాంకులకు రూ.7 వేల కోట్లకుపైన బురిడీకొట్టి విదేశాలకు చెక్కేశారని కేంద్ర నేర పరిశోధనా సంస్థ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌ల దర్యాప్తులో తేలగా, అదే మాల్యా అప్పుల్లో రూ.1,200 కోట్లను ఎస్‌బిఐ ముందటేడు మాఫీ చేసింది. అప్పడే ఎన్‌పిఏలుగా మారిన 63 మంది అప్పలు రూ.7 వేల కోట్లకుపైన ఆ బ్యాంక్ రద్దు చేసింది. కార్పొరేట్ రుణాల రద్దుపై విత్త మంత్రి అరుణ్ జైట్లీ చేసిన సూత్రీకరణ మరీ విచిత్రం. పరిపాలనాచర్యల్లో భాగంగా వారి ఖాతాలు జాబితా నుంచి తొలగించాం తప్ప రద్దు చేయలేదనడం ముఖానికి ముక్కు ఎటుందంటే చుట్టూ తిప్పి చూపడమే.

అధికారిక నివేదికల సంగతెలా ఉన్నా బ్యాంకులన్నింటా రూ.15 లక్షల కోట్ల ఎన్‌పిఏలున్నాయని అంచనా. అందులో 35 కార్పొరేట్ కంపెనీల బకాయిలు రూ.7 లక్షల కోట్లు. మరో 23 సంస్థలు రూ.4.5 లక్షల కోట్లు బ్యాంకులకు బాకీ పడ్డాయి. వాటిని వసూలు చేయాల్సిన బ్యాంకులు ఆ బకాయిదారులకు విల్‌ఫుల్ డిఫాల్డర్లు (ఉద్దేశపూర్వక ఎగవేతదారులు) అన్న నిక్‌నేమ్ తగిలించి అప్పడు కొంచెం ఇప్పడు కొంచెం మాఫీ చేస్తున్నాయి. బ్యాంకులకు అప్పలు ఎగ్గొట్టిన వారిలో రిలయన్స్, అదానీలు మొదలుకొని ఏపీలోని ట్రాన్స్‌ట్రాయ్, ల్యాంకో వరకు ఉన్నాయి. వారికే ప్రభుత్వాలు కాంట్రాక్టులిచ్చి దన్నుగా నిలబడి సభ్య సమాజానికి ఏం సందేశం ఇస్తున్నట్లు? బ్యాంకులు వారి సేవలో తరించకుండా ఉంటాయా? ఓట్ల కోసం రాజకీయపార్టీలు అప్పడప్పడు రైతులు, డ్వాక్రా మహిళలు, తదితరుల బ్యాంక్ రుణాలు రద్దు చేస్తామని హామీ ఇస్తున్నాయి. అధికారంలోకొచ్చాక వాటి అమలు దగ్గరకొచ్చేసరికి ఆర్థిక క్రమశిక్షణ, విత్త సంక్షోభం, బ్యాంకుల దివాలా వంటి సాకులు వెతుకుతున్నాయి.

ఉత్తరప్రదేశ్ ఎన్నికల్లో మోడీ స్వయంగా రైతుల రుణాల రద్దుకు హామీ ఇచ్చి బిజెపి గెలిచాక నాలుక మడత పెట్టడం, రుణ మాఫీ పథకాలు సరి కాదని జైట్లీ హితబోధలు లంకించుకోవడం అఘాయిత్యమే.

కార్పొరేట్లకు చెందిన అన్నేసి వేలు లక్షల కోట్లు మాఫీ చేస్తూ బక్కచిక్కిన రైతుల అప్పల రద్దుపై జైట్లీ, అరుంధతి భట్టాచార్య, రంగరాజన్, వైవి రెడ్డి వంటి ఆర్థిక మేధావులు 'నీతి' సూత్రాలు వల్లించడం దారుణం. రైతులకు పంటలేసుకోడానికి రూ.50 వేలు రుణం ఇవ్వడానికి చేతులురాని బ్యాంకులకు కార్పొరేట్లకు రూ.శతాధిక కోట్ల మంజూరుకు మాత్రం చేతికి ఎముక ఉండట్లేదు. రైతులకే కాదు డ్వాక్రా గ్రూపులకు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఇబిసీలకు, ప్రభుత్వ ప్రాయోజిత పథకాల లబ్ధిదారులకు బ్యాంకులు అప్పలివ్వకుండా తిప్పకుంటున్నాయి. అత్యధిక ప్రజలకు అప్పలివ్వకుండా వారు దాచుకున్న డిపాజిట్లను కార్పొరేట్లకు ధారాదత్తం చేస్తున్నాయి. కనీస బ్యాలెన్స్ లేదనే పేరుతో జరిమానాలు విధించి రూ.1,800 కోట్లు పిండుకుంది ఎస్‌బిఐ. కార్పొరేట్ల బకాయిల వల్ల కలిగే నష్టాలను ప్రజల డిపాజిట్లతో పూడ్చుకునేందుకు కేంద్రం ఎఫ్ఆర్‌డిఐ బిల్లు తెస్తోంది. కేంద్రం పెద్ద నోట్లను రద్దు చేసినప్పడు సామాన్య ప్రజలు రూ.5 వేలు డ్రా చేయడానికి నానా ఇబ్బందులూ పడగా కార్పొరేట్లకు మాత్రం రూ.వందల కోట్ల లావాదేవీలు యథేచ్ఛగా సాగిపోయాయి. ఇదీ ప్రభుత్వ విధానం. రూ. వేల కోట్లు ఎగవేసిన కార్పొరేట్ల నుంచి వ్యక్తిగత ఆస్తులను జప్తు చేసి, క్రిమినల్ కేసులు నమోదు చేసి బ్యాంకులు, ప్రభుత్వాలు వసూలు చేస్తేనే బ్యాంకుల మనుగడ, మన ఆర్థిక వ్యవస్థకు ఊరట.

ఇదీ విషయం



నాలుగు రూపాయలతోనే
మధ్యాహ్న భోజనం...
ప్రపంచ చరిత్రలోనే ఇది
'మిథ్యా'న్నపు శాసనం!


బిడ్డలు తన వాళ్లైతే
పెట్టే తిండిదేనా...
పశుగ్రాసం వెల కంటే
హీనం పసి కడుపేనా!

- కొల్లూరు వెంకట్

సమాధానం

రంగనాయకమ్మ గారూ! మీ బాణం గురి తప్పింది, దిశ మార్చండి

సీపీఎం విశాఖ మహాసభ, కలకత్తా ప్లీనంలో చేసుకున్న నిర్ధారణ ఎన్నికల జయాపజయాలతో నిమిత్తం లేకుండా ప్రజా ఉద్యమాల ద్వారా ప్రజలను సంఘటితం చేసి ప్రత్యామ్నాయాన్ని నిర్మించాలన్నది. ఇక్కడ కూడా వారికి అక్కడ, ఇక్కడ కొటేషన్లు తప్ప సారం కనిపించలేదు. లేదా అర్థమయ్యీ వక్రభాష్యం చెప్పదలచుకున్నారా?



వి శ్రీనివాసరావు

'రంగనాయకమ్మ గారూ మీ గురి ఎటు వైపు?' అన్న నా వ్యాసానికి ప్రతిగా 'నా గురి కమ్యూనిస్టు పార్టీల ఫ్యూడల్, పెట్టుబడిదారీ ధోరణుల వైపు' అంటూ జనవరి 5వ తేదీన ప్రజాశక్తిలో సుదీర్ఘ వ్యాసం రాసారు. అందులో నేను లేవనెత్తిన ప్రశ్నలకు సూటిగా సమాధానాలు ఇవ్వకుండా మరికొన్ని కొత్త అంశాలను లేవనెత్తారు. నేడు ముంచుకొస్తున్న మతోన్మాద, ఫాసిస్టు ధోరణులపై గురి పెట్టకుండా కమ్యూనిస్టులపై విరుచుకుపడి ఏం సాధించదలచారని అడిగాను. దానికి సమాధానంగా నేనెప్పుడో 'రామాయణ విషవృక్షం' రాశానని, దానిపై 2003లో దాడి చేశారని, కమ్యూనిస్టులు మాట్లాడలేదని ఆరోపించారు. ఆ విషయం అడగటానికి ఆమెకు ఇన్నేళ్లు పట్టాల్సిన అవసరం లేదు. నేనడిగింది నేడు ఏం చేస్తున్నారని. గత మూడున్నరేళ్లుగా మోడీ పాలనలో ఎవరికీ రక్షణ లేని పరిస్థితి ఏర్పడింది. రంగనాయకమ్మ గారి లాంటి రచయితలపై దాడులు, గోరక్ష పేరుతో హత్యలు జరుగుతున్నాయి. 'పద్మావతి' సినిమాపై దీపికా పడుకొనే తల తీసేస్తామంటున్నారు. గౌరీ లంకేశ్‌ను దారుణంగా హత్య చేశారు. విశ్వవిద్యాలయాలు ఉడికిపోతున్నాయి. వాటిపై స్పందిస్తున్నందుకు వామపక్షాలు, సామాజిక ఉద్యమాలపై దాడులు చేస్తున్నారు. నాయకుల తలలు తీసేస్తామంటున్నారు. ఇవేమీ పట్టవా. వాటిపై ఒక్క వ్యాసమన్నా రాశారా? రచయితగా వారి బాధ్యత ఏమిటి? అని ప్రశ్నించాను. ఈ ప్రశ్నలకు మాత్రం జవాబు లేదు.

ఎవరీ చార్లెస్ బెత్లహాం?

తాడిచెట్టు ఎందుకు ఎక్కావు అంటే దూడ మేతకు అన్నట్టుగా ఉంది వారి ధోరణి. 'నా గురిని అడగటానికి కారణమైన పుస్తకం మాట శ్రీనివాసరావు గారు ఎత్తలేదు..' అని ఆరోపించారు. ఆమె వ్యాసంలో ఎక్కడా చార్లెస్ బెత్లహాం రాసిన సోవియట్ రష్యాలో వర్గ పోరాటాల పుస్తకం గురించిన ప్రస్తావనే లేదు. లేని ప్రస్తావనని నేను ఎత్తలేదని అనడం ఏం తర్కం? ఆమె ఏ పుస్తకాన్నైతే ప్రామాణికంగా భావించి ఉల్లేఖించారో ఆ పుస్తక రచయిత చార్లెస్ బెత్లహాం అసలు సిసలైన మార్క్సిస్టుగా ఆమె పేర్కొన్నారు. చార్లెస్ బెత్లహాం ఫ్రెంచ్ మార్క్సిస్టు ఆర్థికవేత్త అని చెప్పారు. నిజానికాయన మార్క్సిజం పేరు చెప్పుకునే న్యూలెఫ్ట్‌కు (నూతన వామపక్షం) చెందినవారు. న్యూలెఫ్ట్ అంటే ఫ్రెంచ్‌లో 1968 విద్యార్థి ఉద్యమం తర్వాత పుట్టిన ఒక ధోరణి. దీని ప్రకారం కార్మికవర్గం విప్లవ స్వభావాన్ని కోల్పోయింది. విద్యార్థి యువజనులే తిరుగుబాటుకు నాయకత్వం వహించాలనే సిద్ధాంతం. ఇది ఒక పెటీ బూర్జువా సిద్ధాంతం. 1970లలో ప్రపంచమంతా వచ్చిన ఉద్యమాల ఉప్పెనల తర్వాత కార్మికవర్గ విప్లవంపై విశ్వాసం కోల్పోయిన వారు ఈ ధోరణికి లోనయ్యారు. ఆ ప్రభావం బెత్లహాం మీదనే కాదు, రంగనాయకమ్మ గారి మీదా ఉన్నట్టు అర్థమవుతుంది. బెత్లహాం మొదట్లో మార్క్సిస్టు భావజాలానికి ఆకర్షితులయ్యారు. ఆయన 1936లో 5 నెలల పాటు రష్యాలో నివసించారు. ఆ తర్వాత ఫ్రెంచ్ ట్రాట్స్కిస్టులతో సంబంధాలు ఏర్పరుచుకున్నారు. రెండో ప్రపంచ యుద్ధ కాలంలో ఫ్రెంచ్ కార్మిక మంత్రిత్వ శాఖలో అధికారిగా పని చేశారు. 1950లలో ఈజిప్టు, ఇండియా, అల్జీరియా తదితర దేశాల ప్రధానమంత్రులకు సలహాదారులుగా పని చేశారు. ఒక నిఖార్సయిన మార్క్సిస్టును ఈ బూర్జువా నాయకులెందుకు సలహాదారుగా పెట్టుకున్నారని మనం అడగ కూడదు. 1963లో క్యూబాలో ఆర్థిక విధానాలపై చర్చలకు చేగువేరా ఆయనను ఆహ్వానించారు. కానీ బెత్లహాం భావాలతో చే గాని, క్యూబా ప్రభుత్వం కానీ అంగీకరించలేకపోయింది. దాంతో ఆయన అక్కడి నుంచి వచ్చేశారు. 1966 తర్వాత చైనాపై అధ్యయనం చేశారు. మావో విధానాలను, సాంస్కృతిక విప్లవాన్ని పూర్తిగా సమర్థించారు. 1956లో స్టాలిన్ వ్యతిరేకంగా కృశ్చేవ్ చేసిన ప్రచారానికి బెత్లహాం మద్దతు పలికారు. అందువల్లనే రంగానాయకమ్మగారు కృశ్చేవ్ మీద మాటపడనీయడం లేదు.

బెత్లహాం రచనలకు కొలబద్ద మార్క్సిజం కాదు. కరడుగట్టిన స్టాలిన్ వ్యతిరేకత. దాన్నే కొలబద్దగా పెట్టుకొని రంగనాయకమ్మ గారు మమ్మల్ని ప్రశ్నిస్తున్నారు. మార్క్సిస్టు పార్టీలను స్టాలినిస్టు పార్టీలుగా ముద్ర వేశారు. ప్రపంచంలో మార్క్సిస్టు, లెనినిస్టు పార్టీలున్నాయి. మావోయిస్టు పార్టీలూ ఉన్నాయి. కానీ స్టాలినిస్టు పార్టీలెక్కడా లేవు. కాని ఆపేరుతో మమ్మల్ని ఆమె నిందించదలచుకుంటే అందుకు గర్విస్తాం.

విప్లవంలో పార్టీ కీలకపాత్ర

అక్టోబర్ విప్లవం సందర్భంగా కమ్యూనిస్టులు సభలు పెట్టుకుంటే విమర్శిస్తూ వాటిని తద్దినాలుగా పేర్కొన్నారు. అక్టోబర్ విప్లవ స్ఫూర్తిని స్మరించుకోవడం తద్దినం అయితే పడక కుర్చీలో కూర్చొని మార్క్సిస్టు పాఠాలు చెప్పడాన్ని ఏమంటారు? మార్క్సిజానికి మూల కారకుడైన మార్క్స్ తన విప్లవ జీవితాన్ని కార్మికవర్గ కార్యాచరణతో ప్రారంభించారు. మార్క్స్ నాకు మార్గదర్శి అంటున్న రంగనాయకమ్మ గారు దీన్ని ఎందుకు అనుసరించ లేదు. కమ్యూనిస్టు వ్యతిరేక ప్రచారాన్ని ఎందుకు ఖండించలేదని అడిగితే ఆ పని చేస్తాను అన్నారు తప్ప చేశాను అనలేకపోయారు. 'పెట్టుబడి' పుస్తకానికి పరిచయం రాయడం, ప్రచారం చేయడం ప్రధాన పనిగా పెట్టుకున్నట్టు చెబుతున్నారు. గతంలో వారు చాలా అభ్యుదయ రచనలు చేశారు. అందుకే నేటికీ గౌరవాన్ని అందుకుంటున్నారు. కాని వర్తమానంలో ఆమె నిర్వహిస్తున్న పాత్ర ఏమిటన్నది ప్రశ్న. గత రెండు సంవత్సరాలుగా ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తికి ఉద్యమరూపం ఇవ్వడానికి కమ్యూనిస్టులు ప్రయత్నిస్తుంటే దానికి చేతనైనంత సహాయం చేయడం పోనిచ్చి మోకాలడ్డటం ఏ మార్క్సిజమో తెలియదు. కమ్యూనిస్టులు విప్లవానికి తద్దినం పెడుతుంటే ఆమె కమ్యూనిస్టులకు పిండం పెట్టే పనిలో ఉన్నట్టున్నారు. కమ్యూనిస్టులు కాకుంటే ఇంకెవరు ప్రత్యామ్నాయం అని అడిగితే మార్క్సిస్టు సిద్ధాంతాలే ప్రత్యామ్నాయం అంటున్నారు. సిద్ధాంతం భౌతికశక్తిగా మారాలంటే పార్టీ అవసరం. అదే కమ్యూనిస్టు పార్టీ. ఆమె అలాంటి పార్టీల అవసరాన్ని కూడా గుర్తించినట్టు లేదు. సోవియట్ రష్యాలో ఏం జరిగింది పుస్తకానికి ముందుమాట రాస్తూ.. పార్టీ అంటూ బ్రాకెట్‌లో సంఘం అని రాశారు. ఒక సంఘానికి పార్టీకి మధ్య తేడా కూడా వారికి తెలిసినట్టు లేదు. కార్మికవర్గానికి చాలా సంఘాలుంటాయి. అవి రాజకీయపార్టీ పాత్ర నిర్వహించవు. చైతన్యవంతమైన సంఘటిత అగ్రదళం పార్టీ. అలాంటి పార్టీని నడపడంలో చాలా ఒడుదొడుకులు ఉంటాయి. తప్పొప్పులు జరుగుతాయి. ఒకొక్కసారి దారి తప్పడం కూడా జరుగుతుంది. వీటన్నింటిని సరిదిద్దుకొని ముందుకు పోయేదే కమ్యూనిస్టు పార్టీ. కమ్యూనిస్టులు ఆకాశం నుంచి వూడిపడలేదు. ఫ్యూడల్, పెట్టుబడిదారీ వ్యవస్థల నుంచే పుట్టుకొస్తారు. వస్తూ వస్తూ ఆ భావాలు కూడా మోసుకొస్తారు. వాటికి వ్యతిరేకంగా నిరంతరాయంగా అంతర్గత పోరాటం నడుస్తుంటుంది.. నడవాలి. లెనిన్ పదేపదే తన రచనల్లో పేర్కొన్నారు. ఆ పని చేస్తున్నందుకు ఆమె కమ్యూనిస్టులపై విరుచుకు పడుతున్నారు. బూర్జువా ధోరణులున్నాయి కాబట్టి మీదీ బూర్జువా పార్టీయే అంటున్నారు. కార్మిక వర్గ పార్టీలో బూర్జువా ధోరణులుండటానికి, దాని వర్గ స్వభావమే మారి బూర్జువా పార్టీ అవడానికి మధ్య గుణాత్మక తేడాను కూడా వారు గుర్తించడం లేదు. సోషలిజం సాధనకు మీ ప్రత్యామ్నాయం ఏమిటని అడిగాను. దానికి మాత్రం సమాధానం లేదు. ప్రజలకు మార్క్సిజం అర్థం కానందువల్లనే సోవియట్ యూనియన్ పతనమైందని ఆమె పాఠం తీశారు. ఇది వర్గ విశ్లేషణా? ప్రజలకు మార్క్సిజం అర్థమైతేనే విప్లవం వస్తుందని, వ్యక్తి పూజతో వ్యవస్థలు కూలిపోతాయని మార్క్స్ ఎక్కడైనా చెప్పారా? బెత్లహాం పుస్తకానికి ఆమె రాసిన 'మార్క్సిజం' చదివితే మార్క్స్ చెప్పిందాన్ని తలకిందులుగా అర్థం చేసుకున్నట్లు కనిపిస్తుంది.

ఎవరిది వర్గేతర దృక్పథం?

ఈ వ్యాసంలో పొంతన లేని పరస్పర విరుద్ధ వాదనలు ముందుకు తెచ్చారు. ఆమె తన మొదటి వ్యాసంలో సోషలిజం ఎందుకు కూలిపోయిందన్న ప్రశ్నే కమ్యూనిస్టులు వేసుకోలేదని, కీర్తనలు చేస్తున్నారని నిందించారు. నేను 1992 తీర్మానం గురించి ప్రస్తావిస్తే దాని భాగాలు, పేరాలూ పేర్కొని జవాబు బాగాలేదని నిందిస్తున్నారు. ముందు ప్రశ్నే వేసుకోలేదన్న వారు తర్వాత జవాబు బాగా లేదని ఎలా అంటారు. మా జవాబు ఆమెకు నచ్చాలని ఏమీ లేదు. విభేదించే హక్కు ఆమెకుంది. కాని మొదట మేం ఆ ప్రశ్నే వేసుకోలేదని చేసిన నింద తప్పని అంగీకరించాలన్న నిజాయితీ ఉండొద్దా? సీపీఎం నివేదికలన్నీ తాను చదివానన్నందుకు రుజువుగా భాగాలు, పాయింట్లు పేర్కొన్నారు. అక్కడో ఇక్కడో తనకు నచ్చిన కొన్ని కొటేషన్లు ఇచ్చారు. 1992 తీర్మానం యావత్తు సోవియట్ ఆంతరంగిక నిర్మాణం, ఉత్పత్తి శక్తుల అభివృద్ధి ఆటంకాలు, కమ్యూనిస్టు పార్టీ వర్గ అవగాహనలో లోపాలు వివరంగా పేర్కొన్నది. ఈ తీర్మానంలోని 3,4,5 భాగాలు ప్రపంచంలోని ప్రధాన వైరుధ్యాల గురించి, సోవియట్ యూనియన్ పతనానికి కారణాలను, సోషలిస్టు ఉత్పత్తి విధానం గురించి వివరించింది. వాటి జోలికే ఆమె పోలేదు. ఈ తీర్మానంలో కృశ్చేవ్ తప్ప ఆమెకు ఎవరూ కనిపించలేదు. ఒక పుస్తకం చదివాం అనటానికి పేరాలు, పాయింట్లు, కొటేషన్లు ప్రాతిపదిక కాదు. దాని సారాంశం ఏమిటన్నది ముఖ్యం. ఆమె వ్యాసాల్లో ఎక్కడా సామ్రాజ్యవాదుల పాత్రే కనిపించదు. పైగా అది సహజమే కదా అని తేలిగ్గా కొట్టిపడేస్తున్నారు. సీపీఎం తీర్మానంలోని ముఖ్యాంశమే అది. 'విప్లవ ప్రతీకార శక్తులకు, మానవ జాతిని విముక్తి చేయడానికి ప్రయత్నించే విప్లవ శక్తులకు మధ్య నిరంతరం సంఘర్షణ జరుగుతూనే ఉంటుంది. ఈ నిరంతర పోరాటం ప్రపంచస్థాయిలోనూ సోషలిస్టు దేశాల్లో అంతర్గతంగా జరుగుతూ ఉంటుంది.' అంతేకాదు, 'పెట్టుబడిదారీ సైద్ధాంతిక ఎదురుదాడిలో ప్రోత్సహించబడే ఈ ధోరణులు అనేక సమయాల్లో కమ్యూనిస్టు ఉద్యమాన్ని వర్గ పంథా నుంచి మళ్లించాయి.' బహుశా ఈ విశ్లేషణంతా ఆమె దృష్టిలో వర్గేతర దృక్పథమే అవుతుందేమో. కృశ్చేవ్, గోర్బచేవ్‌ల వల్లనే సోషలిజం కూలిపోయిందని కమ్యూనిస్టులు ఆరోపిస్తున్నారని, ఇది వర్గదృక్పథమా? అన్ని ప్రశ్నించారు. సకల పాపాలకు స్టాలినే కారణమనడం మాత్రం ఫక్తు వర్గదృక్పథం అన్నమాట. మాకో కొలబద్ద, వారికో కొలబద్ద రెండు పెట్టుకున్నట్లున్నారు.

సామ్రాజ్యవాదం ఎక్కడ?

ఆమెకు సామ్రాజ్యవాద ప్రమాదం కనిపించలేదనడానికి 'రష్యాలో ఏం జరిగింది?' పుస్తకంలో చరిత్ర క్రమాన్ని బిబిసి నుండి తీసుకొని ఇచ్చిన విధానమే సాక్ష్యం. బూర్జువాల నుండి నేర్చుకుంటున్నారని కమ్యూనిస్టులను నిందించిన ఆమె బిబిసి నుండి సోవియట్ చరిత్రను ఎలా తీసుకుంటారు. అందులో సోవియట్ అణుపరీక్ష గురించి చెప్తూ ఇతర దేశాలకు తన దగ్గర బాంబు ఉందని చెప్పడానికే ప్రయోగించారని వ్యాఖ్యానించారు. కాని దానికి మూలమైన హిరోషిమాపై అమెరికా అణుబాంబు దాడి గురించి మాత్రం ప్రస్తావించలేదు. సోవియట్‌ను అమెరికా గుర్తించడానికి కారణం అది పెట్టుబడిదారీ దేశం కావడమేనని లాజిక్ తెచ్చారు. కానీ అదే 'పెట్టుబడిదారీ దేశం' చైనాను గుర్తించిందని చెప్పేటప్పుడు ఈ సూత్రం వర్తింప చేయలేదు. అది సోషలిస్టు దేశమే కానప్పుడు దాని పతనానికి కారణాలను పరిశీలించాల్సిన అవసరం ఏముంది? పతనమైంది పెట్టుబడిదారీ విధానమైతే తర్వాత వచ్చింది సోషలిజమా?

వర్గరహిత సమాజం దిశగా సోవియట్ ప్రయాణం

ఆమె ఒకవైపు లెనిన్ తర్వాత సోషలిజం లేదంటారు. మరోవైపు 1990 దాక రోగగ్రస్తంగా ఉందంటారు. 1991లో రోగి చనిపోయింది అంటారు. రోగమైన, ఆరోగ్యమైనా సోషలిజం ఉంటేనే కదా! ఒక వ్యవస్థ బతికి ఉండటానికి, చనిపోవడానికి మధ్యనున్న గుణాత్మక మార్పును ఆమె గుర్తించడం లేదు. సోవియట్‌లో వర్గాలు పోయాయని, సీపీఎం నివేదికలో చెప్పినట్టుగా ఆమె మరో ఆరోపణ. దోపిడీ రహిత సమాజం ఏర్పడింది అంటే వర్గాలు అంతమయ్యాయని అర్థమా? కొత్త సమాజంలో పాత సమాజ లక్షణాలు కొనసాగుతాయన్న గతితార్కిక సూత్రం వారికి తెలియదా? వారు పేర్కొన్నట్లుగా 1936 రాజ్యాంగసభ నివేదికలో (నాల్గవ భాగం 1.1 (బి)) స్టాలిన్ వర్గాలు రద్దయ్యాయని ఎక్కడా చెప్పలేదు. దోపిడీ వర్గాలు రద్దయ్యాయన్నారు. వర్గరహిత సమాజం దిశగా ప్రయాణిస్తున్నామని చెప్పారు. స్టాలిన్ ఉపన్యాసాన్ని మరోసారి సమగ్రంగా చదవండి. లెనిన్, స్టాలిన్ చెప్పిన వర్గపోరాటాన్ని విస్మరించారన్నదే సోవియట్ కమ్యూనిస్టుపార్టీ మీద మా విమర్శ.

ఆత్మవిమర్శ లేనిదెవరికి?

సీపీఎం తీర్మానాల్లో చేసుకున్న విమర్శ, ఆత్మవిమర్శలను కూడా ఆమె ఎద్దేవా చేశారు. మొదట వ్యాసంలో అసలు ఆత్మవిమర్శే లేదన్నారు. ఇప్పుడేమో అదేం ఆత్మవిమర్శ అంటున్నారు. అంతా ఎన్నికల రాజకీయాలే, అన్నీ నాజూకు మాటలే అంటున్నారు. ఆత్మవిమర్శే చేసుకోలేదన్న తన మొదటి విమర్శను ఉపసంహరించుకున్నట్లేనా? భారతదేశ రాజకీయాల్లో ఎన్నికలు ఒక ముఖ్యమైన పోరాట రూపం. ప్రత్యేకించి ప్రజా ఉద్యమాలు వెనుకపట్టు పట్టినప్పుడు ఎన్నికలే ఒక ముఖ్యమైన పోరాటరూపం అవుతుంది. 1905 విప్లవ వైఫల్యం తర్వాత లెనిన్ అనుసరించిన ఎత్తుగడలే ఇందుకు నిదర్శనం. కానీ సీపీఎం విశాఖ మహాసభ, కలకత్తా ప్లీనంలో చేసుకున్న నిర్ధారణ ఎన్నికల జయాపజయాలతో నిమిత్తం లేకుండా ప్రజా ఉద్యమాల ద్వారా ప్రజలను సంఘటితం చేసి ప్రత్యామ్నాయాన్ని నిర్మించాలన్నది. ఇక్కడ కూడా వారికి అక్కడ, ఇక్కడ కొటేషన్లు తప్ప సారం కనిపించలేదు. లేదా అర్థమయ్యీ వక్రభాష్యం చెప్పదలచుకున్నారా?

అంతా నాయకుల ఇష్టాయిష్టాలేనా, ప్రజల పాత్ర లేదా అంటూ నాయకులకు, ప్రజలకు మధ్య వైరుధ్యం ఎత్తిచూపారు. రెండో ప్రపంచ యుద్ధంలో స్టాలిన్ పాత్ర ఏమీ లేదు..అంతా ప్రజలదే అని ఆమె అన్నారు. అది ప్రజా విజయమే. కానీ దానికి నాయకత్వం వహించింది స్టాలిన్. అది చరిత్రలో చెరిగిపోని సత్యం. వ్యక్తి పూజకు మేము వ్యతిరేకం. అయినా ఆమె అనుకున్నట్టుగా స్టాలిన్ ఫాసిస్ట్ అని, దయ్యం, భూతం అని చెప్పడానికి మేము సిద్ధం కాదు. ఈ పని ప్రపంచ వ్యాప్తంగా సామ్రాజ్యవాద ప్రచార విభాగం చేస్తూనే ఉన్నది. చారిత్రక దృష్టితో చూసినప్పుడు స్టాలిన్ అద్వితీయమైన పాత్రను పోషించారు. ఈ విషయంలో ఆమెకు సందేహం ఉంటే అన్నా లూయీ స్ట్రాంగ్ పుస్తకం ఒకసారి చదవడం మంచిది. లేదా తాజాగా మాజీ సోవియట్ పౌరురాలు ఇరినామాలెంకో రాసిన నవలలో లేదా ఇంటర్వ్యూలో చదవండి. బెత్లహాంను తప్ప నేను ఎవరినీ చదవను అంటే అది ఆమె ఇష్టం.

చరిత్రలో నాయకుల పాత్రకు స్థానముంది

చరిత్రలో నాయకుల పాత్ర ఏమీ లేదు అంటున్న ఆమె లెనిన్ ఇంకో 20 ఏళ్లు బతికి ఉంటే సోవియట్ యూనియన్ రూపురేఖలు మారిపోయి ఉండేవని అంటున్నారు. ఇది భౌతికవాద దృక్పథమా లేదా భావవాద దృక్పథమా? లెనిన్ అయితే ఎన్నేళ్లయినా పదవిలో ఉండొచ్చన్నమాట. ఒక వ్యక్తే వేదిక మీద ఉంటే ఇక మీకు నాయకులు లేరా అంటారు. పది మంది ఎక్కితే కింద కూర్చోవడం ఇష్టం లేక డయాస్ ఎక్కి ఫోజులు కొడుతున్నారు అంటారు. మా పార్టీలో ఏ నాయకుడూ చనిపోయేదాక పదవులు పట్టుకొని వేళ్లాడలేదు అంటే.. జ్యోతిబసు అన్నేళ్లు ఉన్నాడు.. సూర్జిత్ ఇన్నేళ్లున్నాడు అంటారు.. కార్యదర్శి బాధ్యతలకు కాలపరిమితి విధించాం అంటే.. ఇంతకాలం ఏం చేశారంటారు. అదే ప్రశ్న తనకు కూడా వేసుకోవాలి కదా? లెనిన్ తర్వాత సోషలిజం పతనమైతే ఇప్పుడా విశ్లేషించేదని మేం అడక్కూడదా? పోనీ 91లో పోయిందనుకుంటే 2017లోనా పుస్తకాలు వేసేది. అదెందుకు కూలిందో ఆనాడే ఆమె ఎందుకు ప్రశ్న వేసుకొని సమాధానం చెప్పలేదు. వందేళ్ల పిండం పెట్టడానికి ఆగారనుకోవాలా? ఆమె ఏం చెప్పదలచుకున్నారో ఆమెకే అర్థమవుతున్నట్లుగా లేదు. ఒక వ్యవస్థ లేదా పార్టీ జయాపజయాలను అంచనా వేయడానికి వ్యక్తిపూజ, పదవీకాలమే ప్రాతిపదిక అయితే మావో కన్నా డెంగ్ చాలా గొప్పవాడవుతాడు.

చరిత్ర నుంచి నేర్చుకోవడం అంటే విశ్లేషణలు చేసుకోవడం మాత్రమే కాదు.. భవిష్యత్తుకు దాన్ని ఎలా వర్తింపచేసుకోవాలో నేర్చుకోవడం. ఆలస్యంగానైనా ఆ పని సీపీఎం చేసినందుకు అభినందించడం పోయి అప్పుడెందుకు చేయలేదు.. ఇప్పుడెందుకు చేయలేదని వితండవాదం చేయడం వాస్తవాన్ని ఒప్పుకోలేకనే. ఏ కమ్యూనిస్టు పార్టీ మరో కమ్యూనిస్టు పార్టీ అంతరంగిక విషయాల్లో జోక్యం చేసుకోదు. అంగీకృత విషయాలపై కలసి పని చేస్తాం. ఆరకంగా సోవియట్ లేదా చైనా విధానాలు, అనుభవాల నుండి నేర్చుకుంటాం. మా పార్టీకి వర్తిస్తే సరిదిద్దుకుంటాం. ఆ రూపంలోనే మా విమర్శ, ఆత్మ విమర్శ ఉంటుంది. అదే లెనిన్ నుండి మేం నేర్చుకున్న శాస్త్రీయ పద్ధతి. మార్క్సిజం అంటే విశ్లేషణలు చేయడం కాదు. దాన్ని మార్చడం అని మార్క్స్ అన్నాడు. దాన్ని అనుసరిస్తున్నందుకే సిపియంపై మండిపడుతున్నారు.

ఒక నాయకుడు ఎన్నేళ్లు పదవులు ఉండాలని చెప్పే మీరు మీరెంత కాలం రచయితగా ఉంటారు అని ఎవరైనా అడిగితే ఏం చెపుతారు. అరవై ఏళ్ల నుండి రచనలు చేస్తూనే ఉన్నారు కదా ఇంకా రిటైర్ ఎందుకు కాలేదని అడిగితే ఏం చెబుతారు. ఒక మార్క్సిస్టుగా మీరు ఇంకో పది మంది యువ మార్క్సిస్టులను తయారు చేసి ఎందుకు తీర్చిదిద్దలేక పోయారు. మీ రచనా శైలిని వారికి అప్పగించి ఎందుకు రాయించలేకపోతున్నారు. వయసు మీద పడుతున్నా ఇంకా మీరే రాయాలా? ఇలా అడిగితే ఎంత చెత్తగా ఉంటుందో మీకు తెలియంది కాదు. ఇతరులను నిందించబోయే ముందు వాటిని మనకు కూడా వర్తింపజేసుకోవాలి. మీకు మీరు ఏ తప్పులు చేయని మార్క్సిస్టుగా భావించుకుంటే చేసేదేమీ లేదు. ఆమె దృష్టిలో అసలైన మార్క్సిస్టులు చేతివేళ్ల కన్నా తక్కువ. అందులో లెనిన్ ప్రథముడు. తర్వాత బెత్లహాం. బహుశా తాను మూడో వ్యక్తి కావచ్చు.

పోరాటశక్తులకు స్వాగతం చెప్పండి

ఆమె వ్యాసాల నిండా బెత్లహాం పుస్తకానికి రాసిన ముందు మాటతో సహా మార్క్సిస్టులను, మార్క్సిస్టు పార్టీలను తెగడటమే పనిగా పెట్టుకున్నారు. దానికోసం తన వాదనలో హేతుబద్ధత లోపించినా పరస్పర విరుద్ధ వ్యాఖ్యలున్నా పట్టించుకోలేదు. మార్క్సిస్టులపై ఏదో ఒక బాణం వదలాలనే తపనతో మార్క్సిజానికి వికృత వ్యాఖ్యానం చేస్తున్నారు. ఇప్పటికైనా వారు గతాన్ని నిందించడం మానుకొని వర్తమానం గురించి ఆలోచించాలి. నిర్దిష్ట పరిస్థితిని నిర్దిష్టంగా విశ్లేషించి కర్తవ్యాలు రూపొందించుకోవడమే మార్క్సిస్టు సారం అని లెనిన్ అన్నాడు. ప్రపంచంలో అనేక కొత్త మార్పులు జరుగుతున్నాయి. దీనికనుగుణంగా పోరాట శక్తులు ముందుకొస్తున్నాయి. వాటికి స్వాగతం పలకండి.

(రచయిత సిపిఎం కేంద్ర కార్యదర్శి వర్గ సభ్యులు)

జన వాక్యం


దరఖాస్తూ భారమే!

ఇటీవల మన రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన డి.ఎస్.సి నోటిఫికేషన్‌లో టెట్ తప్పని సరి అన్న నిబంధన చేసింది. అయితే ఈ టెట్ దరఖాస్తుకు మీ సేవ కేంద్రాలలో రూ.500 చెల్లించి చలానా పొందాలి. అక్కడ నిర్వాహకులు దానిపై అదనంగా మరో రూ.50 నుండి రూ.70 వసూలు చేస్తున్నారు. ఇదికాక అప్లికేషన్‌ను ఆన్‌లైన్‌లో నింపేందుకు రూ.30–రూ.40 వరకు తీసుకొంటున్నారు. అసలే ఉపాధి, సంపాదన లేని వ్యక్తికి రూ.600 ఎక్కడి నుండి వస్తాయి? పరీక్ష రాయడానికి ప్రయాణ ఖర్చులకు గాను అదనంగా మరో రూ.150 ఖర్చవుతుంది. ఇదంతా ప్రభుత్వం ఆలోచిస్తే బాగుంటుంది. ఇకనైనా నిరుద్యోగులపై ఈ పెను భారాన్ని తగ్గించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

ఎస్ ఎస్ కుమార్, తిరపతి.

దర్పణం

కొత్తయేడు కొత్త ఆలోచనలకు పునాది



డా॥ కత్తి పద్మారావు

వ్యక్తిత్వ నిర్మాణం చేసుకోవాల్సిన నూతన వత్సరంలో వ్యక్తిత్వ విధ్వంసం జరిగింది. నిజానికి నూతన సంవత్సరం కొన్ని నిర్మాణాత్మకమైన జీవన విధానాలు రూపొందించుకోవాల్సి వుంది. ప్రతి వ్యక్తిత్వానికి పునర్వీక్షణ అవసరం. ప్రపంచంలో వస్తున్న అనేక పరిణామాల్ని వ్యక్తులు, వ్యవస్థలు సమన్వయం చేసుకోవాల్సిన రోజు అది. పంచేంద్రియాలను అదుపు చేసుకొని, జ్ఞానేంద్రియాలకు పదును పెట్టుకోవాల్సిన రోజు అది. అందుకే నూతనవత్సర వేడుకలు బహిర్గతంగా జరిగినా అంతర్గతంగా మన వ్యక్తిత్వంలో వ్యక్తిత్వ నిర్మాణం అనేది సమాజ అభ్యుదయానికి కూడా మూలమైంది. ఎందుకంటే వ్యక్తితో సమాజానికి సామాజిక భద్రత వస్తుంది. మనకు ఏదైనా సమస్య వచ్చినప్పుడు ఇతరుల మీద రుద్దడం కాకుండా మన సమస్య మనమే పరిష్కరించుకునే సత్తాని తీసుకొచ్చుకోవడమే వ్యక్తిత్వ నిర్మాణంలో ప్రధానాంశం. మనలో వున్న గుణాల్ని మనం ముందు గుర్తించాలి. ఆ గుణాలకు పదును పెట్టుకోవాలి. ఇతరులకు సహాయం కూడా చేయాలి. నూతన సంవత్సర నిర్ణయాల్లో తాగుడు, సిగరెట్ వంటి అలవాట్లు మాని పుస్తకాలు చదవడం, పుస్తకాలు కొనడం పెంచుకోవాలి. అనేక దేశాల్లో పుట్టిన రోజులకు, పెళ్లిళ్ళకు పుస్తకాలు కానుకలుగా ఇచ్చే అలవాటు వుంది. పుస్తకాలు చదివేవారు మొండిగా వుండరు. తమ భావాల్ని పుస్తక జ్ఞానం ద్వారా మార్చుకోవడానికి ప్రయత్నిస్తారు. తమకు ఏమైనా మూఢనమ్మకాలు వుంటే జ్ఞానవంతమైన పుస్తకాల ద్వారా వాటిని పోగొట్టుకోవడం కూడా నూతన వత్సరంలో ఒక ప్రతిజ్ఞగా వుండాలి. వ్యక్తిత్వ నిర్మాణంలో కృతజ్ఞత అనే భావం మనల్ని గొప్ప వ్యక్తులుగా మలుస్తుంది. సానుకూల దృక్పథ భావం మనకు స్నేహితుల్ని సంపాదించి పెడుతుంది. మనం ఇంటి బాధ్యతని, ఉద్యోగ బాధ్యతని సమతుల్యం చేయగలగాలి. మనం అనునిత్యం జీవిత లక్ష్యాన్ని చేరుకోవడానికి తపన పడాల్సి వుంటుంది. మన భావోద్వేగాలను మనం నియంత్రించుకొనే క్రమంలో జ్ఞాన సంపత్తిని పెంచుకోవాలి. ప్రతి మనిషీ సమాజం నుంచే



ఆవిర్భవిస్తాడు. కొంచెం దూరం వెళ్ళిన తరువాత సమాజం నుంచి తాను వేరే అవ్వాలని చూస్తాడు. ఇంకొంత దూరం వెళ్ళిన తరువాత ఈ సమాజంలోని సంపద అంతా తనకు, తన బిడ్డలకు ఎక్కువ భాగం రావాలని చూస్తాడు. ఎవరి కోసం అయితే ఈ సంపదనంతా తాను కొల్లలు కొల్లలుగా పోగుచేసి దాచి పెడతాడో వాళ్ళ నుంచి అతనికి ప్రేమ అందనప్పుడు సంపదకి వైయుక్తి ప్రేమ మధ్య ఘర్షణ జరుగుతుంది. అప్పుడు తన దు:ఖాన్ని తీర్చడానికి ఎవ్వరూ రారు. ఎందుకంటే ఆయన సంపద కోసం స్నేహితుల్ని పోగొట్టుకున్నాడు. ఆత్మీయులను పోగొట్టుకున్నాడు. సమాజం పట్ల అతను నిర్లక్ష్యంగా వ్యవహరించాడు. ఇప్పుడు సమాజాన్ని అతడు కోరుకొంటున్నాడు. ప్లేటో, హెగెల్, మార్క్స్, పూలే, అంబేద్కర్‌లు తమ తాత్విక సిద్ధాంతాల ద్వారా ప్రపంచాన్ని మార్చగలిగారు. తాత్వికత నుండే నైతికత వస్తుంది. నైతిక శక్తి మనిషికి బోధనా శక్తిని విశ్లేషణాశక్తిని సత్యనిష్టను తీసుకువస్తుంది. మితిమీరిన కోరికలు మనిషిని అప్పులపాలు చేస్తాయి. తాత్విక దృక్పథం వున్నప్పుడే కోరికలు నియంత్రించుకోగలుగుతారు. కోరికలు వేరు ఆశయాలు వేరు. ఆశయాలు కోరికలను నియంత్రిస్తాయి. వస్తు వ్యామోహం మనిషిని అప్పులపాలు చేస్తుంది. ఈ కొత్త సంవత్సరంలో వస్తు వ్యామోహం తగ్గించి, వస్తు ఉత్పత్తి దిశగా చైతన్య వంతులు కావాలి. తమ పని తాము చేసుకొనే వాళ్ళే విజేతలు అవుతారు. ఆధారితులైన వారంతా ఆ ఆధారం లేనపుడు నీరసులౌతారు. ఈ నూతనవత్సరంలో అన్ని మానవ సంబంధాల మధ్య సమన్వయాన్ని సాధించుకోవలసిన అవసరం వుంది. జీవితంలో ప్రధానమైన సూత్రం సమన్వయం. నూతనవత్సరంలో విద్యతో ముందు వరసలో ఉండే కాంపిటేటీవ్ స్పిరిట్‌ను మనం ఆవిష్కరించుకోవలసి వుంది. నూతనవత్సరం జీవన విధానాన్ని సరిదిద్దుకోవడానికి కొన్ని ప్రతిజ్ఞలు తీసుకొనే రోజుగా మలుచుకోవలసి వుంది. ప్రతి మనిషిలో ఒక రచయిత, శిల్పి, చిత్రకారుడు దాగుంటారు. ఆ కళలకు మనం పదును పెట్టుకొనే పనిని ప్రారంభించవలసి వుంది. ప్రతి మనిషిలో అంతర్గతంగా ఎన్నో ప్రతిభలు, చైతన్యాలు, అభివ్యక్తులు వుంటాయి. వాటిని ఎక్కువ మందితో పంచుకోకుండా ఏ ఒక్కరిద్దరితోనో పెంచుకోవడం వల్ల ఎడిక్షన్స్ ఏర్పడతాయి. అందుకే ప్రతిభలను సామాజీకరించాల్సిన అవసరం వుంది. ప్రతిభల్లో లింగ బేధం ఈనాడు లేదు. మరో పక్క స్త్రీలు తమ వ్యక్తిత్వ నిర్మాణంలో అత్యున్నతమైన సామర్ధ్యాన్ని ప్రదర్శిస్తున్న రోజులివి. ఒక పని పట్ల పురుషుని కంటే స్త్రీలే ఎక్కువ అంకిత భావంతో వుంటారు. శాస్త్రవేత్తలుగా, అడ్మినిస్ట్రేటర్లుగా, విద్యావేత్తలుగా, రాజకీయవేత్తలుగా తమ సామర్థ్యాన్ని పెంచుకుంటున్నారు. ఆనందం, సందడి, ఉత్సాహం కూడా ప్రజలకు అవసరమే. దానితోపాటు విజ్ఞత, హేతుదృక్పథం, సామాజిక స్పృహ, నైతికత మరింతగా అవసరం. ఏది ఏమైనా వ్యక్తిత్వ నిర్మాణానికి నూతన వత్సరం నాడు పునర్వివేచన, పునర్నిర్మాణమే ఊపిరి. కొత్త ఆశలతో ఆశయాలతో ఆ దిశగా ముందుకు నడుద్దాం.

(రచయిత సామాజిక తత్వవేత్త, నవ్యాంధ్రపార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, సెల్ : 9849741695)

ప్రసవానంతరం బరువు తగ్గాలా?

పిల్లలు పుట్టిన వెంటనే తాము వేగంగా సన్నబడిపోవాలని నేటితరం అమ్మలు కోరుకుంటున్నారు. కానీ ఇది మంచిది కాదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. మెల్లమెల్లగా మాత్రమే ఒంట్లోని కొవ్వును కరిగించుకోవాలని సూచిస్తున్నారు.

సినీతారలు ఎందరో తల్లి అయిన తర్వాతా నాజూకైన శరీర లావణ్యంతో ఎందరినో ఆశ్చర్యానికి గురిచేస్తున్నారు. కొత్తగా తల్లులైన నేటి యువతులు తామూ సినీతారల్లా సన్నగా కనిపించాలని కోరుకుంటున్నారు. బిడ్డను ప్రసవించిన కొద్ది రోజులకే స్లిమ్‌గా అయిపోవాలని తాపత్రయపడుతున్నారు. అందుకోసం తీవ్రస్థాయిలో వ్యాయామాలను చేస్తున్నారు. అలా చేయడం వారి ఆరోగ్యానికి ప్రమాదకరం.

వేగంగా బరువు తగ్గొద్దు

ప్రసవానంతరం బరువు తగ్గడానికి ప్రయత్నించడంవల్ల శారీరకంగా పలు సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. హఠాత్తుగా బరువు తగ్గినా శరీరం తట్టుకోలేదు. ముఖ్యంగా చిన్నారులకు తల్లిపాలను పట్టే అమ్మలు లావు తగ్గడానికి ప్రయత్నించకూడదు. డైటింగ్ కూడా వాళ్లకి మంచిది కాదు. అయినా తగ్గడానికి ప్రయత్నిస్తే శరీరంలోని పోషకవిలువలు తగ్గిపోయి, అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది. అందుకే కొత్తగా బిడ్డను కన్న తల్లులు మెల్లగా బరువు తగ్గాలి.

ప్రసవానంతర వ్యాయామాలు

బిడ్డను కన్న తర్వాత (పోస్ట్ డెలివరీ ఎక్సర్‌సైజెస్) చేసే వ్యాయామాలు కొన్ని ఉన్నాయి. ఇవి కొత్తగా తల్లులైన వారి శరీరంలోని కొవ్వును కరిగించడమే కాదు శరీరానికి కావాల్సిన అదనపు ఎనర్జీని అందిస్తాయి. శరీరం లోపల భాగాలను సంరక్షిస్తాయి. తేలికపాటి వ్యాయామాలు చేయాలి. మెల మెల్లగా వ్యాయామాల తీవ్రతను పెంచుకుంటూ పోవాలి. నార్మల్ డెలివరీ అయితే నాలుగు వారాల అనంతరం వ్యాయామాలు చేయడం ప్రారంభించాలి. సిజేరియన్ అయితే ఆరు వారాల తర్వాత వ్యాయామాలు చేయడం మొదలుపెట్టాలి. అదీ డాక్టర్ పర్యవేక్షణలో చేస్తే మంచిది.



ఎలాంటివి తినాలి?

కొత్తగా 'తల్లు'లైన వారు ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకోవాలి. బరువు తగ్గడానికి వ్యాయామాలు చేస్తున్నాం కదా అని తక్కువ కేలరీలున్న ఆహారం మాత్రమే తిని కడుపు మాడ్చుకోకూడదు. ఆహారంలో రకరకాల పండ్లు, కూరగాయలు ఉండాలి. పసుపు, ఆరంజ్ రంగులున్న పండ్లు తినడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. బొప్పాయి, పీచ్, నిమ్మ వంటి వాటిల్లో సి-విటమిన్ పుష్కలంగా ఉంటుంది. పండ్లు, కూరగాయల్లో పీచు పదార్థాలతోపాటు తక్కువ పరిమాణంలో మాత్రమే కాలరీలు ఉంటాయి. ఆకుకూరతో బాగా తినాలి.

★


మీ కోసం

చల్లని నీళ్లల్లో
నిమ్మ కాయలను
అరగంట ఉంచితే
అవి మెత్తబడి రసం
సులువుగా వస్తుంది.



జీవన సౌరభం

నిన్న ఇవాళ ఇబ్బందిపెట్టే
ప్రతిపని
రేపటి నీ అభివృద్ధికి
వచ్చే ఓ అవకాశం



జోగిని... ఇప్పటికీ భారతీయ సమాజాన ఎక్కడో.. అక్కడ వినిపిస్తున్న మాట. కనీకనిపించకుండా ఆడబిడ్డల్ని అనాగరిక సంప్రదాయమై పట్టిపీడిస్తున్న ఓ దురాచారం. ఎవరి దాష్టీకం వల్లనో జోగినులైనవారంతా... బతుకంతా జీవచ్ఛవాలుగా గడపాల్సిన పరిస్థితి. సామాజికంగా వంచితులైన జోగినులు తమ జీవనంలో అనుభవిస్తున్న ఆవేదనలెన్నో? అలాంటి ఒక జోగిని బిడ్డనే చిన్నయ్య జంగం. బాల్యం నుంచే ఎన్నో కష్ట నష్టాలను అనుభవించి, ఎంతో నిరాదరణని, వెలివేతలనీ ఎదుర్కొంటూ.. నిర్భాగ్యులకు కాంతిరేఖగా మారారు. నిరంతర అధ్యయనం, శ్రమ ద్వారా కలలని సాకారం చేసుకుని, మిగిలిన అభాగ్యులకు తానొక ధైర్యాన్నిచ్చే గొంతుకై నిలుస్తున్నారు. నిజామాబాద్‌జిల్లాలోని కొమ్మన్‌పల్లిలో ఒక జోగిని బిడ్డగా పుట్టినాగానీ.. ఎంతో పట్టుదలతో విదేశీ విశ్వవిద్యాలయాల్లో ప్రొఫెసర్ స్థాయికి ఎదిగారు. స్ఫూర్తివంతమైన చిన్నయ్య జీవన ప్రస్థానం తెలుసుకుందాం!

జోగిని బిడ్డ ప్రొఫెసర్ అయ్యాడు!

ప్రస్తుతం కెనడాలోని కార్లెటోన్ యూనివర్శిటీలో హిస్టరీ ప్రొఫెసర్‌గా ఉన్న చిన్నయ్య జంగం పుట్టి పెరిగింది తెలంగాణ రాష్ట్రం నిజామాబాద్ జిల్లా కొమ్మన్‌పల్లిలో. అక్కడే అతని బాల్యం గడిచింది. అతని తల్లి పేరు చిన్నుబాయి. తండ్రెవరో తెలియదు. అతనికే కాదు ఆతనిని కన్నతల్లికి కూడా. ఇది ఎవరూ నమ్మలేని నిజం. ఎందుకంటే ఆమె ఒక జోగిని. అతడు ఈ కుటిల సమాజం తయారుచేసిన దుష్టవ్యవస్థలో పురుడు పోసుకున్న అభాగ్యుడు. అమ్మ లాలనే తప్ప నాన్నంటే ఎవరో తెలియదు. జోగిని కడుపులో పుట్టిన చిన్నయ్యని ఈ మురికి కూపం నుంచి బయటకు నెట్టేయాలని తల్లి చిన్నుబాయి చాలా ప్రయత్నాలు చేసింది. ఒక జోగిని కొడుకుగా సమాజంలో చిన్నయ్యను ఎంత హేళనగా చూస్తారో ఆమెకు తెలుసు. అందుకే ఈ సమాజం తనపై వేసిన కళంకం తన కుమారునికి అంటకూడదంటే అందుకు చదువొక్కటే తగిన మార్గమనుకుంది. చిన్నయ్య బాగా చదువుకోవాలి..! అతని స్థాయిని చూసి లోకమంతా మురిసిపోవాలి..! ఇదీ చిన్నుబాయి కల. అయితే ఆమె కల నెరవేరక ముందే అతని చిన్నవయసులోనే ఆమెను కాలం తనతోపాటు తీసుకెళ్లిపోయింది.



కూటికోసం.. కూలీగా

తల్లి చనిపోయే సమయానికి చిన్నయ్యకు పదేళ్లు. అమ్మ జ్ఞాపకంగా ఒక చెల్లెలు మాత్రమే తోడు. జోగినికి పుట్టినవారు కాబట్టి సమాజంలో వెలివేతలు, అడుగడుగునా ఛీత్కారాలు మామూలే. ఎవరూ పట్టించుకునే పరిస్థితే ఉండేదికాదు. అలాంటి ప్రతికూల వాతావరణంలోనూ తల్లి ఆశయమే లక్ష్యంగా చిన్నయ్య బతికారు. తన చెల్లెల్ని కంటికి రెప్పలా కాపాడుకున్నారు. బతకాలంటే తిండికావాలి. దానికోసం పనిచేయాలి. తాను కష్టపడితే తనతోపాటు చెల్లినీ బతికించుకోవడం సాధ్యపడుతుంది. అయితే ఆకలి మంటల్ని చల్లార్చుకోవడం కోసం నాలుగు మెతుకులు కావాలి. వాటి కోసమే చిన్నవయసులోనే కూలిపని చేశారు. కూలి చేసుకుంటూనే చదువు మీద మక్కువతో రకరకాల కష్టాలు అనుభవిస్తూ చదువుకున్నారు. అలా చదువుతూ అదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌లో ఇంటర్మీడియట్, నాగార్జునసాగర్‌లో డిగ్రీ పూర్తి చేశారు. తన ప్రతిభతోనే హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఎమ్.ఏ హిస్టరీని పూర్తి చేశారు. ఢిల్లీ జేఎన్‌యూలో యంఫిల్ తరువాత ఉస్మానియాలో కొంతకాలం ఉద్యోగం చేశారు. దళిత సాహిత్యం, అణగారిన కులాల వెనుకబాటుపై ఎన్నో పరిశోధనలు చేశారు. చిన్నయ్యను ఎన్నో అవారులూ వెతుక్కుంటూ వచ్చాయి.

అంబేద్కరే స్ఫూర్తి

చిన్నయ్య తాను చదువుతున్న కాలంలోనే ఒక గమ్యాన్ని నిర్దేశించుకున్నారు. అదేమిటంటే అతనికి నిరంతర స్ఫూర్తినిచ్చేవి అంబేద్కర్ వాక్యాలే. "బోధించు... సమీకరించు...పోరాడు" అని ఆయన ఇచ్చిన నినాదమే తన మనసంతా మార్మోగుతోందంటారు. ఏనాటికైనా ఆ ప్రపంచ మేధావి చదువుకున్న విశ్వ విద్యాలయంలోనే తానూ కూడా చదవాలన్నదే ఆయన లక్ష్యం. దానిని సాధించడంలో భాగంగానే 2005లో యూనివర్సిటీ ఆఫ్ లండన్ లో పిహెచ్‌డి సీటు సంపాదించారు. 'ఇంటలెక్చ్యువల్ అండ్ పొలిటికల్ రైటింగ్స్ ఎగైనెస్ట్ క్యాస్ట్ ఇన్ ఈక్వాలిటీ' అనే అంశాన్ని పీహెచ్‌డి థీసిస్‌గా ఎంచుకున్నారు. ప్రతిభగల విద్యార్థులకు అందించే ఫెలిక్స్ స్కాలర్‌షిప్‌తో డాక్టరేట్‌ను పూర్తిచేశారు. ఆ తరువాత పోస్ట్ డాక్టరేట్ ఫెలోషిప్ కోసం అమెరికా వెళ్లారు. ఫెలోషిప్‌ని పూర్తిచేసి, అక్కడ 2006 నుంచి 2010 వరకూ న్యూయర్క్ యూనివర్సిటీ పరిధిలో వాగ్నర్ కళాశాలలో ఆధ్యాపకునిగా పనిచేశారు. ఆ తర్వాత 2013 వరకూ కాన్‌కార్డియా యూనివర్శిటీలో పనిచేశారు. అనంతరం 2014లో కెనడాలోని కార్లెటోన్ యూనివర్శిటీలో హిస్టరీ ప్రొఫెసర్‌గా ఉద్యోగంలో చేరారు.

వెన్నుదన్నుగా నిలిచిన సహచరి

చిన్నయ్య జీవితంలో ఉన్నతమైన ఎదుగుదలకు ఆయన జీవన సహచరి మయూరిక చక్రవర్తి పాత్ర చాలా కీలకమైనది. తన విజయాలకు వెన్నుదన్ను తన భార్య మయూరికానే అని చెబుతారు చిన్నయ్య. ఆతనికి ఆమె ఢిల్లీలోని జెఎన్‌యూలో పరిచయమయ్యారు. వారిద్దరి మధ్య ఉన్న స్నేహం కాలక్రమేణా ప్రేమగా మారి, పెళ్లికి దారితీసింది. వీరికి ఓ కొడుకు. అతని పేరు అభ్యుదయ్ జంగం. భారత సమాజంలోని దళితుల ఆక్రందనల్ని అంతర్జాతీయ వేదికలపై వినిపిస్తున్న చిన్నయ్యకు ఆమే పెద్ద తోడూ నీడా.

గెలుపు కేతనమై

ఏదో ఒక పోటీ పరీక్షలోనో, ఆటల్లోనో విజయం సాధిస్తే అది తాత్కాలికమే. కానీ నిరంతర బతుకుపోరులో విజేతగా నిలవడమంటే ఆదేమంత చిన్న విషయం కాదు. ఎన్ని అపజయాలు ఎదురైనా మొక్కవోని సంకల్పంతో దీక్షతో చిన్నయ్య ముందుకు సాగారు. సగటు భారతీయుడు కలలోనూ ఊహించని విధంగా గెలుపు కేతనమై నిలిచారు. ఇప్పుడు ఆయన ఈ దేశంలోని అణగారిన వర్గాల యువతకు ఓ రోల్ మోడల్. అతని గురించి తెలుసుకోవాలంటే గూగుల్ సెర్చ్ ఇంజన్‌లో చిన్నయ్య జంగం అనే పేరు టైపు చేస్తే చాలు వందల కొద్దీ పేజీలు కళ్ల ముందు ప్రత్యక్షమవుతాయి. తండ్రి పేరు లేకుండా, అసలు తండ్రి ఎవరో తెలియకుండా జీవిత సంఘర్షణలో అనేక ఆటుపోట్లను తట్టుకుని గెలిచి,నిలిచిన చిన్నయ్య జంగం ఎంతోమందికి ఆదర్శంగా ఉన్నారు. ఇప్పటికీ చాలా మందిలో ఇంకా ఆశ్చర్యమే "ఒక జోగిని కొడుకు చదువుకోవడమా? అదీ ఖండాలు దాటి? అసంభవం" అని కొందరిలో అపనమ్మకం. వారి నమ్మకాలను వమ్ముచేస్తూ చిన్నయ్య తానొకడిని ఉన్నానని నిరూపిస్తున్నారు. ఒకప్పుడు ఈసడించుకున్న సమాజమే ఇప్పుడు చిన్నయ్యను చూసి గర్వపడుతోంది.



చదువే.. చైతన్యం

సమాజంలో అంతరాలు పోవాలంటే చదువొక్కటే సరైన దారి. చైతన్యాన్ని సంతరించుకోవడానికి తగిన వివేకాన్ని, విచక్షణనీ చదువు మాత్రమే ఇస్తుంది. జీవితంలో ఎన్ని సమస్యలు ఎదురైనా చదువుకోవాల్సిందే. చదువుకుంటేనే మన సమస్యలు ఏమిటో? వాటికి కారణం ఎవరో? వాటిని ఎలా ఎదుర్కోవాలో తెలుస్తుంది.


- డాక్టర్ చిన్నయ్య జంగం

- బెందాళం క్రిష్ణారావు
(సోషల్ మీడియా ఆధారంగా)

రమణుల రంగవల్లి

బహుమతి పొందిన ముగ్గు






యం. లీలావతి
లక్కవరపుకోట
విజయనగరం జిల్లా



ఎల్. లక్ష్మి
మర్రిపూడి
ప్రకాశంజిల్లా



21 చుక్కల్లు
సరిచుక్క
1 వచ్చేవరకు

టి. వెంకాయమ్మ
గద్దలగుంట
ఒంగోలు




17 చుక్కలు
17 వరుసలు
సరిచుక్క



మా చిరునామా:
జీవన,'రమణుల రంగవల్లి', జీవన, ప్రజాశక్తి తెలుగు దినపత్రిక,
హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట,
విజయవాడ-2.
ఇమెయిల్: jeevanapageps@gmail.com
ఫోన్ నెం. 9490099006

అమాంతం ఎగిసిన అదానీ సంపద

- 2017లో 125% వృద్ధి
- ముఖేష్ ధనం 78% పైకి
- డిమార్ట్ అధినేత సంపదలో 80% పెరుగుదల
- ఇతర కార్పొరేట్లదీ అదే దారి..



ప్రజాశక్తి - బిజినెస్ డెస్క్

దేశంలో పేద, మధ్య తరగతి ప్రజల ఆదాయాలు పడిపోతుంటే మరోవైపు కార్పొరేట్ల నికర ఆస్తుల విలువ మాత్రం భారీగా పెరిగిపోతోంది. నోట్ల రద్దు, జిఎస్‌టి అమలు లాంటి చర్యల వల్ల ప్రజలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతుంటే బడా పెట్టుబడిదారులు మాత్రం పెద్ద ఎత్తున బాగు పడ్డారు. ఇందుకు నిదర్శనం గతేడాది పలువరి సంపద పరుగులు పెట్టడమే. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మిత్రుడు గౌతమ్ అదానీ సంపద అమాంతం పెరిగింది. దేశంలోనే నౌకాశ్రయాల నిర్వహణలో అదానీ అతిపెద్ద కార్పొరేట్‌గా ఉన్నారు. బ్లూమ్‌బర్గ్ రిపోర్టు ప్రకారం 2017 ఏడాదిలో అదానీ నికర సంపద అత్యధికంగా 124.6 శాతం ఎగిసింది. 2017 డిసెంబర్ 31 నాటికి ఆయన మొత్తం సంపద 10.4 బిలియన్ డాలర్లకు చేరింది. గతేడాది జనవరి నాటికి అదానీ ఆస్తులు 4.63 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. అదానీ తర్వాత డిమార్ట్ యాజమాని రాధాక్రిష్ణన్ దమాని సంపద 80 శాతం పెరిగి 6.96 బిలియన్ డాలర్లకు చేరింది. గతేడాది మార్చి నాటికి ఆయన ఆదాయం 3.88 బిలియన్ డాలర్లుగా ఉంది. ధమానీ ప్రస్తుతం ముంబయి కేంద్రంగా అవెన్యూ సూపర్ మార్కెట్స్ గ్రూపులో భాగంగా డి-మార్ట్ స్టోర్లను నిర్వహిస్తున్నారు. 2017 మార్చిలో దమానీకి చెందిన అవెన్యూ సూపర్ మార్కెట్స్ లిస్టింగ్‌కు వచ్చింది. ఈ కంపెనీ ఈక్విటీ షేర్‌ను రూ.299తో ఇష్యూ చేసింది. కాగా జనవరి 8 నాటికి ఈ సూచీ విలువ అమాంతం 340 శాతం పెరిగి రూ.1,235కు చేరింది. దీంతో ఆయన ఆదాయం భారీగా పెరిగింది.కాగా కార్పొరేట్ దిగ్గజం ముఖేష్ అంబానీ నికర సంపద 77.53 శాతం పెరిగి 40.30 బిలియన్ డాలర్లకు చేరింది. 2017లో ఆయన ప్రపంచంలోనే 20వ అతిపెద్ద కుబేరుడిగా గుర్తింపు పొందారు. కాగా 2017 జనవరిలో ముఖేష్ ఆదాయం 22.70 బిలియన్లుగా ఉంది. గతేడాది కుమార్ బిర్లా, అజీమ్ ప్రేమ్‌జీ, ఉదయ్ కొటాక్, విక్రమ్ లాల్, లక్ష్మీ మిట్టల్‌ల నికర సంపద వరుసగా 50.41 శాతం, 46.72 శాతం, 44.87 శాతం, 44.03 శాతం, 36.11 శాతం చొప్పున పెరిగింది. అదే విధంగా పల్లోంజీ మిస్త్రీ, సైరస్ పునవల్లా, శివ్ నాడార్‌ల నికర ధనం వరుసగా 27.01 శాతం, 16.50 శాతం, 15.83 శాతం చొప్పున పెరిగి వరుసగా 17.40 బిలియన్లు, 9.32 బిలియన్లు, 13.90 బిలియన్లకు చేరింది. మరోవైపు 2017 డిసెంబర్ 31 నాటికి ప్రపంచంలోనే అత్యంత కుబేరుడు జెఫ్ బెజోస్ సంపద 52 శాతం ఎగిసి 99 బిలియన్లకు చేరింది. జనవరి 2017లో ఆయన ఆదాయం 65 బిలియన్లుగా ఉంది. ప్రపంచంలోనే అతిపెద్ద ఆన్‌లైన్ పోర్టల్ అమెజాన్‌కు బెజోస్ వ్యవస్థాపకులుగా ఉన్నారు. రెండు, మూడు స్థానాల్లో ఉన్న బిల్ గేట్స్, వారెన్ బఫెట్‌ల నికర ఆస్తులు వరుసగా 12 శాతం, 17 శాతం పెరిగి 91.8 బిలియన్లు, 85.3 బిలియన్లకు చేరింది.

పెరిగిన సంపద..

పేరు	2017లో (డాలర్లలో)	ఇంతక్రితం (డాలర్లలో)	తేడా
గౌతం అదానీ	10.4 బిలియన్లు	4.63 బిలియన్లు	125%
రాధాక్రిష్ణన్ దమానీ	6.96 బిలియన్లు	3.88 బిలియన్లు	80%
ముఖేష్ అంబానీ	40.30 బిలియన్లు	22.70 బిలియన్లు	78%
జెఫ్ బెజోస్	99 బిలియన్లు	65 బిలియన్లు	52%
బిల్‌గేట్స్	91.83%	-	12%
వారెన్ బఫెట్	85.3 బిలియన్లు	-	17%

కార్డు లావాదేవీలపై ఛార్జీలు తగ్గించాలి

బ్యాంకులకు చమురు కంపెనీల సూచన

ముంబయి : కార్డుల ద్వారా జరిగే పెట్రోల్, డీజిల్ ఉత్పత్తుల కొనుగోళ్లపై లావాదేవీల ఛార్జీలను తగ్గించాలని చమురు కంపెనీలు బ్యాంకులను కోరాయి. సోమవారం బ్యాంకులతో జరిగిన చమురు సంస్థల భేటీలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, భారత్ పెట్రోలియం, హిందుస్థాన్ పెట్రోలియం ఈ ప్రతిపాదన చేశాయి. ఈ అంశంపై వచ్చే జనవరి 8న మరోసారి భేటీ కావాలని నిర్ణయించాయి. ఇప్పటికే చెల్లిస్తున్న ఛార్జీల కంటే తాము ఎక్కువగా చెల్లించలేమని చమురు కంపెనీలు స్పష్టం చేశాయి.. ప్రస్తుత నిబంధనల ప్రకారం ఈ ఛార్జీలు ఎక్కువగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశాయి. ఈ ఛార్జీలను మరింత తగ్గించాల్సిన అవసరం ఉందని చమురు కంపెనీల ప్రతినిధి ఒక్కరు తెలిపారు. వినియోగదారులు విసా, మాస్టార్ ఇతర డెబిట్ కార్డులతో జరిపే లావాదేవీలపై మర్చంట్ డిస్కౌంట్ రేటు (ఎండిఆర్) పేరుతో బ్యాంకులు చమురు కంపెనీల నుంచి రుసుం వసూలు చేస్తున్నాయి. నిబంధనల ప్రకారం గత డిసెంబర్ 31 వరకు రూ.1,000లోపు లావాదేవీలపై ఎండిఆర్ 0.25 శాతంగా ఉంది. రూ.1,000 నుంచి రూ.2,000 చెల్లింపులపై 0.5 శాతం, అపై విలువ చేసే అధిక చెల్లింపులపై 1 శాతం ఛార్జీలు వసూలు చేస్తున్నాయి.

విస్తరణకు ఎస్‌బిఐ నిధుల సమీకరణ



న్యూఢిల్లీ : దేశంలోనే అతిపెద్ద విత్త సంస్థ స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) బాండ్లను జారీ చేయడం ద్వారా 2 బిలియన్ డాలర్లు (సుమారు రూ.12600 కోట్లు) సమీకరించాలని యోచిస్తోంది. ఈ నిధులతో విదేశాల్లో విస్తరించాలని నిర్ణయించింది. ఇందుకోసం సెంట్రల్ బోర్డు కమిటీ ఆమోదం తెలిపిందని ఎస్‌బిఐ రెగ్యూలేటరీ సంస్థలకు వెల్లడించింది. ఏక, బహుళ పద్దతుల్లో ఈ మొత్తాన్ని సమీకరించాలని నిర్ణయించింది. 2017-18, 2018-19లో అమెరికా డాలర్లు లేదా ఇతర కన్వర్టైబుల్ కరెన్సీల ద్వారా 2 బిలియన్ డాలర్ల నిధులు సమీకరించడానికి ఆ బోర్డు అంగీకరించింది. బేసల్ 3 పెట్టుబడుల ప్రతిపాదికన మాసాల బాండ్లతో కలుపుకుని రూ.8000 కోట్లు సమీకరించడానికి గత మాసంలో ఎస్‌బిఐ బ్యాంకు బోర్డు ఆమోదం తెలిపింది. ఈ నిధులు సమీకరించడానికి మార్చి 2018ని గడువుగా పెట్టుకుంది. సోమవారం నిఫ్టీలో ఎస్‌బిఐ షేర్ 0.10 శాతం తగ్గి రూ.306.05 వద్ద ముగిసింది.

మార్కెట్ల కొత్త రికార్డులు..

సెన్సెక్స్ 34,353కు చేరిక



ముంబయి : వరుసగా రెండో సెషన్‌లోనూ దేశీయ స్టాక్ మార్కెట్లు దూకుడును ప్రదర్శించాయి. డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో కార్పొరేట్ కంపెనీలు మెరుగైన ఆర్థిక ఫలితాలు ప్రకటించనున్నాయనే అంచనాలకు తోడు అంతర్జాతీయ మార్కెట్ల ర్యాలీ విశ్వాసంతో సోమవారం మదుపర్లు భారీ కొనుగోళ్లకు మొగ్గు చూపారు. దీంతో సెన్సెక్స్, నిఫ్టీలు పరుగులు పెట్టాయని బ్రోకర్లు తెలిపారు. బిఎస్ఇ సెన్సెక్స్ 198.94 పాయింట్లు పెరిగి రికార్డు స్థాయిలో 34,352.79కి చేరింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 64.75 పాయింట్లు రాణించి 10.623.60 గరిష్ఠ స్థాయి వద్ద ముగిసింది. బిఎస్ఇలో రంగాల వారిగా ఐటి సూచీ 1.4 శాతం, కాపిటల్ గూడ్స్ 1.22 శాతం, వైద్య 1.2 శాతం, రియాల్టీ 0.87 శాతం చొప్పున పెరిగి మార్కెట్లకు దన్నుగా నిలిచాయి.

నేడు ఎన్ఎండిసిలో వాటా విక్రయం


హైదరాబాద్ : దేశంలోనే అతిపెద్ద ముడి ఇనుప ఖనిజం ఉత్పత్తిదారు ఎన్ఎండిసిలో మంగళవారం 1.5 శాతం వాటాను ప్రభుత్వం ఉపసంహరించుకోనుంది. ఈక్విటీ కనీస ధర రూ.153.50గా నిర్ణయించింది. ఆఫర్ ఫర్ సేల్ (ఒఎఫ్ఎస్) ద్వారా ప్రభుత్వం ఈ వాటాను ఉపసంహరించుకోనుంది. తొలి రోజు ఇన్స్‌ట్యూషనల్ ఇన్వెస్టర్స్‌కు అవకాశం కల్పించగా, బుధవారం రిటైల్ ఇన్వెస్టర్లకు ఈక్విటీలను కేటాయించనుంది. ఈ 1.5 శాతం వాటా విక్రయం ద్వారా రూ.750 కోట్లు సమీకరించుకోవాలని కేంద్రం నిర్దేశించుకుంది.

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

గుప్తులకాలం నాటి రచనలు?

గుప్తులయుగం (320-550 ఎడి)

గురువు



ఎవిపి.రాజు,
బిపిఎంఎం హైస్కూల్, విజయనగరం.
సెల్ : 9390465623

1. గుప్తవంశ మూలపురుషుడు ఎవరు ?

The first two guptas, srigupta and ghatotkacha were rulers of no consequence and are known only through respectful mention by chandragupta-1, the founder of the guptaline.

2. మొదటి చంద్రగుప్తుడు (క్రీ.శ 320-335) ఎవరు ?

గుప్తవంశాల మూలపురుషుడు శ్రీగుప్తుడు. ఇతడు పాటలీపుత్రం దాని పరిసర ప్రాంతాలకు అధిపతి. ఇతని కుమారుడు ఘటోత్కచుడు. ఘటోత్కచుని కుమారుడు మొదటి చంద్రగుప్తుడు. ఇతడు లిచ్చవీరాకుమార్తె అయిన కుమారీదేవిని వివాహమాడి, వారి సాయంతో గంగానదీ పరిసర ప్రాంతాలను జయించి, గుప్తసామ్రాజ్యానికి పునాదులు వేశాడు. ఇతడు క్రీ.శ 320 ఫిబ్రవరి 26న గుప్తశకాన్ని ప్రారంభించాడు.

By marriying a lichchhavi princess, chandragupta-1 sought to gain in prestige, though vaishali does not appear to have been part of his kingdom. His rule remained confined to magadha and parts of eastern uttar pradesh (saketa and prayaga). He took 319-20 marks the beginning of the gupta era.

3. 'నీతిసారం' గ్రంథకర్త ఎవరు ?

కౌటిల్యుని అర్థశాస్త్రానికి పూర్వార్ధంలోని ఒకటో చంద్రగుప్తుని కాలంలో కామందుకుని 'నీతిసారం' అనే గ్రంథం ప్రసిద్ధి చెందింది. ఆనాటి రాజనీతి, పరిపాలనా వ్యవస్థ ఈ నీతిసారంలో ప్రతిబింబిస్తున్నాయి.

4. గుప్తవంశం - రాజులు ఎవరు ?

- ✧ శ్రీగుప్తుడు (మూలపురుషుడు)
- ✧ ఘటోత్కచుడు
- ✧ మొదటి చంద్రగుప్తుడు (క్రీ.శ 320-335)
- ✧ సముద్రగుప్తుడు (క్రీ.శ 335-380)
- ✧ చంద్రగుప్త విక్రమాదిత్యుడు (క్రీ.శ 380-414)
- ✧ మొదటి కుమారగుప్తుడు (క్రీ.శ 414-435)
- ✧ స్కందగుప్తుడు (క్రీ.శ 435-467)

నోట్ : స్కందగుప్తుడు చివరిగొప్ప గుప్త చక్రవర్తి. అతని తర్వాత గుప్తరాజ్యం పతనం కావడం ప్రారంభమైంది. స్కందగుప్తుని తర్వాత పురుగుప్తుడు రాజయ్యాడు. తర్వాత 477 ఎడిలో బుద్ధగుప్తుడు అధికారంలోకి వచ్చాడు. హూణ దండయాత్రల వల్ల గుప్తరాజ్యం బాగా బలహీనపడి, మూడవ కుమారగుప్తుడు చివరి గుప్త చక్రవర్తి.

5. సముద్రగుప్తుడిని గుప్తవంశం గొప్పవాడు అని ఎందుకు అంటారు?

గుప్తచక్రవర్తులలోనేకాక భారతీయ చక్రవర్తులలో అగ్రగణ్యుడు సముద్రగుప్తుడు. ఇతనిని చరిత్రకారుడు స్మిత్ 'భారతీయ నెపోలియన్' అని అభివర్ణిస్తారు. ఇతడు గొప్ప విజేత. ఓటమి ఎరుగనిధీరుడు. సముద్రగుప్తుని దిగ్విజయయాత్రలను గురించి అతని మంత్రియైన హరిసేనుడు అశోకుని స్తంభముపై రాయించిన అలహాబాద్ ప్రశస్తి అనే శిలాశాసనం వల్ల తెలుస్తుంది. ఇతడు తన దిగ్విజయ యాత్రలతో గుప్తసామ్రాజ్యాన్ని ఉత్తర హిమాలయ పర్వతాల నుంచి దక్షిణ నర్మదానది వరకూ, పడమర యమున, చంబల్ నదుల నుంచి తూర్పు బ్రహ్మపుత్రవరకూ విస్తరింపజేశాడు.

సముద్రగుప్తుడు బహుముఖ ప్రజ్ఞాశాలి. ఇతడు గొప్పనాయకుడు. సంగీత విద్వాంసుడు. వీణ వాయిస్తున్నట్లు ఉన్న అతని బంగారు నాణేలు అతని సంగీత ప్రతిభను, సంగీతాభిమానాన్ని చాటుచున్నవి. సముద్రగుప్తుడు గొప్పకవి. కవి, పండిత పోషకుడు. ఇతనికి 'కవిరాజు' అనే బిరుదు ఉన్నది. ఇతని ఆస్థానంలో 'వసుబంధుడు' అనే బౌద్ధ పండితుడు ఉండేవాడు. From the allhabad panegyric, it appears that samudra gupta apart from being a conquered or was also a poet, musician and patron of lerning. His love for music is attested to by his gold coins, which represent him asfor playing the veena.

6. సంస్కృత సాహిత్యాన్ని అభివృద్ధి చేసిన 'నవరత్నాలు' అనే కవులు ఎవరి ఆస్థానంలో ఉన్నారు?

గుప్తచక్రవర్తులలోనేకాక భారతీయ చక్రవర్తులలో ప్రముఖుడు రెండో చంద్రగుప్తుడు లేక చంద్రగుప్త క్రమాదిత్యుడు. ఇతని పాలనాకాలం స్వర్ణయుగంగా కీర్తికెక్కింది. రెండో చంద్రగుప్తుడు తన తండ్రి సముద్రగుప్తుని వలే దిగ్విజయ యాత్రలు సాగించాడు. ఇందుకు మొదట భారతదేశంలోని బలీయులైన చక్రవర్తులతో వివాహ సంబంధాలు కలిపి, విదేశీయులైన శక్తులను భారతదేశం నుంచి తరిమివేశాడు. ఈ విజయానికి చిహ్నంగా చంద్రగుప్తుడు 'శకారి', 'సాహసాంక', 'విక్రమాదిత్య' అనే బిరుదులను ధరించాడు. సింహం బొమ్మగల బంగారు నాణేలను ముద్రించాడు.చంద్రగుప్తుని దిగ్విజయ యాత్రల వల్ల ఇతని రాజ్యం ఉత్తర హిమాలయ పర్వతాల నుంచి దక్షిణ నర్మదానది వరకూ, తూర్పు బెంగాలు నుంచి పశ్చిమ వల్లభి వరకూ విస్తరించింది.చంద్రగుప్త విక్రమాదిత్యుని ఆదరణలో ఉజ్జయిని గొప్ప విద్యాకేంద్రంగా విలసిల్లింది. విక్రమాదిత్యుని ఆస్థానంలో 'నవరత్నాలు' అనే తొమ్మిదిమంది సంస్కృత పండితులు ఉండేవారు. వారి పేర్లు...

1. కాళిదాసు 2. వరహమిహిరుడు
3. ధన్వంతరి 4. అమరసింహుడు
5. క్షపణకుడు 6. శంకు
7. భేతాళభట్టు 8. ఘటకర్పురుడు 9. వరరుచి

నవరత్నాలలో కాళిదాసు అగ్రగణ్యుడు. ఈయన రచించిన అభిజ్ఞాన శాకుంతలం, మేఘసందేశం, కుమారసంభవం, మాళవికాగ్నిమిత్రం, విక్రమోర్వశీయం, రఘువంశం, ఋతుసంహారం, మేఘదూత.. మొదలైన రచనలు సంస్కృత భాషలో అత్యుత్తమమైనవి. వరాహమిహిరుడు రచనలు.. పంచసిద్ధాంతం, బృహత్ సంహిత. తన బృహత్ సంహితలో చంద్రుడు భూమిచుట్టూ తిరుగుతున్నాడని, భూమి సూర్యుని చుట్టూ తిరుగుతున్నదని చెప్పాడు. బృహత్ జాతక అనే గ్రంథాన్నీ రచించాడు. ఇవి ఖగోళ, భౌతిక, వృక్ష, ప్రకృతి శాస్త్రాల విజ్ఞానసర్వస్వమని చెప్పవచ్చు.

7. రెండో చంద్రగుప్తుని కాలంలో భారతదేశాన్ని సందర్శించిన చైనా యాత్రికుడు ఎవరు?

చంద్రగుప్త విక్రమాదిత్యుని కాలంలో 'పాహియాన్' అనే చైనాయాత్రికుడు భారతదేశాన్ని సందర్శించాడు. ఇతడు భారతదేశంలో పది సంవత్సరాలు ఉమ్మడి గుప్తుల పాలనను ప్రశంసించాడు. ఇతని రచన 'రికార్డ్ ఆఫ్ బుద్ధిస్ట్ కింగ్‌డమ్స్. గుప్తుని కాలంలో ప్రజలపై పన్నుల భారం లేదని పేర్కొన్నాడు. సుమారు క్రీ.శ 399-414 మధ్య కాలంలో సందర్శించాడు.

8. గుప్తులకాలంనాటి- పండితులు - రచనలు ఏవి?

- ✧ రామచంద్రుడు - నాట్యదర్పణం
- ✧ సుబంధు - వాసవదత్త
- ✧ ప్రవరసేనుడు - సేతుబంధం
- ✧ వాగ్భటుడు - పుష్పాంగ సంగ్రహం (వైద్యశాస్త్రం)
- ✧ మాఘకవి - శిశుపాలవధ
- ✧ కాస్మాస్ - క్రిష్టియన్ టోపోగ్రఫీ
- ✧ బ్రహ్మగుప్తుడు - గురుత్వాకర్షణ శక్తి సిద్ధాంతం, బ్రహ్మసృత సిద్ధాంతం, కందకంద్యకా
- ✧ దండి - దశకుమార చరిత్ర, కావ్యదర్శ
- ✧ ఆర్యభట్టు - సూర్యసిద్ధాంతం, ఆర్యభట్టీయం
- ✧ శిఖాభదత్తుడు - ముద్రారాక్షసం, దేవీచంద్రగుప్తం
- ✧ శూద్రకుడు - మృచ్ఛకటికం, మృత్యకటిక
- ✧ విష్ణుశర్మ - పంచతంత్రం
- ✧ భారవి - కిరాతార్జునీయం
- ✧ బాణుడు - స్వప్నవాసవదత్త, ప్రతిజ్ఞాయుగంధరాయ
- ✧ మయూరుడు - సూర్య శతకం

9. గుప్తుల కాలంనాటి మంత్రిమండలి ఎలా ఉండేది?

చక్రవర్తికి పరిపాలనలో సహాయపడటానికి, మంత్రిమండలి ఉంది. మంత్రులను మంత్రి లేదా సచివ అని పిలిచేవారు. విశ్వాసపాత్రులైన వారిని, ప్రతిభగలవారిని మాత్రమే మంత్రులుగా నియమించారు.

1. సర్వాధక్ష : ఇతను మొత్తం కేంద్రపరిపాలనను పర్యవేక్షిస్తాడు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలను గవర్నర్లకు, జిల్లా అధికారులకు చేరవేసే బాధ్యత సర్వాధ్యక్షునిది.

2. మహాసేనాపతి : గుప్తచక్రవర్తులే సైన్యానికి నాయకత్వం వహించి దండయాత్రలు నడిపేవారు. అయినప్పటికీ సైనిక నిర్వహణ కోసం మహాసేనాధిపతిని నియమించేవారు.

3. మహాదండనాయక : ఇతను న్యాయాధిపతి

4. మహాబలాధికరణ : సైనికశాఖాధిపతి

5. దండోపాశిక : పోలీసుశాఖాధిపతి

6. మహాసంధివిగ్రహిక : విదేశాంగమంత్రి

7. భండాగారాధికృత : ప్రభుత్వకోశాధికారి

8. మహాప్రతిహార : ప్రభుకుటుంబ బాధ్యతలు చూసుకునేవాడు.

10. 'విషయపతి' అంటే ఎవరు ?

రాష్ట్ర పరిపాలనా కేంద్ర పరిపాలనను పోలి ఉంది. ప్రావిన్సులను జిల్లాలుగా (విషయ) విభజించారు. జిల్లాధికారిని విషయపతి అంటారు. ఇతన్ని ఐదేళ్ల కాలానికి నియమించారు. విషయ పరిపాలనా నిర్వహణ కోసం 30 మందితో కూడిన సలహాబోర్డు ఉండేది. ఈ బోర్డును 'విషయ మహత్తర' అంటారు. ఈ బోర్డు సభ్యులను విషయపతి నియమిస్తాడు. ఈ బోర్డు సభ్యులు వివిధరకాల గిల్డులు, వర్గాలకు ప్రాతినిధ్యం వహిస్తారు.

1. సార్థవహ - వ్యాపారవాణిజ్య సంస్థాధిపతి
2. నగరశ్రేష్ఠి - గిల్డు అధ్యక్షుడు
3. ప్రథమ కాయస్త - ప్రధానలేఖనుడు
4. ప్రథమ కులిక - మొదలైనవారు జిల్లా బోర్డులో సభ్యులుగా ఉండి, జిల్లా పరిపాలనలో విషయపతికి సహకరిస్తారు.

శ్రీవారిని దర్శించుకున్న రతన్‌టాటా

ప్రజాశక్తి-తిరుమల

తిరుమల వేంకటేశ్వరస్వామివారిని ప్రముఖ పారిశ్రామిక వేత్త రతన్‌టాటా దర్శించుకున్నారు. సోమవారం ఉదయం నైవేద్య విరామం సమయంలో ఆలయానికి చేరుకున్న ఆయనకు తిరుమల జేఈవో కె.ఎస్ శ్రీనివాసరాజు, ఓఎస్‌డి లక్ష్మీనారాయణ దగ్గరుండి దర్శన ఏర్పాట్లను చేశారు. అనంతరం రంగనాయక మండపంలో ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం చేయగా జేఈవో స్వామివారి శేష వస్త్రం కప్పి శ్రీవారి ప్రసాదాలను అందజేశారు. ఆలయం వెలుపల ఆయన మీడియాతో మాట్లాడుతూ స్వామివారిని దర్శించుకోవడం చాల సంతోషంగా ఉందన్నారు. ఎంపి కేశినేని నాని మాట్లాడుతూ నిర్మాణంలో ఉన్న కేన్సర్ ఆసుపత్రి పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు.



తిరుమలలో సోమవారం శ్రీవారిని దర్శించుకున్న అనంతరం రతన్‌టాటాకు శేష వస్త్రం కప్పి, ప్రసాదాలను అందజేస్తున్న తిరుమల తిరుపతి దేవస్థానం జెఇఒ శ్రీనివాసరాజు

కిడ్నీ రాకెట్‌లో కోడెల కుటుంబ హస్తం

వైసిపి ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి-గుంటూరు అర్బన్

రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేకెత్తిస్తున్న కిడ్నీ రాకెట్‌తో స్పీకర్ కోడెల శివప్రసాద్ కుటుంబానికి సంబంధం ఉందని నర్సరావుపేట వైసిపి ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. ఈ మేరకు జిల్లా రూరల్ ఎస్‌పి సిహెచ్ వెంకట అప్పలనాయుడును సోమవారం కలిసి కిడ్నీ రాకెట్ ఉదంతాన్ని పూర్తి స్థాయిలో పరిశీలించాలని, ఎంతటి వారైనా చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. నర్సరావుపేటలో కిడ్నీ మాఫియా చెలరేగిపోవటానికి కారణం కోడెల శివప్రసాద్ కుమారుడు, వారి కుటుంబ సభ్యులే కారణమని చెప్పారు.

కిడ్నీ దానం ఇవ్వాలంటే ప్రభుత్వ అధికారుల కమిటీ నిర్ధారించాల్సి ఉండగా నర్సరావుపేటలో మాత్రం తహశీల్దార్ టిడిపి నాయకులు ఫోన్ చేస్తే సంతకం పెట్టాల్సి వచ్చిందని చెప్పటం విడ్డూరంగా ఉందన్నారు. మానవ ప్రాణానికి సంబంధించిన దస్త్రాన్ని ఫొటోలు, చిరునామాలు మార్పులు చేసినా వాటిని పూర్తిగా చూడకుండా తహశీల్దార్ సంతకం పెట్టగా పోలీసులు ఆ దస్త్రాన్ని పరిశీలించి వెనక్కి పంపారని తెలిపారు. కేసును పూర్తిగా పరిశీలించి ఎంతటి దోషులున్నా వదిలిపెట్టకుండా కఠిన శిక్షలు విధించాలని ఎస్‌పిని కోరినట్లు తెలిపారు.

ప్రత్యామ్నాయం వామపక్ష ప్రభుత్వాలే

- తాగునీరు, వెలుగొండపై జన్మభూమి సభల్లో ప్రజాప్రతినిధులను నిలదీయండి
- కనిగిరి సభలో వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి - ఒంగోలు టౌన్ (ప్రకాశం)/విశాఖపట్నం ప్రతినిధి

దేశ ప్రజలకు ప్రత్యామ్నాయం వామపక్ష ప్రభుత్వాలేనని సిపిఎం కేంద్ర కార్యదర్శివర్గ సభ్యులు వి శ్రీనివాసరావు పేర్కొన్నారు. సిపిఎం ప్రకాశం జిల్లా 12వ మహాసభలు సందర్భంగా కనిగిరిలో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. బిజెపి పాలనలో అతిపెద్ద కుంభకోణం నోట్లు రద్దు అన్నారు. నోట్లు రద్దుతో నల్లడబ్బు మొత్తం తెల్లడబ్బుగా మారిందన్నారు. నల్లడబ్బు ఉన్న వారంతా మోడీ చుట్టూ చేరారన్నారు. బిజెపి అధ్యక్షులు అమిత్‌షా కొడుకు ఒక సంవత్సరంలోనే కోట్లు సంపాదించారన్నారు. చంద్రబాబు నాయుడు హయాంలో తాగునీరు కూడా దక్కడం లేదని విమర్శించారు. వెలుగొండ ప్రాజెక్ట్, తాగునీరు కోసం జన్మభూమి సభల్లో ప్రజాప్రతినిధులను ప్రజలు నిలదీయాలని పిలుపునిచ్చారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు దడాల సుబ్బారావు మాట్లాడుతూ.. దేశంలో బిజెపి, రాష్ట్రంలో టిడిపి చేసిన వాగ్దానాలను అమలు చేయాలని పోరాడుతున్న పార్టీ సిపిఎం ఒక్కటేనన్నారు. చంద్రబాబు గద్దెనెక్కిన తరువాత పేదల భూమలను బలవంతంగా లాక్కొంటున్నారని విమర్శించారు. దేవరపల్లిలో దళితుల భూములలో కుంట తవ్వేందుకు ప్రయత్నం చేశారన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. బిజెపి, టిడిపి ప్రభుత్వాలు ప్రజలపై అసహనం వ్యక్తం చేస్తున్నాయని విమర్శించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి పూనాటి ఆంజనేయులు మాట్లాడారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్‌డి హనీఫ్ అధ్యక్షతన వహించారు.



ప్రకాశం జిల్లా కనిగిరి సభలో మాట్లాడుతున్న సిపిఎం కేంద్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.శ్రీనివాసరావు

ఆకట్టుకున్న ప్రదర్శన

సిపిఎం ప్రకాశం జిల్లా 12వ మహాసభల ప్రారంభం సందర్భంగా సోమవారం సాయంత్రం కనిగిరిలో భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఆర్‌అండ్‌బి కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ ఉత్సాహంగా సాగింది. లయబద్ధమైన, వీనులవిందైన డప్పు వాయిద్యాలతో.. కళాకారుల నృత్యాలతో.. విద్యార్థులతో కోలాటాలతో.. ప్రజా గాయకులు ఆలాపనలతో ర్యాలీ ఆద్యంతం ఆకట్టుకుంది.

స్థానిక కపిలసెంటర్, పామూరు బస్టాండ్ సెంటర్, ఉప్పురోడ్డు, ఒంగోలు బస్టాండ్, కొట్ల బజార్, బొడ్డుచావిడి సెంటర్, ఎంఎస్‌ఆర్‌రోడ్డు, తీగలగొంది మీదుగా కాస్మోపాలిటన్ క్లబ్ సమీపంలోని తహశీల్దారు కార్యాలయం వరకు సాగింది. అక్కడ బహిరంగ సభ జరిగింది. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, దడాలు సుబ్బారావు, సిపిఎం జిల్లా కార్యదర్శి పూనాటి ఆంజనేయులు ర్యాలీ ముందు భాగాన నడిచారు.



విశాఖ జిల్లా అచ్యుతాపురం మహాసభలో మాట్లాడుతున్న సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు హేమలత

సమగ్రాభివృద్ధికి చర్యలు తీసుకోవాలి
సిపిఎం విశాఖ జిల్లా 22వ మహాసభ తీర్మానం

విశాఖ జిల్లా సమగ్రాభివృద్ధికి చర్యలు తీసుకోవాలని సిపిఎం విశాఖ జిల్లా 22వ మహాసభ తీర్మానించింది. మహాసభ చివరి రోజైన సోమవారం 13 తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించింది. గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పటిష్టంగా అమలు చేసి, బకాయిలు వెంటనే చెల్లించాలని, తీర ప్రాంత మత్స్యకారుల జీవనోపాధిని దెబ్బతీస్తున్న కాలుష్యాన్ని నియంత్రించాలని, 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని, పరిశ్రమల్లో స్థానికులకు, నిర్వాసితులకు ఉద్యోగాల్లో ప్రాధాన్యత ఇవ్వాలని, అచ్యుతాపురంలో స్కిల్ డెవలెప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని తీర్మానించింది. ప్రభుత్వ విద్యను బలోపేతం చేసి నాణ్యమైన విద్యను అందించాలని, కొండకుమ్మర్లను ఎస్టీ జాబితాల్లో చేర్చాలని, పిటిజి గిరిజనుల అభివృద్ధి కోసం ప్రత్యేక పథకం, నిధులు ప్రకటించాలని, గిరిజనులు పండించే అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించాలని, జిల్లాలో నాలుగు సహకార చక్కెర ఫ్యాక్టరీలను ప్రభుత్వమే ఆధునికీకరించి, సహకార రంగంలో నడిపించాలని తీర్మానించింది. పరవాడలో ధూళి కాలుష్యంతో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న బొగ్గు లారీలను ఆపాలని, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, జిల్లాలో నీటిపారుదల ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలని మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. మహాసభకు పరిశీలకులుగా హాజరైన పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు డాక్టర్ కె.హేమలత, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.నర్సింగరావు, డాక్టర్ మిడియం బాబూరావు, ఎం.కృష్ణమూర్తి ఉద్యమ బలోపేతానికి సలహాలతోపాటు సందేశమిచ్చి కార్యకర్తల్లో నూతనుత్తేజాన్ని నింపారు. రెండు రోజుల పాటు 22 తీర్మానాలను ఆమోదించారు. ఈ మహాసభల్లో రాబోయే మూడేళ్ల కాలంలో చేపట్టే ఉద్యమాలకు కార్యాచరణ రూపొందించారు. రెండు రోజుల పాటు అచ్యుతాపురం జంక్షన్‌లో ప్రజా నాట్యమండలి కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నాయి.



గుంటూరులో హైడ్రామా

అంబటి- బుద్ధా బహిరంగ చర్చకు పోలీసుల బ్రేక్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్రంలో అర్హులకు పింఛన్లు, రేషన్ కార్డులు అందడం లేదని వైసిపి అధికార ప్రతినిధి అంబటి రాంబాబు, అందరికి పింఛన్లు అందుతున్నాయని ఎమ్మెల్సీ బుద్ధా వెంకన్న పరస్పర సవాళ్లు విసురుకుని సోమవారం సత్తెనపల్లి వేదికగా బహిరంగ చర్చకు సిద్ధం అయ్యారు. అయితే పోలీసులు వీరిని అడ్డుకున్నారు. గుంటూరులో అంబటిని గృహ నిర్బంధం చేశారు. విజయవాడ నుంచి సత్తెనపల్లి వెళ్తున్న వెంకన్నను గుంటూరు చుట్టుగుంట వద్ద అదుపులోకి తీసుకుని వెనక్కి పంపారు. ఈ వ్యవహారంలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ హైడ్రామా నడిచింది. సత్తెనపల్లిలో సెక్షన్ 30 అమలులో ఉందని, ఎవ్వరూ అనుమతి లేకుండా ర్యాలీలు, సభలు నిర్వహించరాదని పోలీసులు ఆదేశాలు జారీ చేశారు. ఇద్దరు నేతల బహిరంగ చర్చ నేపథ్యంలో పోలీసులు నిషేధాజ్ఞలు విధించారు. సత్తెనపల్లిలో ర్యాలీకి ప్రయత్నించిన వైసిపి నేతలు, కార్యకర్తలను పోలీసులు నిలువరించారు. అయితే స్పీకర్ కోడెల శివ ప్రసాదరావు కుమారుడు కోడెల శివరామ్ నేతృత్వంలో తమకు సంక్షేమ పథకాలు అన్ని అందుతున్నాయని, వీటిని అడ్డుకునేందుకు వైసిపి నేతలు కుట్ర పన్నుతున్నారని పలువురు టిడిపి కార్యకర్తలు, నాయకులతో కలసి సత్తెనపల్లిలో ర్యాలీ నిర్వహించారు. నిషేధాజ్ఞలున్నా వీరి ర్యాలీకి అనుమతించి వైసిపి ర్యాలీకి పోలీసులు అనుమతించకపోవడం ప్రభుత్వ పక్షపాత ధోరణికి నిదర్శనమని అంబటి రాంబాబు విమర్శించారు.

నేడు సిపిఎస్ రద్దు కోరుతూ ధర్నాలు

పజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ఉద్యోగుల హక్కులను కాలరాసే కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సిపిఎస్)కు వ్యతిరేకంగా పోరుబాటలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వోద్యోగులు, ఉపాధ్యాయులు, సిపిఎస్ ఉద్యోగులతో కలిసి ఏర్పాటు చేసిన పెన్షన్ సాధన సమితి ఆధ్వర్యాన మంగళవారం కలెక్టరేట్, తాలుకా కేంద్రాల వద్ద ధర్నాలు నిర్వహించనున్నారు.

సిపిఎం గుంటూరు జిల్లా నూతన కమిటీల ఎన్నిక

తూర్పు జిల్లా కమిటీ కార్యదర్శిగా పాశం రామారావు
పశ్చిమ జిల్లా కమిటీ కార్యదర్శిగా గద్దె చలమయ్య

ప్రజాశక్తి-గుంటూరు

సిపిఎం గుంటూరు జిల్లాల నూతన కమిటీలను శని, ఆదివారాల్లో నిర్వహించిన జిల్లా మహాసభల్లో ఎన్నుకున్నారు. గుంటూరు జిల్లా (తూర్పు) కమిటీ కార్యదర్శిగా పాశం రామారావు, గుంటూరు జిల్లా (పశ్చిమ) కమిటీ కార్యదర్శిగా గద్దె చలమయ్య ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సోమవారం వారు గుంటూరులోని సిపిఎం కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. ప్రజాసమస్యలపై క్షేత్ర స్థాయిలో అధ్యయనం చేసి విస్తృత ప్రజాఉద్యమాలు చేపట్టాలని జిల్లా మహాసభల్లో నిర్ణయించినట్లు చెప్పారు. గుంటూరు జిల్లాలోని పల్నాడు ప్రాంతం విద్య, వైద్యం, అన్ని రంగాల్లో వెనుకబడి ఉందని, ఎంతో చరిత్ర కలిగిన పల్నాడు అభివృద్ధిని పాలకులు విస్మ రించారని విమర్శించారు. నాగార్జున సాగర్ కుడి కాల్వకు నీరు విడుదల చేయకపోవటంతో పల్నాడు ప్రాంతంలో లక్షలాది ఎకరాలు ఎండిపోతున్నాయన్నారు. రాజధానిలో లంక భూముల సమస్యలు, వ్యవసాయ కార్మికుల సమస్యలపై ఆందోళనలు నిర్వహించాలని మహాసభ నిర్ణయించిందన్నారు. దళితుల శ్మశాన భూములు, కౌలు రైతుల సమస్యలపై ప్రజా క్షేత్రంలో ఆందోళనలు చేపట్టబోతున్నట్లు వెల్లడించారు.



పాశం రామారావు



గద్దె చలమయ్య

బ్రహ్మోత్సవ బహుమతి కోసం ఎస్‌డబ్ల్యుయుఎఫ్ వినతి

ప్రజాశక్తి-తిరుపతి సిటీ

బ్రహ్మోత్సవ బహుమానాన్ని త్వరగా ఇప్పించాలని రాష్ట్ర దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శికి టిటిడి స్టాఫ్‌అండ్ వర్కర్స్ యునైటెడ్ ఫ్రంట్ (ఎస్‌డబ్ల్యుయుఎఫ్) నాయకులు సోమవారం వినతిపత్రం సమర్పించారు. అందుకు ఆయన స్పందించి దేవదాయశాఖ కార్యదర్శి 10 రోజుల్లోపు ప్రభుత్వంతో మాట్లాడి, ఆ మేరకు ఉత్తర్వులు జారీ చేస్తామని హామీ ఇచ్చారన్నారు.

ప్రజ్ఞ

జవాబులు

1. ఖాట్మాండు (నేపాల్)
2. 23 మిలియన్లు
3. కోయంబత్తూర్
4. పవర్ లిఫ్టింగ్, 5. ఒడిషా

కొనసాగిన నిరసన సెగలు

- పలుచోట్ల జన్మభూమి బహిష్కరణ

ప్రజాశక్తి-యంత్రాంగం

జన్మభూమి-మాఊరు కార్యక్రమానికి ప్రజల నిరసన సెగలు కొనసాగుతూనే ఉన్నాయి. సమస్యలపై జన్మభూమి సభల్లో ప్రజాప్రతినిధులను, అధికారులను నిలదీస్తూనే ఉన్నారు. సోమవారమూ రాష్ట్రవ్యాప్తంగా ఇదే పరిస్థితి కొనసాగింది. పలుచోట్ల జన్మభూమి సభలను బహిష్కరించారు. సాగు భూములకు పట్టాలు ఇవ్వకపోవడం, సుబాబుల్ రైతులకు బకాయిలు చెల్లించకపోవడంపై కృష్ణా జిల్లా నందిగామ మండలం రాఘవాపురం జన్మభూమి సభలో జిల్లా జాయింట్ కలెక్టర్ విజయ్‌కృష్ణన్, నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యలను నిలదీశారు. పేదలకు ఇచ్చేందుకు ఇళ్ల స్థలాలు అందుబాటులో లేవని ప్రభుత్వం చెప్పుండటంపై సిపిఎం, సిపిఐ ఆధ్వర్యాన ప్రజలు ఎమ్మెల్యే గద్దె రామమోహన్‌ను ప్రశ్నించారు. కాలువపై మోటార్లకు విద్యుత్ సరఫరా నిలిపివేయడంపై నెల్లూరు జిల్లా జలదంకి పంచాయతీ వేములపాడులో తెలుగు తమ్ముళ్లు, రైతులు నిలదీశారు. రుణాలు, సంక్షేమ పథకాలు అందకపోవడంపై తూర్పుగోదావరి జిల్లా ఎటపాక మండలం విస్సాపురంలో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గత జన్మభూమిలో ఇచ్చిన వినతులు పరిష్కారం కాకపోవడాన్ని నిరసిస్తూ చింతూరు మండలం పేగలో జన్మభూమిని బహిష్కరించారు. ప్రత్తిపాడు సభలో సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ నాయకులు ప్రజాసమస్యలపై అధికారులను నిలదీశారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకోడేరు మండలం పెన్నాడ సభలో ఆక్వా చెరువుల తవ్వకాలతో తాగునీటి జలాలు కలుషితమవుతుండటం పట్ల అధికారులపై మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. విశాఖ జిల్లా దేవరాపల్లి మండలం తిమిరాం, ఎం.అలమండ జన్మభూమి సభల్లో టిడిపి గ్రూపుల మధ్య గొడవలతో గందరగోళం చోటు చేసుకోవడంతో పోలీసులు జోక్యం చేసుకుని చక్కదిద్దారు. చీడికాడ మండలం జైతవరం, ఖండివరం గ్రామసభల్లో పింఛన్ల కోసం అధికారులను వృద్ధులు నిలదీశారు. కె.కోటపాడు మండలం సంతపాలెంలో ఎంపిపి పుష్పవతి సెగ్మెంట్‌లోని సమస్యలు అపరిష్కృతంగా ఉండటంతో స్థానికులు నిలదీశారు. రాయితీపై మొక్కజొన్న విత్తనాలు, పురుగు మందులు ఇవ్వకపోవడంపై శ్రీకాకుళం జిల్లా పాలకొండ మండలం బూక్కూరు జన్మభూమి సభలో కలెక్టర్ కె.ధనంజయరెడ్డిని ప్రశ్నించారు. సిసి రోడ్లు, కాలువల సమస్యలపై సంతకవిటి మండలం కాకరాపల్లి, మందరాడల్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. విజయనగరం జిల్లా గుమ్మలక్ష్మీపురం మండలం లోవముఠా ప్రాంతమైన వనకాబడి పంచాయతీలో సమస్యలపై సిపిఎం ఆధ్వర్యాన పేదలు అధికారులను నిలదీశారు. విజయనగరంలోని 20వ వార్డులో సమస్యలపై సిపిఎం ఆధ్వర్యాన అధికారులను ప్రజలు ప్రశ్నించారు. కర్నూలు జిల్లాలో స్థానిక సమస్యలపై ప్రజాప్రతినిధులను, అధికారులను ప్రజలు, సిపిఎం నాయకులు నిలదీశారు. అనంతపురం జిల్లా పెద్దపప్పురు మండలం ముచ్చుకోటలో జన్మభూమిని దళితులు అడ్డుకున్నారు.

పాదయాత్ర

పోలవరం పూర్తయ్యేవరకూ ఉద్యమం

- రెండోరోజూ కాంగ్రెస్ మహా పాదయాత్ర

ప్రజాశక్తి-కొవ్వూరు (పశ్చిమగోదావరి)

పోలవరం ప్రాజెక్టు పూర్తయ్యే వరకూ ఉద్యమం ఆగదని ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (పిసిసి) అధ్యక్షుడు ఎన్.రఘువీరారెడ్డి అన్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తి చేయాలని కోరుతూ చేపట్టిన కాంగ్రెస్ మహాపాదయాత్ర రెండోరోజైన సోమవారం ఉదయం పశ్చిమ గోదావరి జిల్లా కొవ్వూరు నుంచి కొనసాగింది. తొలుత బాపూజీ కూరగాయల మార్కెట్ వద్ద మెయిన్ రోడ్డుపై ఉన్న రాజీవ్‌గాంధీ విగ్రహానికి నాయకులు పూల మాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. పార్టీ సీనియర్ నాయకులు వట్టి వసంతకుమార్ కాంగ్రెస్ జెండాను ఆవిష్కరించారు. మెరక వీధి సెంటర్‌లో వైఎస్ఆర్, అంబేద్కర్, ఇందిరాగాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం ఏలూరు-కొవ్వూరు రోడ్డు మీదుగా దొమ్మేరు వరకూ పాదయాత్ర కొనసాగింది. దొమ్మేరులో ముస్లిం మహిళలు పాదయాత్రకు ఘన స్వాగతం పలికారు. అనంతరం అక్కడ విలేకర్లతో రఘువీరారెడ్డి మాట్లాడుతూ రాజకీయాలకతీతంగా ప్రాజెక్టు సాధన కోసం పాదయాత్రను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోలవరం పూర్తి ఫలాలు అందరికీ అందేవరకూ ఉద్యమాన్ని ఆపేది లేదని స్పష్టం చేశారు. చంద్రబాబు మూడున్నరేళ్ల పాలనలో ప్రాజెక్టు పేరు మార్చడం తప్ప సాధించిందేమీ లేదని విమర్శించారు. పాదయాత్రలో కెవిపి రామచంద్రరావు, పార్టీ సీనియర్ నాయకులు జెడి శీలం, పల్లంరాజు, పనబాక లక్ష్మి, కనుమూరి బాపిరాజు, తులసిరెడ్డి, తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల డిసిసి అధ్యక్షులు పంతం నానాజీ, రఫీఉల్లాబేగ్, పాల్గొన్నారు.



పశ్చిమగోదావరి జిల్లా కొవ్వూరులో మహా పాదయాత్రలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

దళితులపై దాడి చేసిన వారిని శిక్షించాలని ధర్నా

ప్రజాశక్తి- విజయనగరం టౌన్

విజయనగరం జిల్లా డెంకాడ మండలం మోదవలస దళితులపై దాడి చేసిన టిడిపి కార్యకర్తలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ విజయనగరం కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. కెవిపిఎస్, సిపిఎం, జిల్లా దళిత చైతన్య సేవా సంఘం, వైసిపి జిల్లా ఎస్సీ సెల్, బిహెచ్‌పిఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ధర్నాలో వక్తలు మాట్లాడుతూ.. జన్మభూమిలో వినతులు ఇచ్చేందుకు సిద్ధమవుతున్న దళితులపై నెల్లిమర్ల ఎమ్మెల్యే కుమారుడు అమ్మినాయుడు, ఎంపిటిసి భర్త కాగితాల సత్యనారాయణ అనుచరులు సభకు రానివ్వకుండా అడ్డుకుని దాడి చేయడం దుర్మార్గమన్నారు. కర్రలు, బరిసెలతో అతి దారుణంగా మూడుసార్లు దళితులపై దాడి చేశారని తెలిపారు. కులం పేరుతో దూషించారని, దళిత మహిళలను లైంగిక వేధింపులకు గురి చేశారని విమర్శించారు. నిందితులను వెంటనే అరెస్టు చేసి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం ప్రకారం కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. దళితులకు రక్షణ కల్పించాలని కోరారు. ధర్నాలో కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఆర్.ఆనంద్, సిపిఎం నాయకులు ఎ.జగన్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

'అరుణాచల్ ప్రతిష్టంభన'కు తెర

సైన్యాధిపతి రావత్ వెల్లడి

న్యూఢిల్లీ: అరుణాచల్ ప్రదేశ్‌లోని ట్యూటింగ్ వద్ద భారత్-చైనా సైనిక దళాల మధ్య ఏర్పడిన ప్రతిష్టంభనకు తెరపడిందని సైన్యాధిపతి జనరల్ బిపిన్ రావత్ తెలిపారు. సోమవారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ గత వారాంతంలో అరుణాచల్ ప్రదేశ్‌లోని కిబితులో జరిగిన సరిహద్దు భద్రతా సిబ్బంది సమావేశంలో ఈ మేరకు ఉభయదేశాల మధ్య అంగీకారం కుదిరిందని వివరించారు. భారత భూభాగంలో ఒక కిలోమీటర్ మేర చైనా సిబ్బంది రోడ్డు నిర్మించినట్లు స్థానికులు ఫిర్యాదు చేయడంతో భారత సైన్యం 25 మంది చైనీయుల్ని నిర్బంధంలోకి తీసుకున్నట్లు మీడియాలో వార్తా కథనాలు వెలువడిన విషయం తెలిసిందే. గతంలో డోక్లాం వివాదం పరిష్కారమైన తరువాత సరిహద్దుల్లో చైనా తన సైన్యాన్ని తగ్గించిందని రావత్ పేర్కొన్నారు.



ముగింపు ।

సినిమా హాళ్ళలో జాతీయగీతం పాడటానికి ముగింపు పలుకుతూ అఫిడవిట్ దాఖలు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించిన నేపథ్యంలో జాతీయగీతం పాడటాన్ని తప్పనిసరి చేయాలని కోర్టు ఆదేశించటానికి ముందున్న పరిస్థితిని పునరుద్ధరించాలని ప్రభుత్వం సుప్రీంకోర్టును కోరింది.

జడ్జీ బిహెచ్ లోయ మృతిపై విచారణ జరపాలి

ముంబయి న్యాయవాదుల సంఘం పిటిషన్

ముంబయి : సోహ్రాబుద్దీన్ నకిలీ ఎన్‌కౌంటర్ కేసును విచారిస్తున్న జడ్జీ బిహెచ్ లోయ మృతిపై విచారణ జరపాలని ముంబయి హైకోర్టులో పిటిషన్ దాఖలయ్యింది. ఈ పిటిషన్‌ను ముంబయి న్యాయవాదుల సంఘం దాఖలు చేసింది. సుప్రీంకోర్టు మాజీ జడ్జీ నేతృత్వంలో కమిషన్ ఏర్పాటు చేసి విచారణ జరపాలని కోరింది.బిజెపి అధ్యక్షుడు అమిత్‌షాపై సిబిఐ హత్య కేసును విచారిస్తున్న 48 ఏళ్ల లోయ 2014, డిసెంబరు 1న గుండెపోటుతో నాగ్‌పూర్‌లో మృతి చెందారు. ఒక వివాహ వేడుకలో పాల్గొనేందుకు వచ్చిన లోయ మృతిపై ఆయన కుటుంబ సభ్యులు కూడా అనేక సందేహాలు లేవనెత్తారు. గుండెనొప్పి వచ్చిన వెంటనే ఆయన సమీపంలో ఆసుపత్రికి నడుచుకుంటూనే వెళ్లారు. అయితే అక్కడ వేరే ఆసుపత్రికి వెళ్లమని సూచించారు. అక్కడ ఆయన మృతి చెందారు.లోయ మృతదేహాన్ని తిరిగి ఇచ్చినప్పుడు దుస్తులపై రక్తపు మరకలు ఉన్నాయని కుటుంబసభ్యులు చెబుతున్నారు. అలాగే నాగ్‌పూర్ నుంచి మృతదేహాన్ని లోయ స్వగ్రామానికి ఆర్ఎస్ఎస్‌కు చెందిన ఒక వ్యక్తి తరలించినట్లు స్థానికులు చెబుతున్నారు.

పత్రికా స్వేచ్ఛకు కట్టుబడి వున్నాం

'ఆధార్ ఎఫ్ఐఆర్'పై కేంద్రం

న్యూఢిల్లీ: ఆధార్ కార్డు సమాచారం లీకేజ్‌పై పత్రికల్లో ప్రచురితమైన వార్తల పట్ల అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై విమర్శలు చెలరేగిన నేపథ్యంలో ప్రభుత్వం దిద్దుబాటు వైఖరి చేపట్టింది. కేంద్ర న్యాయ, ఐటి శాఖల మంత్రి రవిశంకర్ ప్రసాద్ సోమవారం ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పత్రికా స్వేచ్ఛకు కట్టుబడి వుందని, ఎఫ్ఐఆర్‌ను కేవలం 'గుర్తు తెలియని' వ్యక్తులపై మాత్రమే నమోదు చేశామని స్పష్టం చేశారు. 'అమ్మకానికి ఆధార్ డేటా' వివిధ పత్రికల్లో వచ్చిన వార్తా కథనాలపై స్పందించిన యుఐడిఎఐ చేసిన ఫిర్యాదు మేరకు ఢిల్లీ



పోలీసులు ట్రిబ్యూన్ ఆంగ్లపత్రిక యాజమాన్యంతో పాటు ఆ కథనాన్ని రాసిన విలేఖరి తదితరులపై ఎఫ్ఐఆర్ నమోదు చేసిన విషయం తెలిసిందే. పత్రికా స్వేచ్ఛలో భాగంగానే తాము పరిశోధనాత్మక వార్తా కథనాలను ప్రచురిస్తున్నామని ట్రిబ్యూన్ యాజమాన్యం తమ చర్యను గట్టిగా సమర్థించుకుంది. ట్రిబ్యూన్ పత్రికపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేసిన భారత పత్రికా సంపాదకుల సమాఖ్య (ఎడిటర్స్ గిల్డ్) ఆధార్ డేటా విక్రయాల వ్యవహారంపై నిష్పాక్షిక దర్యాప్తు జరిపించాలని కేంద్రాన్ని డిమాండ్ చేసింది. పాత్రికేయులు, పత్రికలపై ఎఫ్ఐఆర్ నమోదు చేయటం తీవ్ర ఆందోళనకరమైన చర్య అని గిల్డ్ తన ప్రకటనలో పేర్కొంది. ఈ నేపథ్యంలో మంత్రి రవిశంకర్ మాట్లాడుతూ ఆధార్ డేటా విక్రయాలపై జరుగుతున్న దర్యాప్తులో పోలీసులకు సహకరించాల్సిందిగా ట్రిబ్యూన్ పత్రిక యాజమాన్యాన్ని, ఆ పత్రికా విలేకరిని కోరాలని తాను యుఐడిఎఐ అధికారులకు సూచించినట్లు చెప్పారు.

మనం బనానా రాజ్యంలో ఉన్నామా?

శత్రుఘ్నసిన్హా విస్మయం



ఆధార్ డేటా విక్రయాలపై పరిశోధనాత్మక వార్తా కథనం రాసిన విలేకరిపై పోలీసు కేసు నమోదు చేయడం పట్ల బిజెపి ఎంపి శత్రుఘ్నసిన్హా తీవ్ర విస్మయాన్ని వ్యక్తం చేశారు. 'మనం ఏమైనా బనానా రాజ్యం'లో నివసిస్తున్నామా? అని ఆయన ట్విట్టర్‌లో ప్రశ్నించారు. ఆధార్ డేటా విక్రయాలపై నిజాన్ని నిర్భయంగా వెలుగులోకి తెచ్చిన పాత్రికేయుడి సాయంతో నిజాలు నిగ్గుతేల్చాల్సిన ప్రభుత్వ వ్యవస్థ ఆ పాత్రికేయుడిపై కేసులునమోదు చేసి వేధింపులకు గురిచేయడమేంటని ఆయన నిలదీశారు. 'ఇదేం న్యాయం, ఇక్కడ ప్రతీకార రాజకీయాలు కొనసాగుతున్నాయా? సమాజం కోసం, దేశం కోసం నిజాయితీగా ముందుకొచ్చిన వారిపై వేధింపులు కొనసాగుతున్నాయి' అని ఆయన తన ట్వీట్‌లో ఆందోళన వ్యక్తంచేశారు.

పోలీసు రాజ్యానికిది సంకేతమా?

మాజీ మంత్రి అశ్వినీకుమార్



ఆధార్ డేటా విక్రయాలపై వార్త రాసిన పత్రికా విలేకరిపై యుఐడిఎఐ సంస్థ ఫిర్యాదుచేయడం పట్ల కేంద్ర మాజీ మంత్రి అశ్వినీకుమార్ విస్మయాన్ని వ్యక్తం చేశారు. పత్రికా కథనాలు రాసిన వారిపై పోలీసులకు ఫిర్యాదు చేయడం పోలీసు రాజ్యానికి సంకేతంగా కనిపిస్తోందని ఆయన విమర్శించారు. సోమవారం నాడు ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ ఒక పత్రికా విలేకరి తన విధి నిర్వహణలో భాగంగా సాంకేతిక పరిజ్ఞానంతో 'అంతా మంచే జరగదు' అన్న విషయాన్ని తేటతెల్లం చేస్తూ వార్తా కథనం రాస్తే, దానిలో లొసుగులు సరిదిద్దాల్సిన ప్రభుత్వం పోలీసులకు ఫిర్యాదు చేయడమేంటని ప్రశ్నించారు. ఆధార్ గోప్యతపై పార్లమెంటు సభ్యులు గతంలో వ్యక్తం చేసిన అభిప్రాయలపై అధ్యయనం చేసేందుకు అప్పటి ప్రభుత్వం జస్టిస్ ఎపి షా నేతృత్వంలో కమిటీని నియమించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ఆధార్ డేటా, దాని గోప్యతకు సంబంధించిన సమస్యల్ని అధ్యయనం చేయడంతో పాటు ఆధార్ వ్యవస్థలో ఉపయోగిస్తున్న సాంకేతిక పరిజ్ఞానం అంతా భద్రతా పరంగా సరైనది కాదన్న విషయాన్ని ట్రిబ్యూన్ పత్రిక తన కథనం ద్వారా నిరూపించిందన్నారు. ఈ అంశాన్ని వెలుగులోకి తెచ్చిన పత్రికపైనా, విలేకరిపైనా యుఐడిఎఐ పోలీసులకు ఫిర్యాదు చేసిందన్న విషయం తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. విశ్వసనీయత లేని వాదనలను పక్కన పెట్టి ఈ వ్యవస్థలో లొసుగుల్ని సరిదిద్దేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

శ్రీహరికోట నుంచి 12న అంతరిక్షంలోకి 31 ఉపగ్రహాలు

బెంగళూరు : భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) మరో బృహత్కార్యానికి సిద్ధమవుతోంది. ఈ నెల 12న భూ పరిశీలన అంతరిక్ష నౌక కార్టోస్టాట్‌తో సహా మొత్తం 31 ఉపగ్రహాల్ని అంతరిక్షంలోకి ప్రవేశపెట్టనుంది. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఈ ప్రయోగం ఈ నెల 10న జరగాల్సి ఉంది. ఇందులో 28 ఉపగ్రహాలు అమెరికాతో పాటు, ఐదు ఇతర దేశాలకు చెందినవి అని ఇస్రో ప్రజా సంబంధాల డైరెక్టర్ దేవి ప్రసాద్ కర్నిక్ తెలిపారు.ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీహరికోట అంతరిక్ష కేంద్రంలో ఈ నెల 12న ఉదయం 9:30 గంటలకు ఈ ప్రయోగం ప్రారంభవుతుందని ఆయన తెలిపారు. గతేడాది ఆగష్టులో పిఎస్ఎల్‌వి ప్రయోగం విఫలమైన తరువాత ఈ ఏడాదిలో ఇస్రో చేపడుతున్న తొలి అంతరిక్ష కార్యక్రమం ఇదే.

కర్ణాటకలో దళితుల బంద్ విజయవంతం

హుబ్బళ్లి : కర్ణాటకలో దళితులు నిర్వహిస్తున్న బంద్ విజయవంతమయ్యింది. దళితులపై జరుగుతున్న హింసను ఖండిస్తూ పలు దళిత సంఘాలు సోమవారం బంద్‌కు పిలుపునిచ్చాయి. విజయపుర జిల్లాలో దళిత బాలికపై అత్యాచారం జరిపి హత్య చేసినందుకు, కేంద్ర మంత్రి అనంత కుమార్ హెగ్డే రాజ్యాంగ విరుద్ధంగా చేసిన రెచ్చగొట్టే వ్యాఖ్యలు, మహారాష్ట్రలోని భీమ-కొరెగావ్ ఉత్సవాల సందర్భంగా దళితులపై జరిగిన దాడులు, దళిత వ్యతిరేక వ్యాఖ్యలకు నిరసనగా దళిత సంఘాలు బంద్‌కు పిలుపునిచ్చాయి. స్థానికంగా ఉన్న దాదాపు 40 దళిత సంఘాలు ఈ బంద్‌కు మద్దతు ప్రకటించాయి. ప్రధానంగా కర్ణాటకలోని హుబ్బళ్లి-ధర్వాడా ప్రాంతాలలో బంద్ పిలుపుతో పలువురు దళితులు వీధుల్లోకొచ్చారు. టైర్లను తగలబెట్టడమే కాకుండా పలు రహదారుల్ని దిగ్బంధించారు. బస్సులు, ఆటోలు తదితర రవాణా వాహనాలపై బంద్ ప్రభావం బాగా పడింది.

ఉద్యోగుల విభజనపై ఏపి సర్కారుకు సుప్రీం నోటీసులు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి దేశ అత్యున్నత న్యాయస్థానం కోర్టు ధిక్కారణ నోటీసులు జారీ చేసింది. ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలోని షెడ్యూల్ 9,10లోని సంస్థల ఉద్యోగులకు 2014,జూన్ 2 నుండి ప్రభుత్వ ఉద్యోగులతో పాటు 60 సంవత్సరాల పదవీ విరమణను వర్తింపజేయాలని, 60 సంవత్సరాలు నిండని వారిని తిరిగి సర్వీస్‌లోకి తీసుకోవాలని, 60 సంవత్సరాలు నిండిన వారికి 2014, జూన్ 2నుండి జీతభత్యాలు చెల్లించాలని సుప్రీం కోర్టు 2017, జులై 9న తీర్పు నిచ్చింది. సుప్రీం కోర్టు తీర్పును కొన్ని ప్రభుత్వ సంస్థలు అమలుచేయలేదు. అందులో విద్యుత్ సంస్థలు కూడా ఉన్నాయి. ఆ సంస్థ ఉద్యోగులు దాఖలు చేసిన కోర్టు ధిక్కారణ కేసులో సోమవారం నాడు జస్టిస్ కురియన్ జోసెఫ్, జస్టిస్ అమితవ్ రాయ్ నేతృత్వంలోని ద్విసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. కోర్టు ఉత్తర్వుల్ని ఎందుకు అమలు చేయాలేదో నాలుగు వారాల్లోపు సమాధానం చెప్పాలని సంస్థల మేనేజింగ్ డైరెక్టర్లకు, విద్యుత్ శాఖ ముఖ్య కార్యదర్శికి ద్విసభ్య ధర్మాసనం నోటీసులు జారీ చేసింది. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం ఆర్థిక ప్రయోజనాలు ఇవ్వలేదా? అని న్యాయమూర్తులు జోసెఫ్, అమితవ్ రాయ్‌లు ప్రశ్నించారు. అందుకు న్యాయవాదులు స్పందిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయలేదని సమాధానమిచ్చారు. విద్యుత్ శాఖకు సంబంధించి 110 మంది ఉద్యోగులు, రాష్ట్ర గిడ్డంగి సంస్థ, ఆప్కో, ఏపిఐఐసి, ఆగ్రో ఇండస్ట్రీ, ఏపి విత్తనాభివృద్ధి సంస్థ, ఏపి హౌసింగ్ కార్పొరేషన్, సాంప్రదాయేతర ఇంధన సంస్థ(ఎన్ఏడి), పర్యటక అభివృద్ధి సంస్థ ఉద్యోగులు 10 నుంచి 15కు పైబడి పిటిషన్లు దాఖలుచేశారు. సోమవారం విచారణలో వై.రాజగోపాల్ రావు (అడ్వొకేట్ ఆన్ రికార్డ్సు), సీనియర్ న్యాయవాదులు ఆర్. బసంత్, డి.ఆదినారాయణ రావు, థామస్, హైకోర్టు నుంచి న్యాయవాదులు జి.మాళోజీ రావు, విజయకుమార్ రెడ్డి పాల్గొన్నారు. 2017,జులై 9 నాటి సుప్రీం కోర్టు తీర్పును అమలు చేయడంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అధికారులు నిర్లక్ష్యం వహిస్తూ, ఉద్యోగుల్ని వేధింపులకు గురిచేస్తున్నారని, అధికారులు భిన్న వైఖరి కారణంగానే సుప్రీం కోర్టును ఆశ్రయించాల్సి వచ్చిందని విద్యుత్ ఉద్యోగుల సంఘం నేత ఎం. జనార్ధన్‌రెడ్డి తెలిపారు.

జాదవ్ కుటుంబ సభ్యులకు అవమానం

అమెరికాలో పాక్ రాయబార కార్యాలయం ఎదుట నిరసన

వాషింగ్టన్: పాకిస్తాన్ జైలులో ఉన్న భారత నౌకాదళ మాజీ అధికారి కులభూషణ్ జాదవ్ కుటుంబ సభ్యుల పట్ల పాక్ ప్రభుత్వం అనుసరించిన 'అమానవీయ' వైఖరిని నిరసిస్తూ భారత్, ఆఫ్ఘన్, బెలూచిస్తాన్ సంతతి అమెరికన్లు ఇక్కడి పాక్ దౌత్య కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించారు. గడ్డకట్టించే చలిలో అమెరికా రాయబార కార్యాలయం వద్దకు చేరుకున్న ఆందోళనకారులు పాక్ దౌత్యాధికారులకు చెప్పుల్ని బహూకరించే ప్రయత్నం చేశారు. కులభూషణ్‌జాదవ్‌పై పాకిస్తాన్ ప్రభుత్వం సైనిక కోర్టు ద్వారా జరుపుతున్న విచారణలో అంతర్జాతీయ నిబంధనలన్నింటినీ ఉల్లంఘిస్తోందని ఈ నిరసన ప్రదర్శన నిర్వహించిన అమెరికన్ ఫ్రెండ్స్ ఆఫ్ బెలూచిస్తాన్ అనే స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు అహ్మర్ ముష్టిఖాన్ అన్నారు.

పిఎసిఎల్ కేసులో రూ.472 కోట్ల ఆస్తులు ఇడి జప్తు

న్యూఢిల్లీ : పిఎసిఎల్ మనీలాండరింగ్ కేసు దర్యాప్తులో భాగంగా రూ.472 కోట్ల విలువైన ఆస్తుల్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సోమవారం జప్తు చేసింది. పిఎసిఎల్ మోసపూరిత ఆర్థిక పథకాల కేసులో మనీలాండరింగ్ దర్యాప్తుకు సంబంధించి ఆస్ట్రేలియాలో ఉన్న దానితో సహా రూ.472 కోట్లు జప్తు చేసినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. పిఎసిఎల్ గ్రూపునకు చెందిన కంపెనీల డైరెక్టర్లు, అధికారులపై 2015లో సిబిఐ నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ప్రాతిపదికగా ఇడి క్రిమినల్ కేసు నమోదు చేసింది. నిర్మల్ సింగ్ భంగూ నిర్వహించిన పిఎసిఎల్ మోసపూరిత ఆర్థిక పథకాల స్కామ్‌లో ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్ (పిఎంఎల్ఎ) కింద ఆస్తుల్ని జప్తు చేశామని తెలిపారు. మీ రిసార్ట్స్ గ్రూప్ వన్ పార్టీ లిమిటెడ్, ఆస్ట్రేలియాలోని శాంక్చ్యుయరీ కోవ్ ప్రాపర్టీస్‌కుచెందిన ఆస్తుల్ని జప్తు చేసినట్లు అధికారులు తెలిపారు. పిఎసిఎల్ స్కామ్‌ను పలు సంస్థలు దర్యాప్తు చేస్తున్నాయి. రియల్ ఎస్టేట్ ప్రాజెక్టుల పేరుతో మోసపూరిత పెట్టుబడుల సేకరణ పథకాల ద్వారా కోట్లాది రూపాయాల్ని కంపెనీ వసూలు చేసినట్లు మార్కెట్ నియంత్రణ సంస్థ సెబి అంతకుముందు తెలిపింది.

కోడి పందాలపై సుప్రీం కోర్టులో పిటిషన్

న్యూఢిల్లీ బ్యూరో : కోడి పందాలు నిర్వహించొద్దన్న హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ రఘురామ కృష్ణం రాజు సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ బుధవారం విచారణకు వచ్చే అవకాశముంది. తెలుగు ప్రజల సాంప్రదాయానికి కోడిపందాలు చిహ్నమని, కోళ్లను అరెస్టు చేయవద్దని సుప్రీం కోర్టు గతంలో చెప్పినా కోళ్లను, కోళ్లను పెంచేవారిని పోలీసులు అదుపులోకి తీసుకుంటున్నారని పిటిషన్‌లో ఆయన పేర్కొన్నారు.

ప్రత్యేకం

ఉద్దేశపూర్వకంగానే ప్రభుత్వం చేస్తోంది

గోహత్యలు, రైతు ఆత్మహత్యలపై అధ్యయనం

రాజస్థాన్‌లో పర్యటించిన నిజనిర్ధారణ కమిటీ

ఇండియా న్యూస్‌నెట్‌వర్క్, న్యూఢిల్లీ: రాజస్థాన్‌లో ఇటీవలి కాలంలో చోటుచేసుకున్న గోగూండాల హత్యలు, రైతుల ఆత్మహత్యలు ఉద్దేశపూర్వకంగానే జరిగాయని నిజనిర్ధారణ కమిటీ తేల్చింది. అక్కడ జరిగిన సంఘటనల వెనుక వాస్తవాల్ని అధ్యయనం చేసేందుకు భూమి అధికార్ ఆందోళన్‌కు చెందిన నిజనిర్ధారణ కమిటీ ఈ నెల 6,7 తేదీలలో భరత్‌పూర్, అల్వార్, రాజాసముంద్, ఉదయ్‌పూర్‌లలో పర్యటించింది. కేరళకు చెందిన రాజ్యసభ సభ్యుడు, అఖిల భారత కిసాన్‌సభ సంయుక్త కార్యదర్శి కెకె రాగేష్ నేతృత్వంలోని ఈ ప్రతినిధిబృందంలో బెంగాల్‌కు చెందిన లోక్‌సభ సభ్యుడు బద్రుద్దాజా ఖాన్, బీహార్‌కు చెందిన ఎమ్మెల్యే, ఎఐకెఎంఎస్ నేత మెహబూబ్ ఆలమ్, ఎఐకెఎస్ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే అమ్రారామ్, ఎఐకెఎస్ సంయుక్త కార్యదర్శి డాక్టర్ విజూ కృష్ణన్, ఎఐకెఎస్ కోశాధికారి, మాజీ ఎమ్మెల్యే పి కృష్ణప్రసాద్ తదితరులతో పాటు కొంతమంది పాత్రికేయుల బృందం కూడా ఈ పర్యటనలో పాల్గొంది. భరత్‌పూర్ జిల్లా ఘట్మీకా గ్రామంలో గోగూండాల చేతుల్లో బలైపోయిన ఉమ్మర్‌ఖాన్ కుటుంబాన్ని ఈ నిజనిర్ధారణ కమిటీ బృందం సభ్యులు కలిసి వివరాలు సేకరించింది. గోగూండాల చేతుల్లో ప్రాణాలు కోల్పోయిన ఉమ్మర్‌ఖాన్ కుటుంబం పేదరికంలో మగ్గుతోంది. దుఃఖసాగరంలో మునిగిన ఆయన తల్లి, భార్య, పిల్లలకు రాష్ట్రంలోని బిజెపి ప్రభుత్వం నుండి ఎటువంటి మద్దతు కానీ, పరిహారం కానీ అందలేదు. ఆ గ్రామంలో ప్రతి కుటుంబమూ పాడి పరిశ్రమపై ఆధారపడి జీవనం కొనసాగిస్తోందన్న విషయాన్ని తాము గమనించినట్లు బృందం ప్రతినిధులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మేవాట్ ప్రాంతంలో ముస్లిం వర్గానికి చెందిన ప్రజల్ని నేరస్తులుగా చిత్రీకరించేందుకు ప్రణాళికా బద్ధంగా కుట్ర జరుగుతోందన్న విషయం ఆయా గ్రామాల ప్రజలతో మాట్లాడినప్పుడు తమకు అర్థమైయ్యిందని ఈ కమిటీ పేర్కొంది. అల్వార్‌లో రెవిన్యూ, పోలీసు ఉన్నతాధికారులతో మాట్లాడినప్పుడు ఆ ప్రాంతంలో తరచూ జరుగుతున్న పాడి రైతుల హత్యలు తమ దృష్టికొచ్చాయని తెలిపింది. దీంతో పాటు మైనారిటీ వర్గ ప్రజలు తీవ్ర అన్యాయానికి గురవుతున్న విషయాన్ని తాము గుర్తించామని ఆందోళన వ్యక్తం చేసింది. మతపరమైన విభజనతో పాడి రైతులపై గో స్మగ్లర్లంటూ తప్పుడు కేసులు బనాయించి ప్రణాళికా బద్ధంగా వేధింపులకు గురి చేస్తున్నారని పేర్కొంది. అల్వార్ జిల్లా కలెక్టర్, ఎస్పీల వైఖరి గోగూండాలకు కొమ్ము కాసే విధంగా వుందని తెలిపింది. తమ పర్యటన ముందు రోజు మాత్రమే ఉమ్మర్‌ఖాన్ హత్య కేసులో నలుగురు నిందితుల్ని అరెస్ట్ చేశారని, అయితే గోస్మగ్లింగ్ పేరుతో తాహిర్, జావేద్‌లను అరెస్ట్ చేసిన పోలీసులు, ఎటువంటి బెయిలు లేకుండా జైలులోనే వారిని మగ్గపెడుతున్నారని వివరించింది. అల్వార్‌లో బూటకపు ఎన్‌కౌంటర్‌లో మరణించిన తాలిమ్ (22) కుటుంబ సభ్యుల్ని తాము కలిశామని, పాయింట్ బ్లాంక్‌లో తుపాకి పెట్టి అతడిని పోలీసులు కాల్చిచంపిన వైనాన్ని తమకు వివరించారన్నారు. ఈ ఘటన జరిగి రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకూ ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదని పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో గోరక్షకుల పేరుతో పోలీసు ఔట్‌పోస్టులు ఏర్పాటు చేసి పాడి రైతులపై దాడులు కొనసాగిస్తున్నారని తెలిపారు. రాజాసమంద్‌లో చోటుచేసుకున్న అఫ్రాజుల్ కిరాతక హత్యకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయినప్పటికీ ఉన్నతాధికారులు దోషుల్ని అరెస్ట్ చేయలేదన్నారు. లవ్‌జిహాద్ పేరుతో తప్పుడు కథలల్లి ఈ యువకుడిని హత్య చేసేందుకు కుట్ర పన్నిన వారితో అధికారులు కుమ్మక్కయినట్లు తాము గమనించామన్నారు. ఈ ప్రాంతం మత సామరస్యానికి పెట్టని కోట వంటిదని, ఇక్కడ శాంతిని భగ్నం చేసేందుకు ఈ హత్యను ఉద్దేశపూర్వకంగా చేశారని భావిస్తున్నట్లు అధికారులు చెప్పారని నిజ నిర్ధారణ కమిటీ తన ప్రకటనలో వివరించింది. ఉదయ్‌పూర్ తదితర ప్రాంతాలలో సైతం పలువురు బాధితులు తమ దీన పరిస్థితుల్ని వివరించారని తెలిపింది. బిజెపి పాలిత రాజస్తాన్‌లో అధికార యంత్రాంగంపై ప్రజలకు ఏ మాత్రం విశ్వాసం కలగడం లేదని, శాంతి భద్రతల యంత్రాంగం పూర్తిగా కుప్పకూలిపోయిందని కమిటీ అభిప్రాయపడింది. దీంతోపాటు ఇక్కడ ప్రధాన ప్రతిపక్షం బలహీనంగా ఉండడంతో మతోన్మాదుల ఆగడాలకు అడ్డులేకుండా పోతోందని వివరించింది.

ఇరాన్‌లో తగ్గిన నిరసనలు

టెహరాన్ : ప్రభుత్వ వ్యతిరేక నిరసనలు, ఆందోళనల్లో పాల్గొంటున్న నిరుద్యోగ యువత, నిరుపేద కార్మికుల ఆందోళనలు వెనుకపట్టు పట్టాయి. ఈ నిరసనలకు వ్యతిరేకంగా పెద్ద సంఖ్యలో ప్రభుత్వ అనుకూల ప్రదర్శనలు వారం రోజుల పాటు సాగాయి. ఇరాన్‌వ్యాప్తంగా 80కి పైగా నగరాలు, పట్టణాల్లో వేలాదిమంది ప్రజలు వీధుల్లోకొచ్చి అనేక సామాజిక, ఆర్థిక సమస్యలను లేవనెత్తారు. అమెరికా సామ్రాజ్యవాదం, దాని మిత్రపక్షాలు దేశంలో అశాంతిని రెచ్చగొడుతున్నాయని ఇరాన్ ప్రభుత్వం ఆరోపించింది. వెయ్యిమందికి పైగా ఆందోళనకారులను అరెస్టు చేసినట్లు ప్రభుత్వ అధికారులు తెలిపారు. 2009లో అమెరికా, యురోపియన్ సామ్రాజ్యవాద శక్తులు రెచ్చగొట్టిన గ్రీన్ మూవ్‌మెంట్ మాదిరిగానే ఈ నిరసనలు, ఆందోళనలు పెచ్చరిల్లాయని ప్రభుత్వం పేర్కొంది.



స్తంభించిన విమానాలు

న్యూయార్క్‌లో విపరీతంగా మంచు కురుస్తుండటంతో జాన్ యఫ్ కెన్నెడి విమానాశ్రయంలో మంచు పేరుకుపోయి స్తంభించిన విమానాల రాకపోకలు

2023కల్లా అభివృద్ధి చెందిన దేశంగా చైనా

వేగం పుంజుకోనున్న అభివృద్ధి రేటు

బీజింగ్ : 'మధ్య తరగతి ఆదాయపు ఉచ్చు (మిడిల్ ఇన్‌కం ట్రాప్)' నుండి 2023కల్లా చైనా బయటపడగలదని భావిస్తున్నట్లు ప్రభుత్వం ఆదివారం విడుదల చేసిన నివేదికలో పేర్కొంది. అభివృద్ధి చెందడానికి గల అపార అవకాశాలు, సామర్థ్యాన్ని గమనంలోకి తీసుకుంటే ఈ అభిప్రాయం నెలకొందని తెలిపింది. పెకింగ్ యూనివర్శిటీలోని జాతీయ ఆర్థికాభివృద్ధి కేంద్రం ఈ నివేదికను విడుదల చేసింది. ప్రస్తుతం సాగుతున్న సంస్కరణలు, సామాజిక సుస్థిరతను దృష్టిలో ఉంచుకుంటే, భవిష్యత్తులో ఒక మోస్తరు నుండి అధిక వేగంతో కూడిన అభివృద్ధి రేటును చైనా కొనసాగించగలదని ప్రభుత్వం పేర్కొంది.

2017 నుండి 2021 వరకు సగటున చైనా ఆర్థిక వృద్ధి రేటు 6.5శాతానికి చేరుకుంటుందని ఆ నివేదికలో పేర్కొన్నారు. మధ్య, అధిక ఆదాయాల ఆర్థిక వ్యవస్థల్ని విభజించే జిడిపి విలువను 12,500 డాలర్లుగా ప్రపంచబ్యాంక్ నిర్దేశించింది. 2049నాటికి, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో చైనా భాగం 26.9శాతం ఉంటుందని నివేదిక అంచనా వేసింది. దీనికి తోడు, రాబోయే పది నుండి 20ఏళ్ళ కాలంలో వినిమయం అనేది చైనా ఆర్థిక వ్యవస్థకు ప్రధాన దోహదకారి కానుంది.



ఇజ్రాయిల్‌పై ఆంక్షల్ని సమర్థించే సంస్థలుబ్లాక్‌లిస్ట్‌లోకి

జెరూసలేం : తమపై ఆంక్షల్ని సమర్థించే 20 అంతర్జాతీయ సంస్థల్ని ఆదివారం ఇజ్రాయిల్ బ్లాక్‌లిస్ట్‌లో పెట్టింది. ఆ సంస్థల సభ్యులెవరూ ఇజ్రాయిల్‌లో ప్రవేశించకూడదని తెలిపింది. రక్షణ నుండి దాడిలోకి దిగామని ఇజ్రాయిల్ భద్రతా, వ్యూహాత్మక వ్యవహారాల మంత్రి గిలాడ్ ఎర్డాన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆంక్షల్ని సమర్థిస్తున్న సంస్థల సభ్యులెవరూ ఇజ్రాయిల్‌లోకి ప్రవేశించొద్దని, ఒకవేళ ఎవరైనా ప్రవేశిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. బ్లాక్‌లిస్ట్‌లో పెట్టిన సంస్థలు ఇజ్రాయిల్‌ను బహిష్కరించాలంటూ అంతర్జాతీయ గ్రూపులు, సంస్థలపై ఒత్తిడి తెస్తున్నాయని ఎర్డాన్ తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఇజ్రాయిల్‌కు గల చట్టబద్ధతను దెబ్బతీసే లక్ష్యంతో ఈ గ్రూపులు తప్పుడు ప్రచారాన్ని సాగిస్తున్నాయని తెలిపారు. 20 గ్రూపుల్లో 11 యూరప్‌కు చెందినవి కాగా, ఆరు అమెరికాకు చెందినవి. లాటిన్ అమెరికా, దక్షిణాఫ్రికాలకు చెందినవి ఒక్కోటి కాగా మరొకటి అంతర్జాతీయ సంస్థకు చెందినదని పేర్కొన్నారు. చట్టాల్ని దుర్వినియోగం చేసి, తమ దేశాన్ని అప్రతిష్టపాలు చేసేందుకు ప్రయత్నిస్తున్నాయంటూ హోం మంత్రి అరై డెరీ విమర్శించారు.

పాక్ కోసం కొత్త విధానాలు: ట్రంప్

వాషింగ్టన్: పాకిస్తాన్‌తో తమ ప్రభుత్వం ఇప్పటి వరకూ అనుసరిస్తున్న ఫలితాలు సత్ఫలితాలనివ్వలేదని ట్రంప్ ప్రభుత్వం అభిప్రాయపడింది. పాకిస్తాన్ తన భూభాగంలోని ఉగ్రవాద శిబిరాల్ని నిర్మూలించాలన్న తమ సూచనపై ఉపేక్షను సహించడం కన్నా కొత్త విధానాల్ని అమలు చేస్తే ఫలప్రదంగా ఉంటుందని భావిస్తున్నట్లు ట్రంప్ ప్రభుత్వంలోని సీనియర్ అధికారి ఒకరు చెప్పారు. ఉగ్రవాద శిబిరాల్ని కూకటి వేళ్లతో పెకలించి వేయాలంటూ తాము ఎన్నిసార్లు చెప్పినా పాకిస్తాన్ పెడచెవిన పెట్టడం విచారకరమని ఆయన వ్యాఖ్యానించారు. 9/11 దాడుల తరువాత పాకిస్తాన్ పట్ల అమెరికా ప్రభుత్వాలు అనుసరించిన విధానాలేవీ సత్ఫలితాలనివ్వలేదని ఆయన అన్నారు. అటు పాకిస్తాన్‌ను కానీ, ఇటు ఆఫ్ఘనిస్తాన్‌ను కానీ ఉగ్రవాదులకు స్వర్గధామాలుగా మారడాన్ని అనుమతించేందుకు తాము సిద్ధంగా లేమని ఆయన స్పష్టం చేశారు. ఉగ్రవాదులకు స్వర్గధామాలుగా మారుతున్న ఈ ప్రాంతాలు ప్రాంతీయంగా శాంతి, సుస్థిరతలకు తీవ్ర విఘాతాన్ని కలిగిస్తుండడంతో పాటు ప్రపంచం ఎదుర్కొంటున్న



ఉగ్రవాద సమస్యను మరింత జటిలం చేస్తున్నాయన్నారు. 9/11 దాడుల తరువాత అమెరికా ప్రభుత్వాలు పాకిస్తాన్‌తో వ్యూహాత్మక సహనాన్ని ప్రదర్శించటమే కాక ఉగ్రవాద నిర్మూలన పేరిట కెర్రీ-లూగర్-బెర్మన్ బిల్ వంటి వాటి ద్వారా లక్షల కోట్ల డాలర్ల మేర ఆర్థిక సాయం అందించాయని, ఇందులో ఏ ఒక్కటీ పాక్‌ను దారిలోకి తీసుకురాలేకపోయిందని ఆయన అన్నారు.

ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థల దోస్తీ

ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న ప్రభుత్వేతర (స్వచ్ఛంద) సంస్థలకు, ప్రభుత్వానికి మధ్య సన్నిహిత సంబంధాలు కొనసాగుతుండడం వల్లే ఉగ్రవాదులు పాకిస్తాన్‌లో స్వేచ్ఛగా సంచరించగలుగుతున్నారన్నారు. ఉగ్రవాదాన్ని అడ్డుకునేందుకు కొంత భిన్నమైన రీతిలో వ్యవహరించాల్సిన సమయం ఆసన్నమైనట్లు తాము నమ్ముతున్నామని, ఆఫ్ఘనిస్తాన్‌లో శాంతి స్థాపన ప్రక్రియ పురోగతి సాధించాలంటే ముందుగా ఉగ్రవాద శిబిరాల్ని నిర్మూలించాలన్నదే తమ లక్ష్యమన్నారు. ఆఫ్ఘనిస్తాన్‌లో శాంతి, సుస్థిరతల ఏర్పాటుపై అధ్యక్షుడు కృతనిశ్చయంతో ఉన్నారని ఆయన వివరించారు. ఉగ్రవాద నిర్మూలనపై తమ సూచనల్ని పెడచెవిన పెట్టిందన్న ఆగ్రహంతో ట్రంప్ సర్కారు గత వారం దాదాపు 200 కోట్ల డాలర్ల భద్రతా పరమైన సాయాన్ని నిలిపేసిన విషయం తెలిసిందే.

యెమెన్ సంక్షోభానికి పశ్చిమ దేశాలు ఆజ్యం

- సౌదీకి ఆయుధ విక్రయాలతో అదుపుతప్పిన పరిస్థితులు

సానా : యెమెన్‌లో మానవతా సంక్షోభానికి పశ్చిమ దేశాలు ఆజ్యం పోస్తున్నాయి. అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్ వంటి దేశాలు సౌదీకి ఆయుధాల్ని విక్రయించడం ద్వారా యెమెన్‌లో పరిస్థితుల్ని అల్లకల్లోలం చేస్తున్నాయని పేర్కొంటూ అమ్నెస్టీ ఇంటర్నేషనల్ గత మూడేళ్లుగా యెమెన్‌పై సౌదీ జరుపుతున్న బాంబు దాడుల్ని తీవ్రంగా ఖండించింది. ఈ మూడు దేశాలూ తమ సంకీర్ణ కూటమిలోని సభ్య దేశాలకు ఆయుధాల్ని సరఫరా చేస్తున్నాయని, సౌదీ అరేబియా దాని మిత్రపక్షాలు అంతర్జాతీయ చట్టాల్ని నీరుగారుస్తూ, యుద్ధ నేరాలతో సహా తీవ్ర ఉల్లంఘనలకు పాల్పడుతున్నాయని అమ్నెస్టీ పేర్కొంది. ఆయుధాల సరఫరాలను తక్షణమే నిలిపివేసి, యెమెన్‌లో ప్రయోగించేందుకు సౌదీ నేతృత్వంలోని సభ్య దేశాలకు అందించే సైనిక సాయాన్ని ఆపేయాలని ఆయా దేశాల్ని కోరింది. యెమెన్‌పై ఆంక్షల్ని కొనసాగించేందుకు అవసరమైన ఎలాంటి సైనిక పరికరాల్ని అందజేయడం కానీ, మౌలిక సదుపాయాల కల్పనకు అవసరమైన చర్యలు తీసుకోవడం కానీ చేయరాదని పేర్కొంది. బ్రిటన్ ఇప్పటి వరకు సౌదీకి 460కోట్ల డాలర్ల విలువ చేసే ఆయుధాల్ని విక్రయించింది. ఆయుధ సంబంధాల్ని సిగ్గు చేటైన బంధంగా కేంపైన్ అగైనెస్ట్ ఆర్మ్స్ ట్రేడ్ (సిఎఎటి) అభివర్ణించింది. ఫ్రాన్స్ కూడా 900కోట్ల యూరోల విలువైన ఆయుధాల్ని సౌదీకి విక్రయించిందని తెలిపింది. ఇవి 2010-2016 మధ్యకాలంలో ఫ్రాన్స్ వార్షిక ఆయుధ ఎగుమతుల్లో 15-20శాతం వరకు ఉన్నాయి. ఇక అమెరికా అయితే రియాద్‌కు 2017లో దాదాపు 11వేల కోట్ల డాలర్ల విలువ చేసే ఆయుధాల్ని అందచేసింది. 2009-16లో ఒబామా ప్రభుత్వం సౌదీకి 11.5వేల కోట్ల డాలర్ల విలువ చేసే ఆయుధాల్ని అందజేయడానికి ఆమోదం కుదిరింది. యెమెన్‌లో ఘర్షణల సమయంలో ఉద్దేశ్యపూర్వకంగా, విచక్షణారహితంగా, నేరపూరితమైన దృక్పథంలో పౌరుల్ని, ఆస్పత్రులు, స్కూళ్ళు వంటి కట్టడాల్ని లక్ష్యంగా చేసుకుని దాడులు జరుపుతున్నారని, ఈ సమయంలో మౌలిక మానవతావాద నిబంధనల్ని, చట్టాల్ని ఏ మాత్రమూ పట్టించుకోవడం లేదని మానవ హక్కుల పర్యవేక్షణా సంస్థ తన 2017 నివేదికలో ఆందోళన వ్యక్తం చేసింది. మొత్తంగా అంతర్జాతీయంగా మానవ హక్కుల దాడులు జరుగుతున్నాయని, యెమెన్ ఇందుకు ప్రాథమిక ఉదాహరణగా నిలిచిందని పేర్కొంది.

ఫోన్‌లో ట్రంప్, మాక్రాన్ చర్చలు

వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయెల్ మాక్రాన్‌లు కొరియా ద్వీపకల్పం, ఇరాన్ అంశాలపై శనివారం ఫోన్‌లో మాట్లాడుకున్నారని వైట్‌హౌస్ ఆదివారం తెలిపింది. కొరియా ద్వీపకల్పంలో నెలకొన్న పరిస్థితులు, కొరియాను పూర్తిగా అణు నిరాయుధీకరణ చేసే లక్ష్యం తదితర అంశాలపై ట్రంప్, మాక్రాన్‌తో మాట్లాడారని అధికారులు తెలిపారు. ఇరాన్‌లో సాగుతున్న ప్రదర్శనలపై కూడా ఇరువురు నేతలు చర్చించారు. అంతకుముందు ఇరాన్‌లోని ప్రదర్శనలపై ట్రంప్ వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో ఇరాన్ స్పందిస్తూ తమ అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడమేనని పేర్కొంది. ఉత్తర కొరియా నేత కిమ్‌తో చర్చలు జరిపేందుకు సిద్ధంగా ఉన్నానని శనివారం ట్రంప్ పేర్కొన్నారు.



ఇరాన్ ప్రాథమిక పాఠశాలల్లో ఇంగ్లీషు నిషేధం

దుబాయ్ : ప్రాథమిక పాఠశాలల్లో ఇంగ్లీషు బోధనను ఇరాన్ నిషేధించినట్లు సీనియర్ విద్యాశాఖాధికారి తెలిపారు. విద్యాభ్యాసం చేసిన తొలినాళ్ళలోనే ఆంగ్ల భాషను నేర్చుకోవడం వల్ల పశ్చిమ దేశాల సాంస్కృతిక దాడికి ద్వారాలు తెరిచినట్లవుతుందని ఇస్లామిక్ నేతలు హెచ్చరించడంతో ఇరాన్ ఈ చర్య తీసుకుంది. అధికార సిలబస్‌లో భాగంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఆంగ్లాన్ని బోధించడం దేశ చట్టాలకు, నిబంధనలకు విరుద్ధమని ఉన్నత విద్యా మండలి అధినేత మెహిది నవిద్ అదమ్ పేర్కొన్నారు. ప్రాథమిక విద్యలో ఇరాన్ సంస్కృతీ సాంప్రదాయాల గురించి బోధిస్తారని, ఇటువంటి సమయంలో సిలబస్‌లో లేని ఆంగ్లాన్ని బోధించడం వల్ల వాటికి అవరోధమేర్పడుతుందని నవీద్ అదమ్ చెప్పారు. సాధారణంగా 12 నుండి 14 ఏళ్ళ వయస్సులో ఆంగ్ల బోధన ప్రారంభమవుతుంది. కొన్ని ప్రాథమిక పాఠశాలల్లో అంతకన్నా ముందే ఆంగ్లాన్ని బోధిస్తున్నారు. దానిపై తాజాగా నిషేధాన్ని విధించారు. ఈ సాంస్కృతిక దాడి గురించి ఇరాన్ మత పెద్దలు దీర్ఘకాలంగా హెచ్చరిస్తూనే వస్తున్నారు.

మొదటి పేజీ తరువాయి

ఉగ్రవాదులతో బిజెపి దోస్తీ

(ఎన్‌సి) చేసిన ప్రయత్నాలకు బిజెపి, ఆ మాటకొస్తే కేంద్ర మంత్రివర్గం కూడా ప్రోత్సాహాన్ని అందించిందని ఆయన విమర్శించారు. రైల్వే, జాతీయ రహదారిని దిగ్బంధించి జిఎంపి సానుభూతిపరులపై ఐపిఎఫ్‌టి (ఎన్‌సి) దాడులు చేసిందనీ, అనేక చోట్ల సిపిఎం కార్యాలయాలను ధ్వంసం చేసిందనీ కూడా బిజన్ ధర్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. త్రిపురలో రాజకీయ ప్రయోజనాల కోసమే బిజెపి ఇంతలా బరితెగించి ఐపిఎఫ్‌టిని ప్రోత్సహిస్తోందని బిజన్ ధర్ విమర్శించారు. ఎన్‌ఎల్‌ఎఫ్‌టి ఇప్పుడు కూడా బంగ్లాదేశ్ భూభాగంలో శిబిరాలు ఏర్పాటు చేసుకొని హింసకు పాల్పడుతోందని, అలాంటి ఉగ్రవాద సంస్థకు ఇప్పుడు బిజెపితో పొత్తు పెట్టుకున్న ఐపిఎఫ్‌టి బహిరంగంగానే మద్దతు పలుకుతోందని తెలిపారు. ఇప్పటికే చిన్న రాష్ట్రమైన త్రిపురలో రాష్ట్రమంతా ముక్కలుముక్కలుగా వేర్వేరు ప్రాంతాల్లో ఉంటున్న గిరిజనుల కోసం ప్రత్యేకంగా రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలనే డిమాండ్‌తోనే బిజెపితో ఐపిఎఫ్‌టి చేతులు కలిపిందని ఆయన అన్నారు. త్రిపురలో శాంతికాముకులై, సోదరభావంతో కలిసిమెలిసి బతుకుతున్న గిరిజనులు, గిరజనేతరుల మధ్య చిచ్చు రాజేసి ఎన్నికల్లో పబ్బం గడుపుకోవాలనే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఇలాంటి కుట్రలకు పాల్పడుతోందని విమర్శించారు.

కాషాయ గూటికి భౌమిక్ హత్య కేసు నిందితులు

ఐపిఎఫ్‌టి సభ్యులు సుభాష్ రియాంగ్, దేవేంద్ర దేవ్‌వర్మ, రామానంద దేవ్‌వర్మ, పుష్రాయ్ దేవ్‌వర్మ, సునీల్ త్రిపుర ఈ నెల 2న బిజెపిలో చేరారు. వీరిలో రామానంద దేవ్‌వర్మ, పుష్రాయ్ దేవ్ వర్మ ఇద్దరూ కూడా జర్నలిస్టు శంతాను భౌమిక్ హత్య కేసులో నిందితులు. మిగిలిన ముగ్గురు ఐపిఎఫ్‌టి యువజన సంఘం మాజీ నాయకులు.

బెల్లమా.. పాకమా?

నీరుగారుతున్న చంద్రన్న కానుక

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

చంద్రన్న సంక్రాంతి కానుకలో పంపిణీ చేసిన బెల్లం నీరుగారి పోతోంది. గట్టి గడ్డగా ఉండాల్సిన బెల్లం వినియోగానికి వీలుకాని విధంగా జావలా మారింది. సంక్రాంతి కానుక పంపిణీ వ్యవహారంలో ఇప్పటికే పలు ఆరోపణలు వినిపిస్తున్నా అధికారులు మాత్రం పెడచెవిన పెడుతున్నారు. ఫలితంగా నాసి రకం సరుకులు వచ్చేస్తున్నాయి. ఒక తీసుకొంది. వీటిలో 500 గ్రాములు చొప్పున బెల్లం ప్లాస్టిక్ బాక్స్‌తో అందజేసేందుకు చర్యలు తీసుకున్నారు. చాలా చోట్ల 455 గ్రాములే ఆబాక్సులో ఉన్నట్లు ఇటీవలే బహిర్గతమైంది. అందజేసే ఆ బెల్లం కూడా పానకంగా మారింది. ప్రధానంగా కృష్ణా, పశ్చిమగోదావరి, గుంటూరు, నెల్లూరు, విశాఖపట్నం జిల్లాల్లో నాసిరకం సరుకులను లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్నారని ఆరోపణలున్నాయి. రాష్ట్రంలోని దాదాపు అన్ని ప్రాంతాల్లోనూ నీరుగారుతున్న బెల్లమే పంపిణీ అవుతున్నట్లు తెలుస్తోంది. విజయవాడ మొఘల్‌రాజ్‌పురం ప్రాంతంలోని ఒక రేషన్ దుకాణంలో పంపిణీ చేసిన బెల్లం నీరులా మారి కారి పోతోంది. లబ్ధిదారులు ఆ రేషన్ డీలర్‌ను నిలదీయగా ఇందులో తమ తప్పేమీ లేదని, టెండర్‌దారులు సరఫరా చేసిన సరుకులనే తాము పంపిణీ చేస్తున్నామని చెప్పినట్లు లబ్ధిదారులు తెలిపారు. నాణ్యత లేని సరుకులు, తూకాల్లో తేడాలు ఎందుకొస్తున్నాయో కూడా ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. ఈ ఏడాది సరుకులు పంపిణీ చేసేందుకు టెండర్లు వేసే సమయంలోనే అక్రమాలు చోటు చేసుకున్నాయంటున్నారు. కొంత మంది ఉన్నతాధికారులు తమ అనుయాయులకు టెండర్లు దక్కేలా వ్యవహరించారనే ఆరోపణలున్నాయి. సరుకుల ధరలు మార్కెట్ ధర కంటే ఎక్కువకు కోట్ చేసినా టెండర్ వారికే కేటాయించారనే ఆరోపణలూ ఉన్నాయి. సరుకులు కేటాయించే సమయంలో దాదాపు రూ.50 కోట్ల వరకు చేతులు మారినట్లు ఆరోపణలొచ్చినా ఎవరూ నోరు మెదపలేదు. కనీసం కాంట్రాక్టర్లపై ఎలాంటి చర్యలు లేకపోవడం వల్ల ప్రతి ఏడాది ఇలాంటి అవకతవకలే పునరావృతం అవుతున్నాయంటున్నారు. నాణ్యత, తూకాల్లో వ్యత్యాసాలు గుర్తించాల్సిన అధికారులెవ్వరూ వీటిని పట్టించుకోలేదు. కనీసం ఇప్పటికైనా పౌర సరఫరాల అధికారులు సంక్రాంతికి నాణ్యమైన సరుకులు ఇచ్చేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

నేడు రాష్ట్రపతి, ప్రధానితో గవర్నర్ భేటీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలుగు రాష్ట్రాల గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్ మంగళవారం రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ప్రధాని నరేంద్ర మోడీలతో భేటీ కానున్నారు. గవర్నర్ వ్యవస్థలో మార్పుల కోసం కేంద్రం నియమించిన కమిటీకి చైర్మన్‌గా ఉన్న నరసింహన్ తన నివేదికను రాష్ట్రపతికి అందజేయనున్నారు. అనంతరం ప్రధానితో సమావేశమవుతారు.

అమరావతిలో గాయత్రి పరివార్

ఏర్పాటు చేసేందుకు ముందుకొస్తే స్థలం కేటాయింపు

త్వరలో సూర్యారాధన కార్యక్రమం

అశ్వమేధ యజ్ఞంలో సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి-గుంటూరు సిటీ ప్రతినిధి

దక్షిణ భారతదేశం విశ్వ గాయత్రి పరివార్ సంస్థకు కేంద్రాన్ని నూతన రాజధాని అమరావతిలో ఏర్పాటు చేసేందుకు ముందుకొస్తే స్థలాన్ని కేటాయించేందుకు సిద్ధమని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరి సమీపంలోని ఎన్‌ఆర్‌ఐ ఆస్పత్రి ప్రాంగణంలో అఖిల విశ్వ గాయత్రి పరివార్ (శాంతికుంజ్ హరిద్వార్) ఆధ్వర్యంలో మూడ్రోజులుగా నిర్వహిస్తున్న 'అశ్వమేధ గాయత్రి మహాయజ్ఞం' ముగింపులో సిఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యజ్ఞఫలాలు పేదలకు అందాలని ఆకాంక్షించారు. తాను త్వరలో హరిద్వార్‌లోని విశ్వ గాయత్రి పరివార్‌కు చెందిన శాంతికుంజ్‌ను సందర్శిస్తానని యజ్ఞకర్త చిన్మయ్ పాండ్యతో చెప్పారు. అశ్వం చలనానికి, వేగానికి చిహ్నమని, మేధ అంటే జ్ఞానమని, సహనానికి, జ్ఞానానికి చిహ్నం శక్తి అని వివరించారు. అమరావతితోపాటు రాష్ట్రానికి, ప్రజా సంక్షేమానికి యజ్ఞ, యాగాదులు చేయాల్సిన అవసరం ఉందన్నారు. దేశ వ్యాప్తంగా ఇప్పటివరకు గాయత్రి పరివార్ ఆధ్వర్యంలో 42 యజ్ఞాలు నిర్వహించగా రాష్ట్రంలో నిర్వహిస్తున్నది 43వ యజ్ఞమని చెప్పారు. ఏరువాక, జలసిరికి హారతి, వన మహోత్సవం, సూర్యారాధన అనే నాలుగు మహత్తర కార్యక్రమాలను తమ ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. వ్యవసాయం, అనుబంధ రంగాల రైతుల సంక్షేమానికి "ఏరువాక", నీటి సంరక్షణ కోసం 'జలసిరికి హారతి'ని చేపట్టినట్లు వివరించారు. గోదావరి పుష్కరాల సందర్భంగా అఖండ హారతిని, కృష్ణా పుష్కరాల సందర్భంగా పవిత్ర హారతిని ప్రారంభించామని, ఇవి నిరంతరం కొనసాగుతాయని తెలిపారు. ప్రకృతిలో భాగస్వాములు కావాల్సిన అవసరాన్ని తెలిపేందుకు 'వన మహోత్సవం' పేరుతో కార్తీకమాసంలో ప్రతిఏటా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, సూర్యుడు మానవాళి మనుగడకు, ప్రకృతి పరిరక్షణకు అన్నీ ఇస్తున్న దృష్ట్యా సోలార్ విధానం ద్వారా వాటిని కాపాడుకునేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని వెల్లడించారు. త్వరలోనే 'సూర్యారాధన' అనే కార్యక్రమానికి శ్రీకారం చుడతామని ప్రకటించారు. కార్యక్రమంలో మంత్రులు పత్తిపాటి పుల్లారావు, నక్కా ఆనందబాబు, జిల్లా కలెక్టర్ కోన శశిధర్, అర్బన్ ఎస్‌పి సిహెచ్ విజయరావు, గాయత్రి పరివార్ దక్షిణ భారత సమన్వయి కర్త అశ్విని సుబ్బారావు పాల్గొన్నారు.



సిఎం చంద్రబాబుకు జ్ఞాపికను అందిస్తున్న యజ్ఞ కర్త చిన్మయ్ పాండ్య

మద్యం సేవించి వాహనాలు నడపొద్దు

యాంకర్ ప్రదీప్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మద్యం సేవించి వాహనాలు నడపవద్దని యాంకర్ ప్రదీప్ యువతకు సూచించారు. మద్యం ఆరోగ్యానికి హానికరమని స్పష్టం చేశారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో డిసెంబర్ 31 రాత్రి పట్టుబడ్డ ప్రదీప్ సోమవారం మధ్యాహ్నం గోషామహల్ ట్రాఫిక్ పోలీసు శిక్షణ కేంద్రంలో ఏర్పాటు చేసిన కౌన్సెలింగ్‌కు తన తండ్రితో కలిసి హాజరయ్యారు

గుండు హనుమంతరావుకు టి సర్కారు సాయం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న హాస్యనటుడు గుండు హనుమంతరావును తెలంగాణ ప్రభుత్వం ఆదుకుంది. జూబ్లిహిల్స్ అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అతని గురించి తెలుసుకున్న ప్రభుత్వం రూ.5లక్షల ఆర్థిక సహాయం ప్రకటించింది. ఈమేరకు సిఎం కెసిఆర్ కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి లెటర్ ఆఫ్ క్రెడిట్‌ను ఆస్పత్రి యాజమాన్యానికి పంపించారు. ఈవిషయాన్ని మంత్రి కెటిఆర్ సోమవారం ట్విట్టర్ ద్వారా తెలిపారు.

ఏప్రిల్ 22 నుంచి ఎంసెట్

సీట్లుంటే 84,478 సీట్లు భర్తీ అయ్యాయని, 52,250 సీట్లు ఖాళీగా ఉండిపోయాయని వివరించారు. సరైన సమయంలో పరీక్షలు నిర్వహించి విద్యార్థులు ఇతర రాష్ట్రాలకు వెళ్లిపోకుండా చర్యలు తీసుకున్నామన్నారు. అన్ని యూనివర్సిటీల్లో అధ్యాపకుల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు ఇచ్చారని, అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకాన్ని ఎపిపిఎస్‌సికి అప్పగించామని తెలిపారు.

విశాఖలోని స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను యూనివర్సిటీగా మార్చుకోవాలని కేంద్ర పెట్రోలియం శాఖా మంత్రి సూచించారని, సిఎంతో చర్చించి దీనిపై నిర్ణయం తీసుకుంటామని అన్నారు. నాణ్యమైన విద్యనందించేందుకు ఉత్తమ ఉపాధ్యాయులు అవసరమని, అందు కోసం టీచర్ ఎడ్యుకేషన్ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని యోచిస్తున్నామని, ప్రస్తుతం ఆ విధానం తమిళనాడులో మాత్రమే ఉందని వివరించారు. ఇంటర్‌లో 40 శాతం మార్కులున్నా టెట్‌కు అర్హత కల్పించే అంశాన్ని పరిశీలిస్తున్నామన్నారు. నాక్ ఎ గ్రేడ్ కలిగిన కళాశాలల్లో ఈ ఏడాది నుంచి డిగ్రీతో పాటు బిఎడ్ విద్యను అందించేలా నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ టీచర్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్‌ను ప్రారంభిస్తున్నామన్నారు. నూరు శాతం నాణ్యమైన విద్యను అందించేందుకు నిబంధనలను తీసుకొస్తున్నామని తెలిపారు.

వివిధ సెట్ల షెడ్యూల్..

సెట్ పేరు	పరీక్ష తేదీ	పరీక్ష సమయం	నిర్వహించే యూనివర్సిటీ	కన్వీనర్
ఎపి ఎడ్‌సెట్	ఏప్రిల్ 19	11 నుంచి 1.00	ఎస్వీ యూనివర్సిటీ, తిరుపతిటి	కుమారస్వామి
ఎపి లాసెట్	ఏప్రిల్ 19	3.00 నుంచి 4.30	ఎస్‌కె యూనివర్సిటీ, అనంతపురం	జ్యోతి విజయ కుమార్
ఎపి ఎంసెట్ (ఇంజనీరింగ్)	ఏప్రెల్ 22 నుంచి 25	9 నుంచి 12, 2.30 నుంచి 4.00	జెఎన్‌టియు, కాకినాడసిహెచ్	సాయిబాబు
ఎపిఎంసెట్ (బైపిసి)	ఏప్రిల్ 26	9 నుంచి 12,	జెఎన్‌టియు, కాకినాడసిహెచ్ 2.30 నుంచి 4.00	సాయిబాబు
ఎపి ఐసెట్	మే 2	10.30 నుంచి 12.30, 2.30 నుంచి 05.00	ఎస్వీ యూనివర్సిటీ, తిరుపతి	బి సుధీర్
ఎపి ఇసెట్	మే 3	10 నుంచి 1	జెఎన్‌టియు, అనంతపురం	పిఆర్ భానుమూర్తి
ఎపి పిఇసెట్	మే 4	9 గంటలకు	ఆచార్య నాగార్జున యూనివర్సిటీ, గుంటూరు	పిఎస్ఎస్ పాల్ కుమార్
ఎపి పిజిఇసెట్	మే 10 నుంచి 12	10 నుంచి 12, 2 నుంచి 4	ఆంధ్రా యూనివర్సిటీ, విశాఖపట్నం	పిఎస్ అవధాని

సాగులో నూతన విధానాలు

మొదటి పేజీ తరువాయి

సోమవారం జరిగిన జన్మభూమి సభలో 'వ్యవసాయం, అనుబంధ రం గాల అభివృద్ధి' అనే అంశంపై ఆయన ప్రసంగించారు. ప్రపంచంలో మారుతున్న ఆహారపు అలవాట్లకు అనుగు ణంగా వ్యవసాయం, అను బంధ రంగాలు అభివృద్ధి చెందాల్సి ఉంద న్నారు. రాష్ట్రంలో రెండు కోట్ల ఎకరాల సాగుభూమి ఉండగా కోటి ఎకరాల్లో ఉద్యాన పంటలు పండించాలని అన్నారు. ప్రస్తుతం 45 లక్షల ఎకరాల్లోనే సాగవుతున్నాయన్నారు. మిరియాలు, వక్కలు, కోకో, పామాయిల్, కొబ్బరి వంటి పంటలను మరింతగా సాగు చేయాలన్నారు. కరెంటు ఛార్జీలు పెంచబోమని, కుదిరితే తగ్గిస్తామని చెప్పారు. వ్యవసాయ శాస్త్రవేత్తలతో కలిసి అందరూ పనిచేయాల్సి ఉందన్నారు. ఇటీవల పాలేకర్ శిక్షణా కార్యక్రమాలకు సంబంధించి కొన్ని అపోహలు వచ్చాయని, వాటిని పట్టించుకోవాల్సిన అవసరం లేదని అన్నారు. కౌలుదారులకు రుణాలు ఇప్పించడంలో కొంత సఫలీకృతమయ్యామని అన్నారు. చేపల పెంపకంలో కాలుష్యాన్ని అరికట్టాలని, కాల్వలను కలుషితం చేయడం తగదని అన్నారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం పూర్తి చేస్తామన్నారు. రేషన్ కార్డుల కోసం, పింఛన్ల కోసం కుటుంబ సభ్యులు విడిపోవడం మంచిది కాదని, ఉమ్మడి కుటుంబాలుగా కలిసి ఉండాలని అన్నారు. సింగపూర్ మాదిరిగా తల్లిదండ్రులతో కలిసి ఉండే వారికి అదనపు సౌకర్యాలు కల్పించే ఆలోచన చేస్తున్నామన్నారు.

సభకు 200 మంది ఎన్‌ఆర్‌ఐలు

ఈ జన్మభూమి సభకు 200 మంది ఎన్‌ఆర్‌ఐలు వచ్చి గ్రామీణ ప్రాంతాల్లో తాము చేసిన సేవలను వివరించారు. ఎస్‌టి, బిసి, కాపు రుణాల చెక్కులను ముఖ్యమంత్రి లబ్ధిదారులకు అందజేశారు. అగ్రికల్చర్ బుక్‌లెట్‌ను సిఎం ఆవిష్కరించారు. గోదావరిపై పోదూరు మండలానికి చెందిన ఏడో తరగతి విద్యార్థిని ఖండవల్లి శ్రీవల్లి పాడిన పాటకు సిఎం ముగ్ధులయ్యారు. తల్లిదండ్రులు లేని ఆ పాపకు, ఆమె తమ్ముడికి చెరో రూ.50 వేలు బ్యాంక్‌లో డిపాజిట్ చేస్తామని, రెసిడెన్షియల్ స్కూల్లో చదివించే ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మంత్రులు దేవినేని ఉమ, పితాని సత్యనారాయణ, జవహర్, ఎంపీలు మాగంటి బాబు, మురళీమోహన్, తోట సీతారామలక్ష్మి, పలువురు ఎంఎల్‌ఎలు పాల్గొన్నారు.

సాంకేతిక విషయాల్లో తలదూర్చబోను : సిఎం

పోలవరం ప్రాజెక్టు కమిటీ.. ఢిల్లీలో లోయర్ కాఫర్‌డ్యామ్, అప్పర్ కాఫర్ డ్యామ్ అవసరమా అనే విషయంపై డిజైనింగ్ కమిటీ, ప్రాజెక్టు అథారిటీ కలిసి సమావేశమవుతాయని, సాంకేతిక విషయాల్లో తాను తలదూర్చబోనని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. సోమవారం పోలవరం ప్రాజెక్టు పనుల పరిశీలన సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ డ్యామ్, డయాఫ్రమ్ వాల్ పనులు 62 శాతం పూర్తయ్యాయన్నారు. 870 మీటర్ల కాంక్రీటు పని పూర్తయిందని, 1,425 మీటర్ల పని పూర్తి కావాల్సి ఉందని చెప్పారు. రాబోయే మే, జూన్ నాటికి డయాఫ్రమ్ వాల్ పనులు పూర్తవుతాయన్నారు. స్పిల్ ఛానల్స్ కాంక్రీటు పనులు ఫిబ్రవరిలో ప్రారంభిస్తామన్నారు. కాఫర్ డ్యామ్ పనులు ఇప్పటికే పూర్తయ్యి ఉంటే గ్రావిటీ ద్వారా నీరందించే వారమన్నారు. వైకుంఠపురం వద్ద కృష్ణానదిపై బ్యారేజీ నిర్మిస్తామని, గ్రావిటీ ద్వారా కృష్ణా, గోదావరి నదులను పెన్నానదికి అనుసంధానం చేస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి సోమవారం ఉదయం 11.40 నిమిషాలకు హెలీకాప్టర్లో పోలవరం హిల్‌వ్యూ ప్రాంతానికి చేరుకుని, ప్రాజెక్టు పనులను పరిశీలించారు.



అనుష్క

ఇదేమైనా పశువుల దొడ్డా? 'భాగమతి' అడ్డా

అనుష్క టైటిల్ పాత్రలో పోషిస్తుందంటే ఆ చిత్రంపై భారీ అంచనాలే ఉంటాయి. అందులోనూ 'బాహుబలి' తర్వాత చేస్తున్న చిత్రం కావడంతో మరింత క్రేజీని పెంచుతుంది. అరుంధతి, రుద్రమదేవి, బాహుబలి తర్వాత ఆమె చేస్తున్న హారర్ చిత్రం 'భాగమతి'. సోమవారం ఈ చిత్రం టీజర్‌ను చిత్రబృంద విడుదల చేసింది. 'ఎవడు పడితే వాడు రావడానికి.. ఎప్పుడు పడితే అప్పుడు పోవడానికి ఇదేమైనా పశువుల దొడ్డా? 'భాగమతి' అడ్డా.. లెక్కలు తేలాలి.. ఒక్కడ్నీ పోనివ్వను' అంటూ చివర్లో అనుష్క చెప్పే డైలాగ్ మొత్తం ట్రైలర్‌కే హైలైట్‌గా నిలిచింది. అనుష్క వేషధారణ కూడా చాలా విభిన్నంగా ఉంది. ఆద్యంతం ఆసక్తికరంగా ట్రైలర్‌ను రూపొందించారు. ఇందులో అనుష్క ద్విపాత్రాభినయం చేస్తుంది. అంతే కాదు ట్రైలర్‌లో చూపించిన 'భాగమతి'లో రెండో పాత్రకు తగ్గట్టు 'భగ.. భగ.. భగ.. భాగమతి' అంటూ వచ్చే నేపథ్య సంగీతం బాగుంది. అనుష్కను ఓ కేసులో భాగంగా జైలుకు తరలించినట్లు చూపించారు. ఆ తర్వాత ఆమెను ఓ పాడుబడ్డ బంగ్లాలో వదిలేస్తారు. ఈ క్రమంలో అనుష్కకు ఏమైంది అనే కథాంశంతో సినిమాను తెరకెక్కించినట్లు ఈ ట్రైలర్‌ను బట్టి అర్థమవుతుంది. ఈ చిత్రానికి అశోక్ దర్శకత్వం వహించారు. ఉన్ని ముకుందన్, ఆది పినిశెట్టి, ఆశా శరత్ 'భాగమతి'లో ప్రధాన పాత్రలు పోషించారు. యూవీ క్రియేషన్స్ సంస్థ నిర్మిస్తోంది. తమన్ స్వరాలు అందిస్తున్నారు. ఈ చిత్రాన్ని గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 26న విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ " ఈ చిత్రం ట్రైలర్‌కు ట్రెమండస్ రెస్పాన్స్ వస్తోంది. ఈ ట్రైలర్‌తో అంచనాలు తార స్థాయికి చేరాయి. ఈ చిత్రం కథ చక్కగా కుదిరింది. అందుకు తగ్గట్టుగానే దర్శకుడు అశోక్ అద్భుతంగా తెరకెక్కించాడు. కథకు తగ్గట్టుగా భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాం. తమన్ అందించిన పాటలు, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ ప్రతీ సన్నివేశాన్ని హైలైట్ చేసేదిగా ఉంటుంది. భాగమతి కథ, కథనం తెలుగు ప్రేక్షకుల్ని తప్పకుండా ఎంటర్ టైన్ చేస్తుంద'ని అన్నారు.



'నా..నువ్వే'లో తమన్నా, కల్యాణ్ రామ్

లవ్..లవ్..లవ్...

నందమూరి కల్యాణ్ రామ్ కథానాయకుడిగా చేస్తున్న సినిమాకి 'నా..నువ్వే' అనే టైటిల్‌ని సోమవారం చిత్ర బృందం అధికారికంగా ప్రకటిస్తూ...టీజర్‌ను విడుదల చేసింది. ఇందులో తమన్నా కథానాయిక. 'లవ్..లవ్..లవ్..ఈరోజంతా మనం దీని గురించే మాట్లాడుకుందాం' అని తమన్నా చెప్తున్న డైలాగ్, 'ప్రేమికా..మనసుపై స్వారీ చేసెయ్' అంటూ కల్యాణ్ రామ్ బాధగా పాడుతున్న పాట టీజర్‌లో హైలైట్‌గా నిలిచాయి. ఇందులో కల్యాణ్ రామ్ వరుణ్ పాత్రలో, తమన్నా మీరా అనే ఆర్జే పాత్రల్లో నటిస్తున్నారు. యాడ్ ఫిలిం మేకర్ జయేంద్ర దర్శకత్వంలో రూపొందుతోందీ చిత్రం. కూల్ బ్రీజ్ సినిమాస్ నిర్మాణంలో ఈస్ట్‌కోస్ట్ ప్రొడక్షన్స్ సమర్పణలో ఈ చిత్రం షూటింగ్ జరుపుకుంటోంది. పి.సి.శ్రీరామ్ ఛాయాగ్రహణాన్ని అందిస్తున్నారు. ఒక టోటల్ ఫ్రెష్‌లుక్‌లో కల్యాణ్ రామ్ ఈ చిత్రంలో కనిపిస్తారు. షరెత్ సంగీతాన్ని అందిస్తున్నారు. "ఈ నెలాఖరుకి దాదాపుగా షూటింగ్ పూర్తవుతుంది. నూతన కాన్సెప్ట్‌తో, ఫ్రెష్‌లుక్‌తో ఈ చిత్రాన్ని దర్శకులు జయేంద్ర తీర్చిదిద్దుతున్నారు" అని నిర్మాతల్లో ఒకరైన కిరణ్ ముప్పవరపు తెలిపారు. "పి. సి. శ్రీరామ్, జయేంద్ర వంటి క్వాలిటీ టెక్నికల్ టీంతో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాం. కల్యాణ్ రామ్‌కి ఈ చిత్రం ఒక టోటల్ మేకోవర్ ఇస్తుంది అని నమ్ముతున్నాం. వేసవి సెలవుల్లో చిత్రాన్ని విడుదల చేయడానికి సిద్ధపడుతున్నాం" అని సమర్పకులు మహేష్ కోనేరు తెలిపారు. 'నా..నువ్వే'తో పాటు కల్యాణ్‌రామ్ 'ఎంఎల్ఏ' చేస్తున్నాడు. తేజ దర్శకత్వం వహిస్తున్నారు. కాజల్ అగర్వాల్ కథానాయికగా నటిస్తుంది.

ఒపేరాకు 'గోల్డెన్ గ్లోబ్'



ఒపేరా విన్‌ప్రే

హాలీవుడ్‌లో సినిమా, టీవీ తారలకు అందజేసే ప్రముఖ పురస్కారాల్లో ఒకటైన గోల్డెన్ గ్లోబ్ అవార్డును మొదటిసారిగా నల్ల జాతీయరాలు, బాల్యంలో లైంగిక వేధింపులకు గురైన ప్రముఖ టీవీ వ్యాఖ్యాత, స్టార్ ఒపేరా విన్‌ఫ్రేకు దక్కడం విశేషం. అసలు నల్లజాతీయులకు అవార్డులు రావడమే గగనమైపోతున్న ఈ తరుణంలో మహిళకు, అందులోనూ లైంగిక వేధింపులకు గురైన వ్యక్తి, డోనాల్డ్ ట్రంప్‌కు వ్యతిరేకంగా మాట్లాడిన తారకు పురస్కారం రావడం ప్రత్యేకతే. ఈ అవార్డు అందుకున్న మొదటి నల్ల జాతీయురాలు కూడా ఈమే. ఎప్పుడో 1962లో మొదటిసారిగా నల్లజాతీయుడు సిడ్నీ పొయిటెయిర్‌కు ఇచ్చారు. తర్వాత సీసియెల్ బి డీ మిలే అవార్డును 1982లో ఇచ్చారు. ఇప్పుడు మళ్లీ సీసియెల్ బి డీ మిలే అవార్డు ఒపేరా విన్‌ఫ్రేకు అందించారు. జర్మనీలో పెరిగిపోతున్న హింసపై వచ్చిన సినిమా 'ఇన్ ద ఫేడ్'కు విదేశీ చిత్ర విభాగంలో ఉత్తమ అవార్డును పొందడం. ఇదొక విశేషం. 75వ గోల్డెన్ గ్లోబ్ అవార్డులను ఆదివారం రాత్రి అందజేశారు. ఈ పురస్కారాలను హాలీవుడ్ ఫారెన్ ప్రెస్ అసోసియేషన్ ఏటా అందిస్తుంది. ఈ ఏడాది ఉత్తమ మోషన్ చిత్రంగా 'త్రి బిల్ బోర్డర్స్ అవుట్‌సైడ్ ఇబ్బంగ్, మిసోరి' నిలిచిందీ చిత్రం. అంతేకాదు దీంతో పాటు మరో మూడు పురస్కారాలను తన ఖాతాలో వేసుకుంది. 'డార్కెస్ట్ హౌస్'లో తన నటనకు గాను ఉత్తమ నటుడి అవార్డును కైవశం చేసుకున్నాడు గార్య్ ఓల్డ్‌మేన్. త్రి బిల్ బోర్డర్స్ అవుట్‌సైడ్ ఇబ్బంగ్, మిసోరి'లో చేసిన ఫ్రాన్సెస్ మైక్‌డొర్మాండ్ ఉత్తమ నటిగా నిలిచింది. 'లేడీ బర్డ్' చిత్రం ఉత్తమ హాస్య చిత్రంగా అవార్డును అందుకుంది. గుల్లెర్మో డెల్ టోరో ఉత్తమ దర్శకుడుగా (ది షేప్ ఆఫ్ వాటర్) గోల్డెన్ గ్లోబ్ అందుకున్నారు. ఉత్తమ యానిమేటెడ్ చిత్రంగా 'కోకో'కు వరించింది. వీటితో పాటు టీవీ విభాగంలో నటులకు అవార్డులను అందించారు.



గార్య్ ఓల్డ్‌మేన్



ఉత్తమ చిత్రం 'త్రి బిల్ బోర్డర్స్ అవుట్‌సైడ్ ఇబ్బంగ్, మిసోరి'

గణతంత్ర దినోత్సవానికి ముందే...



'పద్మావత్' చిత్రంలో సాహిద్ కపూర్, దీపికా పదుకొనే

దీపికా పదుకొనే టైటిల్ రోల్ చేసిన 'పద్మావత్' చిత్రం ఈనెల 25న విడుదల చేసేందుకు చిత్రబృందం నిర్ణయించింది. ఈ విషయాన్ని ఆదివారం ప్రకటించింది. సంజయ్ లీలా భన్సాలీ దర్శకత్వం వహించిన ఈ చిత్రం రణవీర్ సింగ్, సాహిద్ కపూర్ ముఖ్య పాత్రల్లో నటించారు. డిసెంబర్ ఒకటో తేదీన ఈ సినిమా విడుదల కావాల్సి ఉంది. కానీ రాజ్ పుత్ కర్ణిసేన, కొందరు రాజకీయ ప్రయోజనాల కోసం దీన్ని అడ్డుకున్నారు. చివరకు స్పెషన్ బెంచ్ ముందు ఈ చిత్రాన్ని ప్రదర్శించారు. ఈ చిత్రం టైటిల్‌ను 'పద్మావతి'ని 'పద్మావత్'గా మార్చడం మరో ఐదు మార్పులతో యు/ఏ సర్టిఫికేట్‌ను ఇచ్చింది ఆ బెంచ్. గణతంత్ర దినోత్సవానికి ఒక రోజు ముందుగా ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. అయితే అక్షయ్ కుమార్ చేసిన 'ప్యాడ్‌మేన్', సిద్ధార్థ్ మల్హోత్రా చిత్రం 'అయ్యారీ' అదే రోజు విడుదలవుతున్నాయి.

'మనసున్న అందరికీ నచ్చుతుంది'



రమేష్ గోపీ, ఎస్.వి. ప్రకాష్, తరుణ్ తదితరులు

తరుణ్, ఓవియా హీరో హీరోయిన్లుగా రూపొందుతోన్న చిత్రం 'ఇది నా లవ్‌స్టోరీ'. రమేష్ గోపీ దర్శకుడు. రామ్ ఎంటర్‌టైనర్స్ పతాకంపై ఎస్.వి.ప్రకాష్ నిర్మిస్తున్నారు. సోమవారం తరుణ్ పుట్టినరోజు సందర్భంగా ట్రైలర్‌ను హైదరాబాద్ ప్రసాద్‌ల్యాబ్స్‌లో విడుదల చేశారు. చిత్ర నిర్మాత ఎస్.వి.ప్రకాష్ మాట్లాడుతూ " ఈ సినిమా కోసం వర్క్ చేసిన నటీనటులు, సాంకేతిక నిపుణుల కారణంగా సినిమా చాలా బాగా వచ్చింది. ఫిబ్రవరి 14న సినిమాను విడుదల చేస్తున్నాం" అని అన్నారు.

డైరెక్టర్ రమేష్ మాట్లాడుతూ 'మనసున్న మనుషులందరికీ ఫిబ్రవరి 14న విడుదలయ్యే ఈ సినిమా తప్పకుండా నచ్చుతుంది. తరుణ్ గత హిట్ చిత్రాలు 'నువ్వే కావాలి', 'నువ్వే నువ్వే' కంటే ఈ సినిమా పెద్ద హిట్ అవుతుంది. తెలుగు సినిమాల్లో ఇదొక డిఫరెంట్ లవ్‌స్టోరీ. సినిమాపై పూర్తి నమ్మకంతో ఉన్నాం. లవర్స్‌కు మంచి ట్రీట్ అవుతుందని గర్వంగా చెప్పగలను" అని పేర్కొన్నారు.

హీరో తరుణ్ మాట్లాడుతూ 'టీజర్ పెద్ద హిట్ అయ్యింది. ఇప్పుడు ట్రైలర్ కూడా ప్రేక్షకులను మెప్పిస్తుంది. రెగ్యులర్ ప్రేమకథ కాదు. ఇందులో మూడు గెటప్స్‌లో నేను కనపడి ఉంటాను. మరి ఇందులో ట్రిపుల్ రోల్ చేశానా? లేదా మూడు షేడ్స్ ఉన్న పాత్ర చేశానా? అనేది తెలియాలంటే సినిమా చూడాల్సిందే. డైలాగ్స్, స్క్రీన్‌ప్లే, సినిమాటోగ్రఫీ, మంచి మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ఇలా అన్ని చక్కగా అమరాయి. హీరోయిన్ ఓవియా చాలా చక్కగా నటించింది. ఈ సినిమాలో ఎక్కువ పాత్రలు కూడా కనపడవు. ఓవియాతో కలిసి నటించడాన్ని ఎంజాయ్ చేశాను. గోగినేని బాలకృష్ణ ఈ సినిమాను తెలుగు రాష్ట్రాల్లో విడుదల చేస్తున్నారు. అలాగే ట్రెండీ మూవీస్ సంస్థ సినిమాను యు.ఎస్‌లో విడుదల చేస్తుంది" అని అన్నారు.

ఒకరు కాదు... ఇద్దరు..!





సాయి పల్లవి, రకుల్ ప్రీత్‌సింగ్

ఈ మధ్య కథానాయిక రకుల్ ప్రీత్‌సింగ్‌కు అవకాశాలు వచ్చినట్టే వచ్చి చేజారిపోతున్నాయని సామాజిక మాధ్యమాల్లో విపరీతంగా ప్రచారం జరిగింది. అందులో సూర్య హీరోగా చేసే సినిమా అవకాశం కూడా అలాగే చేజారిపోయిందని అనుకున్నారు. 'ఖాకి'లో ఆమె నటనకు మెచ్చుకుని సూర్య సెల్వరాఘవన్ దర్శకత్వంలో చేసే చిత్రంలో హీరోయిన్‌గా తీసుకున్నారని ఆమె స్వయంగా చెప్పింది. కానీ ఈ సినిమా షూటింగ్ ప్రారంభం రోజు రకుల్‌కు బదులు సాయి పల్లవి హాజరుకావడంతో కొత్త ప్రచారం మొదలైంది. రకుల్‌కు బదులు సాయిపల్లవి చిత్రబృందం హీరోయిన్‌గా తీసుకుందని పుకార్లు మొదలుపెట్టారు. అసలు విషయం ఏమిటంటే ఈ సినిమాలో ఇద్దరు హీరోయిన్లు చేస్తున్నారని ఫైనల్ చిత్రబృందం నిర్ధరించింది. ఇందులో ఇద్దరు కథానాయికలను ఎంచుకోవడంతో ముక్కోణపు ప్రేమ కథగా ఉంటుందని అభిమానులు భావిస్తున్నారు. సంక్రాంతి సెలవుల తర్వాత నుంచి ఈ సినిమా చిత్రీకరణ జరగనుంది. ఈ చిత్రానికి యువన్ శంకర్‌రాజా సంగీతం సమకూరుస్తున్నారు.



కత్రినా కైఫ్

ఈ రెండేళ్లు కష్టంగా గడిచాయి

వరుస ఫ్లాప్స్ తర్వాత భారీ విజయం వచ్చి చేరింది కత్రినా కైఫ్ ఖాతాలో. అందుకే ఆమె ఫుల్ జోష్‌లో ఉంది. ఆమె హీరోయిన్‌గా నటించిన 'పితూర్', 'బార్ బార్ దేకో', 'జగ్గా జాసూస్' ఈ మూడు సినిమాలు వరుసగా బాక్సాఫీస్ వద్ద బోల్తా కొట్టాయి. తాజాగా సల్మాన్ ఖాన్‌తో చేసిన 'టైగర్ జిందా హై' మంచి విజయం అందుకుంది. ఏకంగా మూడు కోట్ల కలెక్ట్ చేసింది. ఈ సందర్భంగా ఈమె మాట్లాడుతూ "బార్ బార్ దేకో' సినిమా కాన్సెప్ట్‌ను ప్రేమించి నటించాను. ఇదొక అద్భుతమైన కథ. మంచి చిత్రాలు కూడా కొన్నిసార్లు ఎందుకు ఆడవో నాకర్థం కావడం లేదు. 'జగ్గా జాసూస్' అనేది ఓ మహాకావ్యంలా ఉంటుంది. ఆ చిత్ర దర్శకుడు అనురాగ్ బసు ఓ గొప్ప విజన్ ఉన్న వ్యక్తి. అందుకే ఆ సినిమా అంత గొప్పగా తీశారు. కానీ ప్రేక్షకులు ఆదరించలేదు. ఇప్పుడు చేసిన 'టైగర్ జిందా హై' ఇంత హిట్ అవుతుందని అనుకోలేదు. మామూలుగా కాదు ఓ పెద్ద బాంబ్‌లా పేలింది.గతంలో చాలా అభద్రతా భావంతో ఉండేదాన్ని. దానికి చాలా కారణలే ఉన్నాయి. ఇప్పుడు నాకు నేను ప్రశాంతంగా ఉన్నా. ప్రస్తుతం అంతా సినిమాలపైనే దృష్టి పెడుతున్నా. ఒత్తిడి అధిగమిస్తూ హాయిగా సినిమాలు చేసుకుంటూ పోతానంతే. గత రెండు సంవత్సరాలు చాలా కష్టంగా గడిచాయి" అని చెప్పింది కత్రినా. ఇప్పుడు ఆమె విజయ్ క్రిష్ణ ఆచారి దర్శకత్వంలో రూపొందుతోన్న 'థగ్స్ ఆఫ్ హిందుస్తాన్'లో చేస్తుంది. అమిర్ ఖాన్, అమితాబ్ ఇందులో కీలక పాత్రల్లో కనిపించనున్నారు.




అనుష్క శర్మ

బ్యాక్ టు వర్క్

అనుష్క శర్మ...ఇటీవలే క్రికెటర్ విరాట్ కోహ్లితో వివాహం జరిగింది. కేప్ టౌన్, సౌత్ ఆఫ్రికా వంటి చోట హనీమూన్ ముగించికొని వచ్చిన ఈ అమ్మడు ఆదివారం నుంచి 'బ్యాక్ టు వర్క్' అని కెమెరా ముందుకొచ్చేసింది. ప్రస్తుతం ఆమె షారుఖ్ ఖాన్ హీరోగా మరుగుజ్జు పాత్రలో చేస్తున్న 'జీరో' సినిమాలో కథానాయికగా నటిస్తుంది. ఆదివారం నుంచి షూటింగ్‌లో పాల్గొన్నది. ఈ సందర్భంగా తన భర్తతో ఫొటోలతో అలంకరించిన గదిలో దిగిన ఫొటోలను ఆమె ట్విట్టర్‌లో పోస్టుచేసింది. ఈ సినిమాలో కత్రినా కైఫ్ కూడా మరో కథానాయికగా నటిస్తోంది.

డా॥ స్పెషలిస్ట్





సానుకూల మార్గాల్లో సంతాన సాఫల్యం

నట్టింట ఓ పసిపాప తారాడుతుంటే ఆ ఆనందమే వేరు. నవ దంపతుల అన్యోన్య దాంపత్యానికి అదొక అపురూప కానుక. కొన్ని కారణాల వల్ల... ఆధునిక జీవన ఆలవాట్ల వల్ల ఇప్పుడు సంతానవంతులు కాలేని వారి సంఖ్య పెరుగుతోంది. సంతానలేమి అనేది దంపతులు ఇద్దరినీ బాధించేదే. మహిళలను మరింత మనోవేదనకు గురిచేస్తోంది. పిల్లలు పుట్టకపోవడానికి కారణం మహిళలే అనే తప్పుడు అవగాహన వారిని మానసికంగా దుర్భర స్థితికి నెట్టేస్తోంది. సంతానం కలగక పోవడానికి కారణాలు భార్యాభర్తల్లో ఎవరికైనా ఉండొచ్చు. కొన్నిసార్లు ఇద్దరిలోనూ ఉండొచ్చు. మహిళల్లో సంతానలేమికి దారితీసే కారణాలను తెలుసుకుని, ఆధునిక వైద్య విజ్ఞాన పరిశోధనల ఫలితాలతో సంతాన సాఫల్యాన్ని ఎలా పొందొచ్చో తెలిపే విశేషాలే ఈ వారం 'డాక్టర్ స్పెషలిస్ట్'లో

సంతానలేమికి కారణాలన్నవి అటు మహిళలలోనూ, ఇటు పురుషులలోనూ లేదా ఒక్కోసారి ఇద్దరిలోనూ ఉండొచ్చు. ఈ సమస్య కేవలం 30 శాతం మంది మహిళల్లో లోపాలవల్ల అయితే, మరో 30 శాతం వరకు పురుషుల్లో లోపాలవల్ల ఏర్పడుతోంది. 40 శాతం వరకూ స్త్రీ, పురుషులిద్దరిలోనూ కొద్దిపాటి లోపాలవల్ల సంతానలేమి సమస్య ఏర్పడుతోంది. సంతానం కలుగకపోతే కేవలం భార్యదే తప్పు అనే అపోహ ఉండేది. కానీ ఆధునిక వైద్య విధానంలో అలాంటి అపోహలకు తావులేకుండా ఎవరిలో లోపం ఉందనేది స్పష్టంగా తెలుసుకోవచ్చు. చాలావరకు 70 శాతం మంది భార్యల్లో ఎలాంటి లోపమూ ఉండకపోవచ్చు. లేకపోతే కొద్దిపాటి సమస్య ఉండవచ్చు. సరైన వైద్య చికిత్సలతో ఆ లోపాన్ని సరిచేసే అవకాశం ఉంది.

ఏది సమస్య ?

భార్యాభర్తలిద్దరూ ఎలాంటి గర్భనిరోధక సాధనాలు వాడకుండా, ఎలాంటి గర్భ నిరోధక పద్ధతులు అనుసరించకుండా...దాంపత్య జీవితాన్ని గడిపితే సాధారణంగా 75 శాతం మందిలో భార్యకు ఏడాదిలోపే గర్భం వస్తుంది. 50 శాతం మందిలో ఐదు మాసాల లోపే గర్భం వస్తుంది. 90 శాతం మంది మహిళలు రెండేళ్లలో గర్భవతులౌతారు. కానీ అంతకాలం తర్వాత కూడా గర్భం రాలేదంటే, ఎవరిలోనైనా ఏదైనా సమస్య ఉందేమోనని భావించాలి. ఈ సమస్యను తెలుసుకోవడానికి స్త్రీలు ముందుకు వచ్చి వైద్యపరీక్షలు చేయించుకున్నట్లుగా, పురుషులు అంత తేలిగ్గా ముందుకు రావడం లేదు. ప్రస్తుత జీవనశైలిని పరిశీలిస్తే తమ తమ రంగాలలో రాణించడం కోసం రాత్రీ పగలూ తేడా లేకుండా కృషి చేయడమన్నది ఇప్పుడొక సాధారణ విషయంగా మారింది. దాంతో సరైన వయసులో పెళ్లికాక, పెళ్లైనవాళ్లల్లో పై కారణాల వల్ల మానసిక ఒత్తిడి విపరీతంగా పెరిగి, సంతానం కలగడానికి అవసరమైన హార్మోన్ల స్రావాలు సరిగా జరగక, సమస్యలు తలెత్తి, అవి సంతానలేమికి దారితీస్తున్నాయి. అయితే ఆధునిక విజ్ఞానం పెరిగిన ఈ రోజుల్లో సంతానలేమికి చక్కటి పరిష్కారాలు అందుబాటులో ఉన్నాయి. కనుక ఆందోళన పడాల్సిన పనేలేదు.



సంతానలేమికి కారణాలు

జీవనశైలితో పాటు కాలుష్యం, వాతావరణం, పొగ తాగడం, మద్యం సేవించడం, బిగుతైన దుస్తులు ధరించడం, అధికబరువు, మానసిక ఒత్తిడి, కొన్నిరకాల మందులు, ఆరోగ్యకరమైన వీర్యం ఉత్పత్తిపై ప్రభావం చూపిస్తాయి. ఆధునికీకరణ, పట్టణీకరణ పెరుగుదలతోపాటు వాతావరణ కాలుష్యం పెరగడమూ సంతానలేమి సమస్యకు కారణం అవుతున్నాయి. ఇవేగాక వృత్తి జీవితంలో, వ్యక్తిగత జీవితంలో మానసిక ఒత్తిడికి గురిచేసే సమస్యలు, పౌష్టికాహారం లోపాలవల్ల హార్మోన్ల అసమతుల్యత ఏర్పడి సంతానలేమి సమస్యకు దారితీస్తోంది.

మహిళల్లో సంతాన లేమి.. కారణాలు

సంతానలేమితో బాధపడే 45 శాతం జంటల్లో లోపం ప్రధానంగా మహిళల్లో కన్పిస్తుంది. వారిలో సంతానలేమికి గల కారణాల్లో ప్రధానమైన అంశాలు–బీజవాహికలు దెబ్బతినడం, రుతుచక్ర సమస్యలు వంటివి ఉంటున్నాయి.


ఎండోమెట్రియాసిస్: గర్భాశయ కణాల్లాంటివి గర్భాశయంలో కాకుండా దాని వెలుపల అసాధారణ రీతిలో వృద్ధి చెందే పరిస్థితిని ఎండోమెట్రియాసిస్‌గా వ్యవహరిస్తారు. సాధారణంగా గర్భాశయం లోపలి కణాలు ప్రతీనెలా రుతుస్రావంలో బయటపడతాయి. వెలుపల ఉండే కణాలు మాత్రం కణజాలానికి అతుక్కొని ఉంటాయి. అండాశయం పైన, బీజవాహికల వద్ద, గర్భాశయం లేదా పేగు వెలుపలి భాగాల వద్ద ఇవి ఉంటాయి. వీటి సమీపంలోని ఇతరభాగాల వద్దా ఇవి ఉండే అవకాశం ఉంది. వెజీనా, సెర్విక్స్, బ్లాడర్ పైభాగాల్లోనూ ఉండే వీలుంది. ఇవి క్యాన్సర్ కారకాలు కానప్పటికీ ఇతరత్రా సమస్యలను కలిగిస్తాయి. ఈ సమస్య ఉన్నవారు ప్రత్యేకంగా ఎలాంటి లక్షణాలనూ బయటకు ప్రదర్శించరు. సంతానలేమికి చికిత్స పొందేవారిలో 20– 50 శాతం దాకా ఈ సమస్యతో బాధపడుతున్నారు. సాధారణంగా 25 –35 ఏళ్ళ వయస్సులో మహిళలు ఈ సమస్యను నిర్ధారించుకోగలుగుతున్నారు. ఫిజికల్ ఎగ్జామినేషన్, కొన్ని భాగాల్లో ఏర్పడే నొప్పిలాంటి వాటితో ఈ సమస్యను గుర్తించవచ్చు. లాప్రోస్కోపీతో దీన్ని నిర్ధారించు కోవచ్చు.

గర్భాశయ సమస్యలు : ఫైబ్రాయిడ్స్ గర్భాశయంలోపల, వెలుపల పెరిగే, క్యాన్సర్ కారకం కాని ఒక విధమైన కంతుల్లాంటివాటిని ఫైబ్రాయిడ్స్ అంటారు. ఇవి రకరకాల కారణాల సమ్మేళనం వల్ల ఏర్పడుతుంటాయి. వీటివల్ల కూడా సంతానలేమి సమస్య ఏర్పడుతుంది.

రుతుచక్ర సంబంధ సమస్యలు: మహిళల సంతానలేమికి సంబంధించిన సమస్యల్లో 20 శాతం దాకా పైన పేర్కొన్న కారణాలవల్ల కలిగేవే. రుతుచక్రం సక్రమంగా జరగకపోవడానికి కూడా చాలా కారణాలున్నాయి. ఈ ఆపసవ్యత కూడా సంతానలేమికి కారణమౌతోంది. వీటి కొన్నింటిని మందులతో, మరికొ న్నింటిని జీవనశైలిలో మార్పులతో పరిష్కరించుకోవచ్చు.

✧ హైపో థాల్మిక్ అన్‌ఒవ్యులేషన్ అనేది వ్యాయామం, ఒత్తిళ్ళు, బరువు తగ్గడంలాంటి వాటి వల్ల ఈ సమస్య ఏర్పడుతుంది.

✧ హైపర్‌ప్రొల్టానేమియా అన్నది పిట్యూటరీ గ్రంథి విడుదల చేసే ప్రొలాక్టిన్ స్థాయి అధికమైనందువల్ల ఏర్పడుతుంది.



✧ పోలీసిస్టిక్ ఓవేరియన్ సింద్రోమ్ (పీసీఓఎస్) అంటే మహిళ రుతుచక్రాన్ని, పిల్లలను కనే శక్తిని, హార్మోన్లను, గుండెను, రక్త నాళాలను ప్రభావితం చేసే సమస్య. ఈ సమస్య ఉన్న వారిలో ఆండ్రోజెన్ (మేల్ హార్మోన్స్) స్థాయిలు అధికంగా ఉండడం, అండాల అభివృద్ధిని, విడుదలను దెబ్బ తీస్తుంది. రుతుచక్రం క్రమబద్ధంగా ఉండదు.

✧ హార్మోన్ సంబంధిత సమస్యలలో పిట్యూటరీ గ్రంథి లేదా హైపోథాలమస్ (మెదడులోని ఓ భాగం) పనితీరు సరిగా లేక పరిపక్వ అండాల ఉత్పత్తిలో వైఫల్యం సంభవిస్తుంది. సర్జరీలు లేదా రేడియేషన్ చికిత్సల వల్ల అండాశయానికి నష్టం వాటిల్లుతుంది.

✧ కొంతమందిలో 40 ఏళ్ళ కంటే ముందుగానే రుతుచక్రం ఆగిపోతుంది. మరి కొందరిలో అండం ఉత్పత్తి అయినప్పటికీ బయటకు రాకపోవడం వంటి ఫోలిసియెల్ సమస్యలూ సంతానలేమికి కారణమే.

✧ మహిళల సంతానలేమి సమస్యల్లో 20 శాతం వరకూ బీజవాహికలు సరిగా పని చేయకపోవడం. వీటికి క్షయ వంటి ఇన్ఫెక్షన్లు, పొత్తికడుపు వ్యాధులు. తొడ, పొత్తికడుపు దగ్గర సర్జరీలు జరిగి బీజ వాహికలు మూసుకుపోవడం, సెర్వికల్ కారణాలు. ఇలా చాలా ఆంశాలు సంతాన లేమికి దారితీస్తున్నాయి.

✧ మహిళలకు 30 సంవత్సరాల వయసు దాటాక గర్భధారణ అవకాశాలు తగ్గిపోతాయి. మధు మేహం, మూర్ఛ, థైరాయిడ్, మలాశయ సంబంధవ్యాధులు, వివిధ రకాల ఒత్తిళ్ళ, స్థూలకాయం, తక్కువ బరువు, ధూమపానమూ మహిళల్లో సంతానలేమి సమస్యకు కారణమౌతున్నాయి.

సంతానలేమికి చికిత్సలు

మహిళల్లో సంతానలేమి సమస్య నిర్ధారణైతే అందుకు చేసే చికిత్స వివిధ రకాలుగా ఉంటుంది.

➤ మొదట ఆ జంటకు కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. ఆ తరువాత జీవనశైలిలో చేసుకోవాల్సిన మార్పులను గురించి వివరిస్తారు.

➤ పోషకాహారం ఆవశ్యకతను వివరించడంతో పాటు అధికంగా బరువు ఉంటే తగ్గాల్సిందిగా సూచిస్తారు.

➤ ఆ తరువాత సెక్సువల్ కౌన్సెలింగ్ నిర్వహిస్తారు.

➤ అవసరాన్నిబట్టి ఎండోమెట్రియోసిస్, ఫైబ్రాయిడ్స్ లాంటి పరీక్షలు చేస్తారు.

➤ థైరాయిడ్ సమస్యలు, హైపర్‌ప్రొలాక్టినేమియా, పీసీఓఎస్ లాంటి ఎండోక్రానికల్ సమస్యలకు చికిత్స చేస్తారు.

➤ ఒవులేషన్ ఇండక్షన్ (ఒక రుతుచక్రంలో పలు అండాలు విడుదలయ్యేందుకు దోహదం చేసే ఔషధాల వినియోగం), సరైన సమయంలో దంపతులు కలుసుకోవడంపై సూచనలు ఇస్తారు.

➤ ఒవులేషన్ ఇండక్షన్ తర్వాత ఐయూఐ (కృత్రిమంగా వీర్య కణాలను రిప్రొడక్టివ్ ట్రాక్‌లోకి ప్రవేశపెట్టే ప్రక్రియ) అనుసరిస్తారు.

➤ కంట్రోల్డ్ ఓవేరియన్ హైపర్‌స్టిమ్యులేషన్, అనంతరం ఐవీఎఫ్ లేదా ఐసీఎస్ఐ విధానంలో చికిత్స చేస్తారు

➤ ఇన్విట్రో మెచ్యురేషన్ (ఐవీఎం)– డ్రగ్ ఫ్రీ ఐవీఎం, లేజర్ అసిస్టెడ్ హేచింగ్, ఊసైట్ విట్రిఫికేషన్, ఎంబ్రోయొ విట్రిఫికేషన్ వంటి విధానాల్లోనూ సంతాన సాఫల్యతకు మార్గాన్ని సుగగమం చేస్తారు.



డాక్టర్ జిన్సీ మాథ్యూ ,ఎం డి.,
ఐవీఎఫ్ స్పెషలిస్ట్,
రీప్రొడక్టివ్ మెడిసిన్ కన్సల్టెంట్,
మణిపాల్ ఫెర్టిలిటీ సెంటర్ - ఒంగోలు.

ఐవిఎఫ్ ఓ మంచి అవకాశం


ఇన్‌విట్రో ఫెర్టిలైజేషన్ (ఐవిఎఫ్) విధానం మన దేశంలోకి ప్రవేశించిన కొత్తలో దీనిని తీవ్రంగా వ్యతిరేకించేవారు. ఈ విధానం ద్వారా కలిగిన సంతానం ఆ దంపతుల సంతానం కాదన్నది వారి అభిప్రాయం. ఈ విధానం ద్వారా పుట్టే పిల్లలకు పూర్తి కారకులు ఆ దంపతులేననీ చెప్పలేం, కాదనీ చెప్పలేం. ఎందుకంటే లోపాల్ని స్త్రీలో గుర్తించినప్పుడు అంటే స్త్రీలో అండం విడుదలవడం లేదని కనుక్కున్నప్పుడు డాక్టర్లు మరొకస్త్రీ యొక్క అండాన్ని తీసుకుని, అండం విడుదల నిలిచిపోయిన స్త్రీ యొక్క భర్త వీర్యకణంతో ఫలదీకరణం చెందించి గర్భం వచ్చేలా చేస్తారు. ఒకవేళ మగవారిలో లోపం ఉన్నట్టు తేలితే అతని శుక్రకణాల విడుదల తీరు గర్భం వచ్చేందుకు అనువైన రీతిలో లేకపోతే మరొక పురుషునియొక్క శుక్రకణంతో స్త్రీయొక్క అండాన్ని ఫలదీకరించి గర్భధారణ జరిగేటట్టు చేస్తారు. కనుక గర్భధారణకు దంపతుల్లో ఎవరో ఒకరు మాత్రమే కారకులన్నది వాస్తవం. ప్రారంభంలో ఈ ప్రక్రియను వ్యతిరేకించారు. చిన్నచూపు చూశారు. కానీ సైన్స్‌పై ఆవగాహన పెరుగుతుండడంతో మెజారిటీ జంటలు ఈ వైద్యవిధానం ద్వారా సంతానవంతులు కావడానికి మొగ్గు చూపుతున్నారు. పట్టణాలలో నివసించే ప్రజలేకాకుండా పల్లెల్లో నివసించే నిరక్షరాస్యులు కూడా దీనికి మొగ్గుచూపుతున్నారు. వారు ఈ ఫెర్టిలిటీ సెంటర్లకు వచ్చి నిర్భయంగా సమస్యలను చర్చించుకుని ఈ ఆధునిక వైద్యవిధానం ద్వారా సాఫల్యానికి ప్రయత్నిస్తున్నారంటే ఇది మెడికల్ సైన్సు సాధించిన ఒక మహత్తర విజయమే.





చిన్నారి

తేడాలు కనుక్కోండి!



పిల్లలూ..! పైనున్న రెండుచిత్రాల్లో ఏడు తేడాలున్నాయి. అవి ఏమిటో కనుక్కోండి.

పొడుపు కథ

పంటలయ్యాక వస్తా..
ముగ్గులపోటీ తెస్తా..
దాసులతో అలరిస్తా..
అందర్నీ
ఆనందింపజేస్తా..?

(జవాబు తలకిందులుగా ముద్రించబడింది)

జోక్ :

టీచర్ : పిల్లలూ! ఆక్సిజన్‌ను 1733లో కనిపెట్టారు.
చింటు : మరి అంతకు ముందు మనుషులు లేరా టీచర్..?

సందడే సందడి!


పిల్లలూ..! ఈ మధ్య విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో 'హానర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్'వారు ఒక రికార్డును నమోదు చేశారు. ఎందుకో తెలుసా? ఒకరు కాదు ఇద్దరు కాదు 405 మంది నృత్యకారులు కూచిపూడి



నృత్యాన్ని ఒకే వేదిక మీద ప్రదర్శించినందుకు ఈ రికార్డును ఇచ్చారు. ఆ రోజంతా ఆడిటోరియం కూచిపూడి నృత్యకారులతో సందడిగా ఉంది. అందరూ నృత్యకారులు గ్రూపులుగా విడిపోయి నృత్యాన్ని ప్రదర్శిస్తున్నారు. కొందరు కుండమీద నిలబడి, చేతిలో దీపాలు పెట్టుకుని నృత్యం చేస్తున్నారు. మరికొందరు 'అయిగిరి నందిని నందిత మోహిని పాట'కు నృత్యం చేస్తున్నారు. ఒకరి తర్వాత ఒకరు వారి గురువుల సమక్షంలో స్టేజీమీద పోటాపోటీగా నృత్యాలు చేశారు. ఈ ప్రదర్శనలో ఎక్కువగా విద్యార్థులే పాల్గొన్నారు. అయితే అందరిలోనూ ప్రత్యేకంగా ఎస్. ప్రత్యూష కనబడింది. ఆమె వెంకటేశ్వరస్వామి వేషధారణలో ఉంది. స్టేజీమీద నృత్య ప్రదర్శన ఇచ్చేలోపు ప్రతి ఒక్కరూ ఆమె దగ్గరకు వెళ్లడం, సెల్ఫీ దిగటం అక్కడ ఆకర్షణగా కనబడింది. ఆమె ఒక సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. చిన్నప్పునుంచి ఆమెకు నృత్యమంటే చాలా ఇష్టమట అందుకే ఒడిస్సీ, కథక్, భరతనాట్యం, వెస్ట్రన్, ఫోక్ డాన్స్‌లన్నింటిలోనూ ఆమెకు ప్రవేశం ఉంది. కళలంటే ఇష్టముంటే ఎంతకష్టమైనా నేర్చుకోవచ్చు. చూశారా పిల్లలూ..! మన అభిరుచికి ఉద్యోగం అడ్డుకాదనడానికి ప్రత్యూషయే ఒక ఉదాహరణ . ★



పిల్లల్లారా.. రారండి!!



హాయ్ పిల్లలూ!
మీలో చాలా టాలెంట్ ఉంది కదూ! మీకు పాటలొచ్చు. బొమ్మలొచ్చు, బోల్డన్ని ఆటలొచ్చు. మేజిక్కులొచ్చు. అలాగే కథలూ రాస్తారు కదూ?!. మాకెలా తెలుసంటారా? అసలు పిల్లలంటేనే.. క్రియేటివ్ కిడ్స్‌కదా?! చక్కగా చదువుకుంటూనే ఆటలు, పాటలతో మీరంతా అదరగొట్టేస్తారని మాకు తెలుసు. అందుకే మీరు వేసిన బొమ్మలు, కార్టూన్లు, రాసిన బుల్లిబుల్లి కథలు.. వేసిన నాటకాలు.. ఇంకా మీరు కనిపెట్టిన సైన్స్ సంగతులు.. మీరు చూసొచ్చిన కొత్త ప్రదేశాల విశేషాలూ ... 'చిన్నారి' పేజీలో పంచుకోండి. వాటిని మీ పేరుతో, మీ ఫొటోతో ప్రచురిస్తాం. నిజమా?! అని ఆశ్చర్యపోకండి. నిజమే. అందుకే మీలో దాగి ఉన్న ఏ టాలెంట్ గురించి అయినా మాకు రాసి పంపండి. ఇంకెందుకు ఆలస్యం... పెన్ను, పెన్సిల్, బ్రష్‌తో రెడీ అయిపోండి.!

చిరునామా

చిన్నారి, జీవన, ప్రజాశక్తి తెలుగు దినపత్రిక,
హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.
ఇ మెయిల్ - jeevanapageps@gmail.com

స్టేజీ ఎక్కనని ఏడ్చేశా!



నా పేరు పి.లాస్య. నేను లిటిల్‌బడ్స్ హైస్కూల్లో ఒకటవ తరగతి చదువుతున్నాను. మా అమ్మ క్లాసికల్ డ్యాన్సర్. చిన్నప్పటి నుంచి అమ్మ డ్యాన్స్ చేయడం చూస్తూ ఉండేదాన్నిని. నాకూ క్లాసికల్ డ్యాన్స్ అంటే ఇష్టం. మూడేళ్ల వయస్సున్నప్పుడే టీవిలో క్లాసికల్ డాన్స్‌లను చూసి, నేను నృత్యం చేయడానికి ఆసక్తి చూపేదానినని అమ్మ ఎప్పుడూ చెబుతుంటుంది. ఆ వయస్సులోనే కూచిపూడి డాన్స్ నేర్చుకోవడం ప్రారంభించాను. మొదట్లో ముద్రలు, జతులు నేర్చుకోవడానికి చాలా కష్టమనిపించేది. అలాఅలా చిన్నగా పాటలకు డాన్స్ వేయడమూ నేర్చుకున్నాను. నేను 'అభినవ నృత్య భారతి ఇంటర్ నేషనల్ డ్యాన్స్ కాంపిటీషన్స్'లో పాల్గొని నృత్య ప్రదర్శన చేశా. అదే నా మొదటి ప్రదర్శన. మొదటి షో కావడంతో చాలా భయమేసింది. స్టేజీ ఎక్కనని ఏడ్చేశా. అప్పుడు అమ్మే నాకు ధైర్యం చెప్పింది. అక్కడ కూచిపూడి డ్యాన్స్ వేయడానికి వచ్చినవారందరూ చాలా పెద్దవాళ్లు. వాళ్లంతా ఇంత చిన్నపిల్ల కూచిపూడి డ్యాన్స్ చేస్తుందా? అంటూ ఆశ్యర్యపోయారు. ఎట్టకేలకు నేనూ మిగతా కళాకారులతో పోటీపడి నృత్యం చేశా. ఆ నృత్యానికి నాకు కన్సోలేషన్ బహుమతి వచ్చింది. తర్వాత చాలాచోట్ల నృత్య ప్రదర్శనలిచ్చి ఎన్నో బహుమతులు పొందాం. నేను ఇంత బాగా డ్యాన్స్ నేర్చుకోవడానికి అమ్మానాన్నే కారణం.

పి.లాస్య,
లిటిల్‌బడ్స్ హైస్కూల్,
ఒకటవ తరగతి,
విజయవాడ.

అనుకున్నంత అయ్యింది... గెలుస్తారనుకున్న మ్యాచ్ చేజారింది... విజయలక్ష్యం 208 పరుగులైనా... చేసింది 135 పరుగులే... రెండో ఇన్నింగ్స్‌లో దక్షిణాఫ్రికా 130 పరుగులు చేసినప్పటికీ ఆ జట్టును బౌలర్లు గెలిపించారు... ఫిలాండర్ ఒక్కడే ఆరు వికెట్లు పడగొట్టి మ్యాచ్ గెలిపించాడు... కేప్‌టౌన్ మైదానం ఇరుజట్ల బౌలర్లకు స్వర్గధామంగా మారింది...



భారత్ పరాజయం

ఫిలాండర్ ఫీట్‌తో విలవిల

కేప్‌టౌన్ : దక్షిణాఫ్రికాతో జరిగిన తొలి టెస్ట్‌లో భారత్ 72 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. రెండో ఇన్నింగ్స్‌లో 208 విజయలక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన భారత జట్టు కేవలం 135 పరుగులు మాత్రమే చేసి మ్యాచ్‌ను చేజార్చుకుంది. అంతకుముందు దక్షిణాఫ్రికా జట్టు సైతం తన రెండో ఇన్నింగ్స్‌ను 130 పరుగులకే పరిమితం కావడంతో భారత్‌కు విజయం నల్లేరుమీద నడకే అనుకున్నప్పటికీ.. భారతజట్టు బ్యాట్స్‌మన్లు క్రీజ్‌లో నిలదొక్కుకోలేకపోయారు. సఫారీ జట్టు బౌలర్ ఫిలాండర్ ఒక్కడే ఆరు వికెట్లు పడగొట్టి ఆ జట్టుకు విజయాన్ని చేకూర్చాడు. దీంతో మూడు టెస్ట్‌ల సిరీస్‌లో 1-0 ఆధిక్యతలో దక్షిణాఫ్రికా జట్టు నిలిచింది.కేప్‌టౌన్‌లో వర్షం కారణంగా మూడోరోజు ఆట రద్దు అవ్వడంతో సోమవారం బౌలర్ల ఆధిపత్యం కొనసాగింది. నాల్గోరోజు ఒక్కరోజే 18 వికెట్లు ఇరుజట్లకు చెందిన బౌలర్లు పడగొట్టారు. తొలుత టీమిండియా బౌలర్లు సమిష్టిగా చెలరేగడంతో పటిష్ఠంగా ఆత్మ విశ్వాసంతో కనిపించిన డుప్లెసిస్ సేన చెల్లాచెదురైంది. భారత బౌలర్లు సఫారీ జట్టు బ్యాట్స్‌మన్లకు క్రీజ్‌లో నిలదొక్కుకొనే అవకాశమే ఇవ్వలేదు. దీంతో ఆ జట్టంతా కనీసం తొలి సెషన్ ముగిసే వరకూ మైదానంలో నిలవక 41.2 ఓవర్లలో 130 పరుగులకు ఆలౌటైంది.

స్వల్ప పరుగుల తేడాతోనే..

మూడోరోజు ఆటంతా వర్షార్పణం కావడంతో నాలుగో రోజు, సోమవారం దక్షిణాఫ్రికా 65/2తో ఆటను కొనసాగించింది. క్రీజులో నైట్‌వాచ్‌మన్ ఆమ్లా (4), రబాడ (5)లు నిలదొక్కుకోలేకపోయారు. ఆరంభం నుంచే షమి (3/39), అరంగేట్ర ఆటగాడు బుమ్రా (3/39), భువనేశ్వర్ కుమార్ (2/33) చురకత్తుల్లాంటి బంతులు సంధించారు. దీంతో సఫారీ బ్యాట్స్‌మెన్ బ్యాట్లు ఎత్తేశారు! జట్టు స్కోరు 66 వద్ద ఆమ్లా, 73 వద్ద రబాడను షమి పెవిలియన్ పంపించాడు. మరో 9 పరుగులకే సారథి డుప్లెసిస్ (0)ను ఐదో వికెట్‌గా బుమ్రా ఔట్ చేశాడు. కీపర్ బ్యాట్స్‌మన్ డికాక్ (0)నూ మైదానంలో నిలవనీయలేదు. మరో పది పరుగులకే 30.4వ బంతికి అతడిని వెనక్కి పంపించాడు. ఆ తర్వాత 3 పరుగులకే ఫిలాండర్ (0) షమి వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు. దీంతో ఏబీ డివిలియర్స్ (35)కు తోడుగా నిలిచేవారే కరవయ్యారు. బుమ్రా బౌలింగ్‌లో భారీ సిక్సర్ బాదబో యిన చివరి వికెట్‌గా జట్టు స్కోరు 130 వద్ద పెవిలియన్ చేరాడు. అంతకు ముందు కేశవ్ మహరాజ్ (15), మోర్నీ మోర్కెల్ (2)ను భువి ఔట్ చేశాడు. చివరికి గాయపడ్డ డేల్ స్టెయిన్ (0) నాటౌట్‌గా నిలిచాడు.

దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్

మార్క్రమ్ (సి) కుమార్ (బి) పాండ్యా	34
ఎల్గర్ (సి) సాహా (బి) పాండ్యా	25
రబడా (సి) కోహ్లీ (బి) షమి	5
ఆమ్లా (సి) శర్మ (బి) షమి	4
ఎబి డివిలియర్స్ (సి) కుమార్ (బి) బుమ్రా	35
డుప్లెసిస్ (సి) సాహా (బి) బుమ్రా	0
డికాక్ (సి) సాహా (బి) బుమ్రా	8
ఫిలాండర్ (ఎల్‌బి) షమి	0
మహరాజ్ (సి) సాహా (బి) కుమార్	15
మోర్కెల్ (సి) సాహా (బి) కుమార్	2
స్టెయిన్ (నాటౌట్)	0

మొత్తం (41.2 ఓవర్లలో)130 ఆలౌట్
ఇండియా బౌలింగ్: భువనేశ్వర్ -33/3, షమి-28/3, పాండ్యా 27/2, బుమ్రా 39/2

భారత్ రెండో ఇన్నింగ్స్

విజయ్ (సి) డివిలియర్స్ (బి) ఫిలాండర్	13
ధావన్ (సి-సబ్) మోరిస్ (బి) మోర్కెల్	16
పుజారా (సి) డికాక్ (బి) మోర్కెల్	4
కోహ్లీ (ఎల్‌బి) ఫిలాండర్	28
రోహిత్ శర్మ (బి) ఫిలాండర్	10
సాహా (ఎల్‌బి) రబడా	8
పాండ్యా (సి) డివిలియర్స్ (బి) రబడా	1
అశ్విన్ (సి) డికాక్ (బి) ఫిలాండర్	37
బి.కుమార్ (నాటౌట్)	13
షమి (సి)డుప్లెసిస్ (బి) ఫిలాండర్	4
బుమ్రా (సి) డుప్లెసిస్ (బి) ఫిలాండర్	0

మొత్తం (42. 4 ఓవర్లలో) 135 ఆలౌట్
సౌత్ ఆఫ్రికా బౌలింగ్ : ఫిలాండర్ 42/6, మోర్కెలా 39/2, రబడా 41/2

సాహా రికార్డ్



కేప్‌టౌన్ వేదికగా జరుగుతున్న తొలి టెస్టులో భారత వికెట్ కీపర్ వృద్ధిమాన్ సాహా అరుదైన రికార్డ్‌ను నెలకొల్పాడు. టీమిండియా తరపున ఒక టెస్టులో అత్యధిక క్యాచ్‌లు అందుకున్న వికెట్ కీపర్‌గా ధోనీ రికార్డును బద్దలు కొట్టాడు. తొలి ఇన్నింగ్స్‌లో ఐదు క్యాచ్‌లు అందుకున్న సాహా.. రెండో ఇన్నింగ్స్‌లోనూ ఐదు క్యాచ్‌లు పట్టాడు. దీంతో మొత్తం పది వికెట్లను కూల్చడంలో భాగస్వామ్యం పొందిన తొలి భారత కీపర్‌గా నిలిచాడు. 2014-15 సీజన్లో మెల్‌బోర్న్ వేదికగా ఆస్ట్రేలియాతో జరిగిన టెస్టులో ధోనీ వికెట్ కీపర్‌గా 9 మంది బ్యాట్స్‌మెన్‌ను పెవిలియన్ చేర్చాడు. ఆ రికార్డ్‌ను సాహా అధిగమించాడు.

ఫైనల్లో ఓడిన నీల్ జోషి

బర్మింగ్‌హామ్: బ్రిటీష్ ఓపెన్ జూనియర్ స్క్వాష్ టోర్నమెంట్‌లో భారత క్రీడాకారుడు నీల్ జోషి రన్నరప్‌గా నిలిచాడు. ఆదివారం జరిగిన బాలుర అండర్-15 సింగిల్స్ ఫైనల్లో నీల్ జోషి 8-11, 16-14, 0-11, 12-14తో టాప్ సీడ్ సామ్ టాడ్ (ఇంగ్లండ్) చేతిలో ఓడిపోయాడు. అండర్-17 బాలుర సెమీఫైనల్లో తుషార్ సహాని 11-9, 2-11, 3-11, 8-11తో టాప్ సీడ్ ఒమర్ టోర్కీ (ఈజిప్ట్) చేతిలో పరాజయం చవిచూశాడు.

వివాదంగా మారిన శరత్ రంజన్ ఎంపిక

పాట్నా : సయ్యద్ ముస్తాక్ ఆలీ టి20 టోర్నీకి శర్తక్ రంజన్ (23) ఎంపిక వివాదంగా మారింది. సోమవారం ఢిల్లీ జట్టు తరఫున ఈ టోర్నీకి ప్రకటించిన జాబితా చోటు లభించింది. అతని ప్రదర్శన ఏమంత ఆశాజనకంగా లేకపోవడం ఒక కారణంగా కాగా... అతడు బీహార్ ఎంపి పప్పూ యాదవ్ కుమారుడు కావడం మరో విశేషం. రంజన్ చివరి మూడు మ్యాచ్‌లలో 5, 3, 2 పరుగులు మాత్రమే సాధించాడు. అయినా అతనిని ఢిల్లీ జట్టు తరఫున ప్రకటించిన జాబితాలో చోటు లభించడంతో ఈ వివాదానికి దారితీసింది. అతుల్ వాసన్, హరిగిద్వానీ, రాబిన్ సింగ్ (జూనియర్)లతో కూడిన ఢిల్లీ సెలెక్షన్ కమిటీలో సభ్యులుగా ఉన్నారు.

చెన్నై స్మాషర్స్ జయభేరి

చెన్నై : ప్రిమియర్ బ్యాడ్మింటన్ లీగ్‌లో చెన్నై స్మాషర్స్ 3-2తో జయభేరి మోగించింది. సోమవారం బెంగుళూరు బ్లాస్టర్స్‌తో తలపడిన ఆ జట్టు బెంగళూరు బ్లాస్టర్స్ తీసుకున్న పురుషుల డబుల్స్ తొలి ట్రంప్ మ్యాచ్‌లో చెన్నై గెలిచి 1-(-1) పాయింట్ల ఆధిక్యత సంపాదించింది. ఈ మ్యాచ్‌ను 8-15, 15-14, 15-13 సెట్లతో గెలిచింది. మహిళల సింగిల్స్ మ్యాచ్‌ను ట్రంప్‌గా ఎన్నుకొన్న పివి సింధూ(చెన్నై) 15-9, 15-14తో గెలిచి 3-0 తిరుగులేని ఆధిక్యత సంపాదించింది. పురుషుల సింగిల్స్ రెండు మ్యాచ్‌లు, మిక్సిడ్ డబుల్స్ మ్యాచ్ చెన్నై ఓడినప్పటికీ బెంగళూరు విజయం సాధించలేకపోయింది. చివరకు బెంగళూరు బ్లాస్టర్స్‌పై 3-2తో చెన్నై విజయం సాధించింది.

ఐదో టెస్ట్ ఆసీస్‌దే..

సిడ్నీ: యాషెస్ సిరీస్‌ను ఆస్ట్రేలియా జట్టు 4-0తో కైవసం చేసుకుంది. ఎన్నో ఏళ్ళ పూర్వ చరిత్ర ఉన్న ప్రతిష్టాత్మక సిరీస్‌ను 3-0తో ఆసీస్ ఇప్పటికే గెలుచుకుంది. సోమవారం సిడ్నీలో జరిగిన చివరి టెస్టులో ఆసీస్ ఇన్నింగ్స్ 123 పరుగులతో తేడాతో విజయం సాధించింది. దీంతో ఐదు టెస్టు మ్యాచ్‌ల సిరీస్‌ను కంగారూల జట్టు 4-0తో దక్కించుకుంది. నాలుగో టెస్టు డ్రాగా ముగిసిన సంగతి తెలిసిందే. ఇంగ్లండ్ జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో ఆ జట్టు 346 పరుగులు చేయగా... ఆసీస్ 649/7 భారీ స్కోర్ వద్ద తొలి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. అనంతరం రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన ఇంగ్లాండ్‌జట్టు ఆసీస్ బౌలర్ కమిన్స్ ధాటికి 180 పరుగులకే కుప్పకూలింది.

దీంతో ఆసీస్ ఇన్నింగ్స్ 123 పరుగులతో ఘన విజయం సాధించింది. ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో ఆ జట్టు బ్యాట్స్‌మన్లు డేవిడ్ వార్నర్(56), ఖ్వాజా(171), స్మిత్(83), షాన్ మార్ష్(156), మిచెల్ మార్ష్(101) సమిష్టిగా రాణించారు. ఇంగ్లాండ్‌ను కుప్పకూల్చిన కమిన్స్‌కు మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ లభించింది. కెప్టెన్ ఇన్నింగ్స్‌తో ఆసీస్‌కు విజయాలను అందించిన స్టీవ్ స్మిత్‌కు మ్యాన్ ఆఫ్ ది సిరీస్ అవార్డు అందుకున్నాడు.

తొలి మ్యాచ్‌లో ఆంధ్రా ఓటమి

అట్టహాసంగా ప్రారంభమైన ముస్తక్ అలీ టీ20 మ్యాచ్‌లు

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

విశాఖపట్నం, విజయనగరం జిల్లాల్లో జరుగుతున్న సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 క్రికెట్ మ్యాచ్‌లు సోమవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. విశాఖపట్నంలోని ఏసిఎ-విడిసిఎ మైదానంలో ఆంధ్రా, తమిళనాడు జట్లు తొలుత తలబడ్డాయి. ఈ మ్యాచ్‌లో ఆంధ్రా జట్టు 7 వికెట్ల తేడాతో ఓటమి పాలైంది. టాస్ గెలిచిన ఆంధ్రా జట్టు తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 20 ఓవర్లలో 119/7 పరుగులు చేసింది. ఈ జట్టులో విశాఖ కుర్రాడు రిక్కీ బుయి 25, సోబా మహమ్మద్ ఖాన్ 20, డిబి రవితేజ 19, డిబి ప్రశాంత్ 19 పరుగులు చేశారు. ప్రత్యర్థి జట్టుకు చెందిన కె.విగ్నేష్ 17 పరుగులకు రెండు వికెట్లు పడగొట్టాడు. స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన తమిళనాడు జట్టు 14.4 ఓవర్లకు 3 వికెట్ల నష్టానికి 122 పరుగులు చేసి విజయం సాధించింది. ఈ జట్టులో దినేష్ కార్తిక్ 57, బి.అపరజిత్ 28 పరుగులు చేసి జట్టును విజయ తీరాలకు నడిపించారు. ఆంధ్రా బౌలర్ జిహెచ్ విహారి ఒక వికెట్ తీశాడు.

బిజెపిని గద్దె దింపడమే కర్తవ్యం

- విశాల ఐక్యవేదిక అవసరం
- సిపిఐ జాతీయ సమావేశాల్లో సురవరం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

బిజెపిని అధికారం నుంచి తప్పించడమే తక్షణ రాజకీయ కర్తవ్యమని సిపిఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి స్పష్టం చేశారు. హిందూత్వ శక్తుల దాడులపై పోరాటాలు చేయడం చాలా అవసరమన్నారు. దేశంలో ప్రజాస్వామ్యం, లౌకికవాదాన్ని కాపాడాలనుకునే రాజకీయ, రాజకీయేతర శక్తులతో కలసి విశాల ఐక్య వేదికను ఏర్పాటు చేయాలని, అందుకు ఉభయ కమ్యునిస్టు పార్టీలు బలోపేతం కావాలని ఆయన ఉద్ఘాటించారు. దాసరి భవన్‌లో సిపిఐ జాతీయ సమావేశాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన ప్రారంభోపన్యాసం చేస్తూ, బిజెపిలో అవినీతి బాగా పెరిగిపోయిందని విమర్శించారు. బిజెపి అధ్యక్షుడు అమిత్‌షా కుమారుడు జైషా అవినీతి బయటపడినప్పటికీ ఎలాంటి చర్యలూ లేవన్నారు. జర్నలిస్టులు, విశ్వవిద్యాలయాల్లో ప్రొఫెసర్లు, విద్యార్థి నాయకులు, ఉద్యమాలు నిర్వహించే దళితులపైనా కేసులు నమోదు చేసి ఒత్తిళ్లకు గురిచేస్తున్నారని విమర్శించారు. పాలన, న్యాయ వ్యవస్థను సైతం తమ గుప్పిట్లోకి తీసుకొని నియంత్రించేందుకు బిజెపి ప్రయత్నిస్తోందని దుయ్యబట్టారు. హిందూత్వ శక్తుల దాడులు మైనార్టీల్లో అభద్రతాభావాన్ని కలిగిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ధరలు రోజురోజుకూ విపరీతంగా పెరిగిపోతుండడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. అన్ని చోట్లా నిరుద్యోగం తాండవిస్తోందని, యువత తీవ్రమైన అసంతృప్తికి లోనవుతోందని తెలిపారు. మరోవైపు ప్రజలపై పన్నుల భారం కూడా పెరుగుతోందని చెప్పారు. అగ్రరాజ్యం అమెరికా అభివృద్ధి చెందుతున్న దేశాలపై తన పెత్తనాన్ని చూపేందుకు ప్రయత్నిస్తోందన్నారు. ఆ దేశంలో విపరీతమైన నిరుద్యోగం, ఆర్థిక సంక్షోభం కారణంగానే అక్కడి పేద, మధ్య తరగతి ప్రజలిచ్చిన తీర్పుతోనే డోనాల్డ్ ట్రంప్ అధికారంలోకి వచ్చారన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో ఆ పార్టీ కేంద్ర కార్యదర్శివర్గసభ్యులు హషీమ్ ఫైజీ, డి రాజా, కె నారాయణ, రామేంద్రకుమార్, అతుల్‌కుమార్ అంజన్, పన్నీర్ రవీంద్రన్, నాగేంద్రనాథ్ ఝా, అమర్‌జిత్‌కౌర్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న సురవరం సుధాకరరెడ్డి

కావలి ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తా

- నెల్లూరు జిల్లా తుమ్మలపెంట జన్మభూమి సభలో మంత్రి లోకేష్

ప్రజాశక్తి - కావలి రూరల్ (నెల్లూరు)/శ్రీకాళహస్తి (చిత్తూరు)



తుమ్మలపెంటలో జరిగిన జన్మభూమి కార్యక్రమంలో కార్యకర్తలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న మంత్రులు లోకేష్, చంద్రమోహన్‌రెడ్డి, నారాయణ తదితరులు

50 ఏళ్ల నుంచి వెనుకబడిన నెల్లూరు జిల్లా కావలి ప్రాంతాన్ని అన్ని రంగాల్లోనూ సస్యశ్యామలం చేస్తానని పంచాయతీరాజ్, ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ అన్నారు. సోమవారం మండలంలోని తుమ్మలపెంటలో ఆయన పర్యటించారు. అనంతరం తుమ్మలపెంట బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో నిర్వహించిన జన్మభూమి-మాఊరు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నవ్యాంధ్ర రాజధాని నిర్మాణ సలహా కమిటీ సభ్యులు బీద మస్తాన్‌రావు కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ.. తుమ్మలపెంట ప్రాంతం తాతయ్య నందమూరి తారక రామారావు ఇష్టపడిన ప్రాంతమన్నారు. తాతయ్య ప్రారంభించిన ఈ గురుకుల పాఠశాలకు వచ్చి మిమ్మల్ని కలవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. తాతయ్య వారసత్వాన్ని పుణికిపుచ్చుకుని ఆయన బాటలోనే నడుస్తానన్నారు. అదే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్రంలో లోటు బడ్జెట్‌లో ఉన్నా నిరంతర శ్రామికుడిగా కష్టపడుతూ రాష్ట్రాభివృద్ధికి బాటలు వేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి రుణమాఫీ చేయడం రాష్ట్ర ప్రజల అదృష్టమన్నారు. అదే విధంగా మత్స్యకారులకు పెద్దపీట వేసిన ఘనత తెలుగుదేశం ప్రభుత్వానికే దక్కిందన్నారు. బడ్జెట్‌లో మత్స్యశాఖకు అధిక నిధులు కేటాయించి వారి కుటుంబాల్లో వెలుగులు నింపింది టిడిపేనన్నారు. గతంలో కాంగ్రెస్ హయాంలో రైతులను దగాచేసి, వారు ఆత్మహత్యలకు పురిగొల్పే విధంగా రాక్షస పాలన సాగించారని తెలిపారు. ఆయన వెంట మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, పి.నారాయణ, ఎమ్మెల్సీ బీద రవిచంద్రలు ఉన్నారు.

మళ్లీ అబద్ధాలే చెబుతున్న చంద్రబాబు

వైసిపి నాయకుడు బొత్స ధ్వజం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎప్పటిలాగే అబద్ధాలే చెబుతున్నారని వైసిపి నాయకుడు బొత్స సత్యనారాయణ విమర్శించారు. కర్నూలు సభలో ప్రాజెక్టుల కోసం రూ.50 వేల కోట్లు ఖర్చు చేశామంటూ చంద్రబాబు పేర్కొనడం హాస్యాస్పదమని వ్యాఖ్యానించారు. సోమవారం హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. జీవో 22 ప్రకారం గడిచిన నాలుగేళ్లలో ఇరిగేషన్ కోసం రూ.27,898 కోట్లు ఖర్చు చేస్తే అందులో ప్రాజెక్టులకు ఖర్చు చేసింది కేవలం రూ.16,186 కోట్లేనని బొత్స తెలిపారు. మిగిలినవి అంచనాలు పెంచుకుని కాజేశారని ఆరోపించారు. ఇది చాలదన్నట్లు ఈ నాలుగేళ్లలో రూ.1.20 లక్షల కోట్లు అప్పుచేశారని, దీంట్లో రూ.20 వేల కోట్లయినా ప్రాజెక్టులకు ఖర్చు చేయలేకపోయారని విమర్శించారు. కొత్త సంవత్సరంలోనైనా చంద్రబాబు నాయుడు వాస్తవాలు చెబుతారనుకుంటే ఆయన తీరులో ఎలాంటి మార్పూ లేదన్నారు. రైతు రుణమాఫీ కోసం రూ.24 వేల కోట్లు ఖర్చు చేశామని చెబుతున్నారని, వాస్తవంగా నాలుగేళ్లలో రూ.12 వేల కోట్లు కూడా ఖర్చు చేయలేదని తెలిపారు. అబద్ధాలే సిఎం పదేపదే చెబుతూ ప్రజలను ఇంకా మభ్యపెట్టాలని చూస్తున్నారని ధ్వజమెత్తారు. రాజధాని నిర్మాణానికి కేంద్రం రూ.1500 కోట్లు ఇస్తే, రాష్ట్ర ప్రభుత్వం రూ.1583 కోట్లు ఖర్చు చేశామని చెప్పుకుంటోందని, ఇంతఖర్చు చేసినా శాశ్వత భవనాల నిర్మాణం ఎక్కడ చేపట్టారో అర్థం కావడంలేదని అన్నారు. రేషన్ కార్డులు, పించన్లపై అన్నీ నిజాలే చెబుతున్నప్పుడు అంబటి రాంబాబును అక్రమంగా అరెస్ట్ చేయడమేమిటని ప్రశ్నించారు.

Published and Printed by Paturu Ramaiah on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governarpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Paturu Ramaiah, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68